అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

సోమవారం 04-02-2019 సమగ్ర తెలుగు దినపత్రిక



సంపుటి : 5 సంచిక : 37 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar, Mahaboobnagar, Warangal | www.navatelangana.com | 12 + 16 పేజీలు | వెల : 6.50



ఒక్క నెల @ 5361

కోట్లు వెనక్కి

విదేశీ పెట్టుబడుల ఉపసంహరణ

- సార్వత్రిక ఎన్నికలకు ముందు స్టాక్‌మార్కెట్‌లో కలవరం
- బీజేపీ ప్రభుత్వ ఆర్థికవైఫల్యాలూ ఓ కారణం : ఎఫ్‌పీఐలు
- మోడీపై సడలుతున్న నమ్మకం



కొత్త ఏడాదిలోకి అడుగుపెట్టగానే.. ఎన్నికల సర్వేలు మోడీ సర్కారును భయపెడుతున్నాయి. దీంతో ఓటర్లను ప్రసన్నం చేసుకోవటానికి బీజేపీ ప్రభుత్వం వేలకోట్లతో సంక్షేమ తాయిలాలను తెరపైకి తెస్తున్నది. ఓ వైపు దేశ ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తంగా మారితే..మరోవైపు ఇక్కడి స్టాక్‌మార్కెట్లలో విదేశీపెట్టుబడులు వేగంగా వెనక్కిమళ్లుతున్నాయి. మోడీ సర్కారు అనుసరిస్తున్న విధానాలు నచ్చక విదేశీమదుపర్లు వేల కోట్ల మేర పెట్టుబడులను ఉపసంహరించుకుంటున్నారు. ఒక్కనెలలోనే ఐదువేలకోట్లపైగా పెట్టుబడులు వెనక్కి తీసుకోవటం భారత స్టాక్‌మార్కెట్‌లో కలకలంరేపుతున్నది. 9లో..

ఏటా టెట్ ఏదీ?

ఆర్టీఈ, ఎన్‌సీటీఈ నిబంధనలు బేఖాతరు

- 21 నెలలైనా జారీకాని నోటిఫికేషన్
- నిద్రావస్థలో పాఠశాల విద్యాశాఖ
- ఆందోళనలో ఉపాధ్యాయ అభ్యర్థులు
- 3 లక్షల మంది టెట్ కోసం ఎదురుచూపు



వివరాలు 9లో

10 టీవీ అమ్మకంపై అవాస్తవాలు

ప్రజలు అపోహలకు గురికావద్దు : సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని



నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

10 టీవీ అమ్మకానికి సంబంధించి అవాస్తవాలు, తమ పార్టీపై అభాండాలతో ఓ పత్రిక ప్రచురించిన కథనంలో వాస్తవాల్లేవని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. వాస్తవాలు తెలుసుకోకుండా ఎవరో ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా తమ పార్టీపై ఇలాంటి కథనాలు ప్రచురించడం సరైంది కాదని పేర్కొన్నారు. 10 టీవీకి సంబంధించి అన్ని విషయాలూ పారదర్శకంగా ఉన్నాయని స్పష్టం చేశారు. ఈ కథనంతో ప్రజలు అపోహలకు గురికావద్దని తెలిపారు. తప్పుడు ఆరోపణలను నమ్మొద్దని కోరారు.

ఇల్లును చక్కబెట్టుకోలేనోడు..

దేశాన్నేం ఉద్ధరిస్తాడు

దుమారం రేపుతున్న నితిన్ గడ్కరీ వ్యాఖ్యలు

ముంబయి : లోక్‌సభ ఎన్నికలకు ముందు అధికార పార్టీ బీజేపీలో అసమ్మతి రాగం ఊపందుకుంటున్నదా ? నిన్నా మొన్నటి దాకా శత్రుఘ్న, యశ్వంత్ సిన్హా లాంటి రెబెల్ నాయకులే.. బీజేపీకి వ్యతిరేకంగా గళమెత్తగా ఇప్పుడా జాబితాకు కీలక ...9లో



కోల్‌కతాలో

హైడ్రామా

పోలీస్ కమిషనర్ నివాసానికి సీబీఐ బృందం

ధర్నాకు దిగిన సీఎం మమతా

వివరాలు 9లో





కోల్‌కతా పీపుల్స్ బ్రిగేడ్ సభలో అభివాదం చేస్తున్న ఏచూరి

చౌకీదార్‌ను ఓడించాలి..



కదం తొక్కిన అశేషజనం

దేశాన్ని కాపాడుకోవాలి : సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి

- కోల్‌కతా 'పరేడ్‌గ్రౌండ్ ర్యాలీ'కి హాజరైన లక్షలాది మంది
- 'మోడీ-దీదీ'కి వ్యతిరేకంగా నినాదాలు
- పెద్ద ఎత్తున తరలివచ్చిన వామపక్ష కార్యకర్తలు, నాయకులు
- ఎర్రజెండా కవాతుతో ఎరుపెక్కిన నగరం

కోల్‌కతా : దేశానికి చౌకీదార్(కాపలాదారు)నని చెప్పుకుంటున్న ప్రధాని మోడీని గద్దెదించాలనీ, దేశాన్ని కాపాడుకోవాలనీ సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి పిలుపునిచ్చారు. దేశానికి కాపలాదారుగా ఉంటానని ప్రమాణం చేసిన ప్రధాని మోడీ నాయకత్వంలోనే దేశం దోపిడికి గురవుతోందనీ, మతతత్వ శక్తులు విజృంభిస్తున్నాయనీ సీతారాం ఏచూరి ఆగ్రహం వ్యక్తం చేశారు. కేంద్రంలో ప్రత్యామ్నాయ ప్రజాస్వామ్య ప్రభుత్వం రావాలని ప్రజలను కోరారు. ఆదివారం కోల్‌కతాలో జరిగిన భారీ ర్యాలీనుద్దేశించి ఏచూరి ప్రసంగించారు.

ఈ సందర్భంగా ఆయన ఏమన్నారంటే..." మోడీ సర్కార్ గత ఐదేండ్లుగా దేశాన్నిదోచుకుంది. మతతత్వాన్ని పెంచి పోషించారు. ఇప్పుడు ఎన్నికలొచ్చాయని ప్రజల్ని మభ్యపెట్టే పనిచేస్తున్నారు. ఇలాంటి చౌకీదారు(ప్రధాని మోడీ) మనకు వద్దు. కేంద్రంలో ప్రజాస్వామ్య, లౌకికవాద ప్రభుత్వం ఏర్పాటుకావాలంటే ఈ చౌకీదార్‌ను ఓడించాలి" అని అన్నారు. కేంద్ర బడ్జెట్ ద్వారా చెప్పినవన్నీ ప్రజల్ని మోసం చేయడానికేనని అన్నారు. ఆయన మోసపూరిత వాగ్దానాలను దేశ ప్రజలు మరోసారి నమ్మేందుకు సిద్ధంగా లేరని చెప్పారు. ప.బెంగాల్‌లో అధికారంలో ఉన్న తృణమూల్ పార్టీ, కేంద్రంలో అధికా రంలో ఉన్న బీజేపీ...ఒకే నాణేనికి రెండు ముఖాలవంటివని పోల్చారు. కాబట్టి ఇక్కడ రాష్ట్రంలో తృణమూల్‌ను, అక్కడ కేంద్రంలో బీజేపీని ఓడించాలని సీతారాం ఏచూరి ప్రజలకు పిలుపునిచ్చారు.

ఎరుపెక్కిన పరేడ్ గ్రౌండ్స్

ఆదివారం కోల్‌కతాలో జరిగిన ర్యాలీకి భారీ సంఖ్యలో వామపక్ష కార్యకర్తలు, మద్దతుదారులు, ప్రజలు తరలివచ్చారు. ర్యాలీ సందర్భంగా ఎర్రజెండాలతో నగరమంతా ఎరుపెక్కింది. ప.బెంగాల్‌లో వామపక్ష కూటమి చైర్మెన్‌గా ఉన్న బిమన్ బసు 'బ్రిగేడ్ ర్యాలీ'కి నేతృత్వం వహించారు.



అభివాదం చేస్తున్న నేతలు



వామపక్ష నాయకులంతా ఈర్యాలీలో పాల్గొని ప్రసంగించారు. 3.8 చ.కిలోమీటర్ల వైశాల్యమున్న భారీ మైదానం 'బ్రిగేడ్ పరేడ్ గ్రౌండ్' ప్రజలతో కిక్కిరిసిపోయింది. వీరినుద్దేశించి సీపీఐ(ఎం) ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి చేసిన ప్రసంగానికి ప్రజల నుంచి పెద్ద ఎత్తున స్పందన వచ్చింది. రైతులు, కార్మికులు, అణగారిన వర్గాల ప్రజలు హాజరైన అత్యంత భారీ సభ ఇదేనని ఏచూరి అన్నారు. సభకు హాజరైన ప్రజలనుద్దేశించి సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యుడు ఎం.డి.సలీం మాట్లాడుతూ..."ఈ జన ప్రవాహాన్ని అడ్డుకునే ప్రయత్నం జరిగితే రాజకీయ సునామీ ఏర్పడుతుంది. అప్పుడు ఈ సునామీలో మతతత్వ శక్తులు, ప్రజాస్వామ్య వ్యతిరేకులు కొట్టుకుపోతారు. ప్రధాని మోడీ నేతృత్వంలోని ఆయన సైన్యం నామరూపాల్లేకుండా పోతుంది. రాష్ట్రంలో బీజేపీ కోవర్టు తృణమూల్ కాంగ్రెసే. దేశానికి, రాష్ట్రానికి మంచి జరగాలంటే బీజేపీ, మమత నేతృత్వంలోని తృణమూల్‌ను ఓడించాలి"అని పిలుపునిచ్చారు.

మార్పు తథ్యం : సీపీఐ ప్రధాన కార్యదర్శి సురవరం

వామపక్ష కార్యకర్తలు, ప్రజలు ఇంత పెద్ద సంఖ్యలో ర్యాలీలో పాల్గొన్నారు. సభకు హాజరయ్యారు. ఇదంతా చూస్తుంటే రాబోయే రోజుల్లో దేశ రాజకీయాల్లో మార్పు తథ్యం. లోక్‌సభ ఎన్నికల్లోనే దీనికి నాంది పలుకుతారని అనిపిస్తోంది.

మీరు నిజమైన నాయకులు : సూర్యకాంత మిశ్రా

ఎర్రజెండా పట్టుకొని, స్పష్టమైన నినాదాన్ని ఇస్తూ 'బ్రిగేడ్‌ర్యాలీ'లో పాల్గొన్న కార్యకర్తలే నిజమైన నాయకులని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి అన్నారు. కేంద్రంలో బీజేపీని ఓడిస్తే, ప.బెంగాల్‌లో తృణమూల్ కూడా కొద్ది రోజుల్లోనే అధికారాన్ని కోల్పోతుందని అన్నారు.

చీకటి అలుముకుంది: ఆర్ఎస్‌పీ ప్రధాన కార్యదర్శి గోస్వామి

గతకొన్నాండ్లుగా బెంగాల్‌ను చీకటి అలుముకుంది. దీనికి కారణం, అటు కేంద్రంలో బీజేపీ, ఇటు రాష్ట్రంలో తృణమూల్ పాలన. ప్రజాస్వామ్య వ్యతిరేక పాలనను అంతమొందించడానికి వామపక్ష కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున సభకు తరలివచ్చారు.









బీహార్‌లో ఘోర రైలు ప్రమాదం

పట్టాలు తప్పిన సీమాంచల్ ఎక్స్‌ప్రెస్

- ఏడుగురు మృతి, 29మందికి గాయాలు

పాట్నా : బీహార్‌లో ఘోర రైలు ప్రమాదం సంభవించింది. ఆదివారం ఉదయం బీహార్‌లోని వైశాలి జిల్లాలో సీమాంచల్ ఎక్స్‌ప్రెస్‌కు చెందిన 11 బోగీలు పట్టాలు తప్పాయి. ఈ దుర్ఘటనలో ఏడుగురు మృతి చెందగా, 29మంది గాయాలపాలయ్యారు. గాయపడిన వారిని వెంటనే సోన్‌పూర్ జిల్లా ఆస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడినవారిని పాట్నా, ముజఫర్‌పూర్‌లకు తరలించారు. క్షతగాత్రులు, బాధిత కుటుంబాల కోసం భారతీయ రైల్వే.. ప్రత్యేక హెల్ప్‌లైన్ నెంబర్లను ప్రకటించింది. సహాయక చర్యలకోసం ఎన్డీఆర్ఎఫ్ బృందాలు ఘటనాస్థలికి చేరుకున్నాయి.



వివరాల్లోకి వెళితే.. ఢిల్లీ బౌండ్ ట్రెయిన్.. 12487 జోగ్‌బాని-ఆనంద్ విహార్ టర్మినల్ సీమాంచల్ ఎక్స్‌ప్రెస్ ఆదివారం తెల్లవారుజామున దాదాపు నాలుగ గంటల ప్రాంతంలో సోన్‌పూర్ డివిజన్‌లోని సహదాయ్ బుజుర్గ్‌లో పట్టాలు తప్పింది. బీహార్‌లో కిషన్‌గంజ్ జిల్లాలోని జోగ్‌బాని నుంచి ఢిల్లీలోని ఆనంద్ విహార్‌కు వెళ్తుండగా ఈ ఎక్స్‌ప్రెస్‌కు చెందిన 11బోగీలు పట్టాలు తప్పాయి. ట్రాక్‌లోని పగుళ్ల వల్లే ఈ ప్రమాదం చోటుచేసుకుందని అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు. ఒక జనరల్ కోచ్, ఒక ఏసీ కోచ్, మూడు స్లీపర్ కోచ్‌లు(ఎస్8, ఎస్9, ఎస్10)లతోపాటు మరో ఆరు బోగీలు పట్టాలు తప్పినట్టు ఈస్ట్ సెంట్రల్ జోన్ చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ అధికారి రాజేశ్ తెలిపారు. మృతి చెందినవారిలో ఆరు మృతదేహాలను భారత రైల్వే గుర్తించింది. మృతులను ఇల్బా దేవి(66), ఇందిరా దేవి(60), షంసుద్దీన్ ఆలం(26), షాయిదా ఖాతూన్(40), సుదర్శన్ దాస్(60)లుగా రైల్వే పోలీసు గుర్తించారు.

పద్మశ్రీ అవార్డు వాపస్

- పౌరసత్వ బిల్లుకు వ్యతిరేకంగా

తిరిగిచ్చేసిన మణిపురి దర్శకుడు

ఇంఫాల్: కేంద్రం ఇటీవల ప్రకటించిన పద్మశ్రీని మరో ప్రముఖుడు వాపస్ చేశారు. మోడీ సర్కారు తీసుకొచ్చిన పౌరసత్వ (సవరణ) బిల్లుపై నిరసన వ్యక్తం చేస్తూ ప్రముఖ మణిపురి నటుడు, దర్శకుడు అరిభం శ్యాం శర్మ తనకు ఇచ్చిన పద్మశ్రీని కేంద్రానికి తిరిగిస్తున్నట్టు ప్రకటించారు. ఆదివారం ఇంఫాల్‌లోని తన నివాసంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రం చిన్నదైనా, పెద్దదైనా ప్రజల ఆకాంక్షలను గుర్తించాలన్నారు. రాష్ట్రాల సమూహమే దేశమని.. ఈశాన్య రాష్ట్రాల ప్రజల మనోభావాలను కేంద్రం పరిగణనలోకి తీసుకోవాలన్నారు. లేకుంటే నిరసన తెలపాల్సి వస్తుందని, పౌరసత్వ బిల్లుకు వ్యతిరేకంగా ప్రజలు చేస్తున్న పోరాటానికి మద్దతుగా తాను పద్మశ్రీని తిరిగి ఇచ్చేస్తున్నానని వెల్లడించారు. రాష్ట్రం తరఫున లోక్‌సభలో మాట్లాడటానికి ఇద్దరు ఎంపీలు మాత్రమే ఉండటంతో తమ గళం వినిపించే అవకాశం లేకుండా పోయిందన్నారు. మొట్టమొదటి మణిపురి చిత్రం 'మాతంగి మణిపూర్'లో అరిభం శ్యాం నటించారు. తదనంతరం ఆ రాష్ట్ర చిత్ర రంగానికి విశేష సేవలందించారు. కాగా, ప్రముఖ రచయిత్రి, ఒడిషా ముఖ్యమంత్రి నవీన్ పట్నాయక్ సోదరి గీతా మెహతా కూడా కేంద్రం ప్రకటించిన పద్మశ్రీని తిరస్కరించిన విషయం విదితమే.

నాకేదైనా జరిగితే ప్రధానిదే బాధ్యత

- నిరాహారదీక్షలో అన్నాహజారే

ముంబయి: లోక్‌పాల్ బిల్లు అమలు, లోకాయుక్తాల ఏర్పాటు కోసం నిరవధిక నిరాహారదీక్ష చేస్తున్న అన్నా హజారే ప్రధాని మోడీపై మండిపడ్డారు. తనకేదైనా జరిగితే ప్రధాని మోడీదే బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు. కేంద్రంలో లోక్‌పాల్, రాష్ట్రాలలో లోకాయుక్తల నియామకా ల కోసం సొంత గ్రామం రాలేగావ్ సిద్ధిలో గతనెల 30 నుంచి ఆయన నిరవధిక నిరాహార దీక్షకు దిగిన విషయం తెలిసిందే. అలాగే స్వామినాథన్ సిఫారసులను అమలు చేయాలని డిమాండ్ చేస్తూ జన్‌ఆందోళన్ సత్యాగ్రహ పేరు తో ఆయన ఈదీక్షను చేపట్టారు. సోమవారానికి ఆయన దీక్ష ఆరో రోజుకు చేరుకున్నది. ఆయన మాట్లాడుతూ..' అగ్నికి ఆజ్యం పోసే కొందరి వ్యక్తుల్లా కాకుండా సమస్యలను పరిష్కరించే వ్యక్తిగా ప్రజలు నన్ను గుర్తుంచుకుంటారు. అధికారంలోకి వచ్చాక లోక్‌పాల్, లోకాయుక్తలను ఏర్పాటు చేస్తామన్న మోడీ



ఆ విషయంలో విఫలమయ్యారని విమర్శించారు.

రైతుల పథకం అవమానకరం : శత్రు

న్యూఢిల్లీ : ఇటీవల పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో రైతులకు ప్రకటించిన ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి పథకం ఆకట్టుకోలేదని బీజేపీ ఎంపీ, అసంతృప్త నేత శత్రుఘ్న సిన్హా అభిప్రాయ పడ్డారు. పార్టీ అధిష్టానంపై విమర్శలు చేయడానికి ఎటువంటి అవకాశాన్ని వదులుకోని ఆయన రైతులకు నగదు ఇవ్వడాన్ని 'అవమానకరం, కించపరచడం' అని ట్వీట్ చేశారు. రెండు హెక్టార్ల కన్నా తక్కువ భూమి ఉన్న చిన్న, సన్నకారు రైతులకు ఏడాదికి 6 వేల చొప్పున ఇవ్వనున్నట్టు కేంద్రం ప్రకటించిన సంగతి తెలిసిందే.

కోట్లపై కన్నేసి.. చిల్లర చోరీ

- ముంబయిలో దేనా బ్యాంకు నుంచి రూ.16వేల విలువైన నాణేల దొంగతనం

ముంబయి : కోట్ల రూపాయలపై కన్నేసి ముంబయిలోని బ్యాంకులోకి దూరాడు ఓ దొంగ. లాకర్లను పగులగొట్టేందుకు విఫల ప్రయత్నాలు చేశాడు. లాకర్ ఓపెన్ కాకపోవడంతో క్యాషియర్ డ్రాయర్లలోని చిల్లరనే కాజేసి బయటపడ్డాడు. కోట్ల కోసం బ్యాంకుకు కన్నమేసేందుకు యత్నించి రూ. 16,700 ముఖవిలువ గల నాణేలను దొంగిలించాడు. మహారాష్ట్రలో ముంబయిలోని దేనా బ్యాంక్ మహేశ్వరి ఉద్యాన్ బ్రాంచ్‌లో ఈ చోరీ చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత బాత్‌రూమ్‌లోని గ్రిల్స్‌ను తొలగించి గుర్తుతెలియని వ్యక్తి బ్యాంకులోకి వెళ్లాడు. లాకర్ ఓపెన్ కాకపోవడంతో క్యాషియర్ డ్రాయర్‌లలోని రూపాయి, రెండు రూపాయల నాణేలను దొంగిలించాడు. క్యాషియర్ గదిలోకి దొంగ వెళ్లేది సీసీటీవీలో కనిపిస్తున్నది గానీ క్లారిటీ లేకపోవడం వల్ల ఆ వ్యక్తిని గుర్తించలేకపోతున్నట్టు పోలీసులు తెలిపారు. పొద్దున్నే బ్యాంకుకు వచ్చిన ఉద్యోగులు దీన్ని గమనించి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో దర్యాప్తు మొదలైంది.

మోడీ హయాంలో ఉపాధికి గండి

- కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్

న్యూఢిల్లీ : ప్రధాని మోడీ విశ్వవిద్యాలయాల్లో వెనుకబడిన వర్గాలకు ఉపాధి అవకాశాలు విస్మరిస్తున్నారని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ విమర్శించారు. తన పారిశ్రామిక సన్నిహితుల అభివృద్ధే ధ్యేయంగా మోడీ సాగుతున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. యూనివర్సిటీలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు రిజర్వ్ చేసిన అధ్యాపకుల నియామకంలో ముందుకు పోవాలని ఇటీవల సుప్రీంకోర్టు ఉత్తర్వులు ఇచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. కానీ దీనికి విరుద్ధంగా పోస్టుల సంఖ్యను తగ్గిస్తూ ప్రభుత్వం వారి అవకాశాలకు గండికొడుతున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి తోడు విద్యార్థులకు సక్రమంగా స్కాలర్‌షిప్‌లను మంజూరు చేయట్లేదన్నారు.

నత్త నడకన నమామి గంగే

కేటాయించింది 2300 కోట్లు.. ఖర్చు చేసింది 700 కోట్లు..

- ప్రకటించిన ప్రాజెక్టులు 261.. పూర్తయినవి 76 మాత్రమే

న్యూఢిల్లీ: గంగా నది పరిశుభ్రత కోసం ప్రధాని మోడీ ప్రతిష్టాత్మకంగా ప్రారంభించిన 'నమామి గంగే' పనులు నత్త నడకన సాగుతున్నాయి. 2014 లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా గంగ నది శుద్ధిని తమ ఎన్నికల వాగ్దానంలో బీజేపీ ప్రధానంగా చేర్చింది. కానీ, ఇందులో పనులు మాత్రం ఆశించిన స్థాయిలో జరగకపోగా, కేటాయించిన నిధులను ఖర్చు చేయడంలో కేంద్ర, బీజేపీ పాలిత రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. నమామి గంగే కార్యక్రమం కింద ఈ ఆర్థిక సంవత్సరంలో రూ. 2300 కోట్లు కేటాయించగా అందులో కేవలం మూడో వంతు నిధులు అంటే 700 కోట్ల రూపాయలు మాత్రమే ఇప్పటి వరకు వినియోగించారు. నమామి గంగేను 2014లో కేంద్రం ప్రారంభించారు. ఇందులో భాగంగా మురుగు నీటి శుద్ధి, నది ఉపరితల, ఘాట్‌ల శుభ్రత, నదీతీరంలో పునరాభివృద్ధి, జీవవైవిధ్యం పరిరక్షణం కోసం ఇలా అనేక కార్యక్రమాలు ఆ సమయంలో ప్రణాళిక చేశారు. ఇందు కోసం గంగా నది ప్రవహిస్తున్న ఉత్తర ప్రదేశ్, ఉత్తరాఖండ్, బీహార్, జార్ఖండ్, పశ్చిమబెంగాల్ వంటి రాష్ట్రాలకు నిధులను కేటాయించారు. మొత్తం 261 ప్రాజెక్టు పనులను ప్రకటించగా అందులో కేవలం 76 మాత్రమే పూర్తయ్యాయి. అంటే ఇప్పటి వరకు కేటాయించిన 25వేల కోట్లల్లో కేవలం 5,979 కోట్లు మాత్రమే అంటే 23శాతం నిధులు మాత్రమే ఖర్చు కావడం గమనార్హం. రాబోయే రెండేండ్లకు సరిపడా నిధులున్నాయని, 2020 వరకు ప్రాజెక్టు పనులు పూర్తి కావల్సి ఉన్నదని అధికారులు తెలుపుతున్నారు. కాగా, ఈ కార్యక్రమంలో పెద్ద ప్రాజెక్టు అయిన మురుగునీరు శుద్ధికి రూ.20వేల కోట్లు కేటాంచారు. ఇందులో బీజేపీ అధికారంలో ఉన్న యూపీలో 8,515 కోట్ల నిధులను(22శాతం) 43 ప్రాజెక్టుల కోసం ఖర్చు చేయడం



గమనార్హం.

అయితే కేటాయించిన ప్రాజెక్టులు 'చాల పెద్దవి' అని.. వాటి పూర్తి చేయడం సంక్లిష్టమైనవని ప్రభుత్వాధికారులు అంటున్నారు. 'వీటిలో కొన్ని ప్రాజెక్టులు కేంద్రం, మరికొన్ని రాష్ట్ర ప్రభుత్వాలు, మిగతావి ప్రయివేటు భాగస్వామ్యంలో నడుస్తాయి. వీటిని సరైన కాంట్రాక్టు ప్రక్రియ ద్వారా అప్పగించాలి' అని సీనియర్ అధికారి ఒకరు తెలిపారు. ఎస్సెల్ ఇన్‌ఫ్రా, షాపూర్‌జీ పల్లోంజీ, అదానీ ఎంటర్‌ప్రైజెస్ వంటి ప్రయివేటు సంస్థలకు ఆరు నగరాలను కేంద్రం కేటాయించిందని అధికారులు తెలిపారు.

అరకొర సిబ్బంది.. ఆపై మిలాఖత్‌తో

అడవుల రక్షణెలా?

ఉండాల్సిన ఉద్యోగుల సంఖ్య 4937... ఉన్నది 2112 మందే

- ఉన్నవారిలోనూ ఏటా వంద మంది రిటైర్డ్
- టీఎస్‌పీఎస్సీ వద్ద మూలుగుతున్న 1857 పోస్టులు
- కొన్నిచోట్ల స్మగ్లర్లకు అధికారుల అండ
- ఎనిమిది మంది అటవీశాఖ ఉద్యోగుల సస్పెన్షన్

అటవీ శాఖను సిబ్బంది కొరత వెన్నాడుతున్నది. ఇద్దరు పనిచేయాల్సిన చోట ఒక్కరితోనే ఆ శాఖ నెట్టుకొస్తున్నది. అటవీ సంరక్షుల సంఖ్య తక్కువగా ఉండటం...ఉన్నవారిలోనూ కొందరు స్మగ్లర్లకు వత్తాసు పలుకుతుండటంతో అడవుల నుంచి కలప దొడ్డిదారిన తరలిపోతున్నది. జంతువుల వేట యథేచ్ఛగా కొనసాగుతున్నది. సిబ్బంది నియామకాలు చేపట్టకుండా ఎన్ని సమీక్షలు నిర్వహించినా ప్రయోజనం లేదన్న విమర్శలు ఇప్పటికే ఉన్నాయి.





నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

తెలంగాణలో 33 శాతం అడవులకు గానూ 24 శాతమే ఉన్నది. 33 శాతం పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం హరితహారం పేరిట చర్యలు చేపట్టింది. కొత్తగా ప్రభుత్వ స్థలాల్లో, రోడ్ల వెంబడి మొక్కలను విరివిగా నాటుతున్నప్పటికీ ఉన్న అడవులు స్మగ్లర్ల పాలవుతున్నాయి. దీనికి ప్రధానంగా సిబ్బంది కొరతే కనిపిస్తున్నది. అటవీ శాఖలో 4937 సిబ్బంది పనిచేయాల్సి ఉండగా 2,112 మందే విధులు నిర్వర్తిస్తున్నారు. ఉన్నవారిలోనూ సగటున ఏటా 100 నుంచి 150 మంది అటవీ సిబ్బంది ఉద్యోగ విరమణ పొందుతున్నారు. దీంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అటవీ ప్రాంత విస్తరణ కోసం చేపట్టిన హరితహారం కార్యక్రమం నిర్వహణకు మరో ఐదారు వేల మంది అవసరం. కానీ, సిబ్బంది నియామకాలు చేపట్టడం లేదు. దీంతో ఉన్న సిబ్బందిపై అదనపు పని భారం పడుతున్నది. ఫారెస్టు బీట్ ఆఫీసర్లపై పని ఒత్తిడి తీవ్రంగా ఉందని అటవీశాఖ ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఉన్న అరకొర సిబ్బందితో అడవిలో రోజూ గస్తీ కాయడం తలకు మించిన భారమవుతున్నది. అంతేగాక, రాజకీయ ఒత్తిళ్లు, లంచాలకు లొంగడం వంటి కారణాలతో కొందరు అధికారులు... స్మగ్లర్లు అటవీ సంపదను దోచుకెళ్తున్నా చూసీచూడనట్టు ఉంటున్న పరిస్థితి. ఇటీవల కాలంలో ఆదిలాబాద్, నిజామాబాద్ ఎనిమిది అటవీ సిబ్బంది సస్పెండ్ కావటం, భూపాలపల్లిలో తెలంగాణ వీరప్పన్ దురాగతాలు వెలుగుచూడటం, ఆదిలాబాద్ జిల్లాలో వేటగాళ్ల నుంచి పులి చర్మాన్ని స్వాధీనం చేసుకోవటం వంటివి పై అంశాలకు మరింత ఊతం ఇస్తున్నాయి.

ఇన్ఫార్మర్లతో నెట్టుకొచ్చుడు సాధ్యమేనా?

అడవుల సంరక్షణ కోసం అటవీ ప్రాంత సమీప గ్రామాలకు చెందిన కొందర్ని అధికారులు ఇన్ఫార్మర్లుగా నియమించుకుంటున్నారు. వీలైనంత మేరకు సమాచారం తెప్పించుకుంటున్నారు. కానీ, స్మగ్లర్ల బెదిరింపులకు, రాజకీయ ఒత్తిళ్లకు లొంగి క్షేత్రస్థాయి సిబ్బంది గమ్మున ఉంటుండటంతో ఇన్ఫార్మర్ల వ్యవస్థతో కొంతమేరకే ప్రయోజనం చేకూరుతున్నది. అయితే, ఇటీవల కాలంలో సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు అటవీశాఖ అధికారులతో సీఎస్ తరుచూ సమీక్షలు నిర్వహిస్తుండటంతో కదలిక మొదలైంది. పోలీస్, అటవీ, రెవెన్యూ శాఖ అధికారులంతా కలిసి ఊరూర తిరుగుతూ అటవీ సంరక్షణపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఇన్ఫార్మర్ల వ్యవస్థను బలోపేతం చేసుకునేందుకు నడుం బిగించారు. అడవుల నరికివేత, అక్రమ కలప రవాణా, వన్యప్రాణుల వేట, ఇసుక అక్రమ రవాణాల సమాచారం ఎప్పటికప్పుడు రాబట్టుకునేందుకు ఇన్ఫార్మర్లకు సెల్‌ఫోన్లను సైతం అందజేసేందుకు అధికారులు పూనుకున్నారు. పకడ్బందీ సమాచారం అందజేసే ఇన్ఫార్మర్లకు లక్ష రూపాయల నుంచి రూ.5 లక్షల వరకు రివార్డు అందజేసేందుకు ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపారు. అటవీ అధికారులతోనే సాధ్యం కాని పనిని ఇన్ఫార్మర్ల వ్యవస్థతో అటవీశాఖ ఏమేరకు నెట్టుకొస్తుందో వేచి చూడాల్సిందే.

ఏడాదిన్నర గడుస్తున్నా ఎందుకీ జాప్యం?

1857 ఫారెస్టు బీట్ ఆఫీసర్ల ఖాళీలను భర్తీ చేసేందుకు 2017 ఆగస్టులో టీఎస్‌పీఎస్సీ నోటి ఫికేషన్ ఇచ్చి అక్టోబర్‌లో పరీక్ష నిర్వహించింది. జూన్‌లో ఫలితాలు వెలువరించి జూలై తొలి వారంలో ఈవెంట్లను నిర్వహించింది. సర్టిఫికెట్ల పరిశీలన పూర్తయి ఆరు నెలలు గడుస్తున్నా ఏదో ఒక కారణం చూపుతూ పోస్టింగ్‌లు ఇవ్వట్లేదు. సెలెక్ట్ అయి ఏడాది నుంచి ఎదు రుచూస్తున్న అభ్యర్థులు ఆందోళన చేయగా...15 రోజుల్లో తుది ఫలితాలు వెల్లడిస్తామని జనవరిలో టీఎస్‌పీఎస్సీ అధి కారులు హామీనిచ్చారు. కానీ, నేటికీ విడుదల చేయలేదు. తుది జాబితా రూపొందించి పోస్టింగ్‌లు ఇస్తే అటవీ శాఖలో సిబ్బంది కొరత చాలా వరకు తీరే అవకాశముంది. అటవీశాఖ అధికారులతో సీఎస్ నిర్వహించిన జరిగిన సమీక్షావేశంలో సిబ్బంది కొరతపై ప్రధానంగా చర్చనడిచింది. ఉన్నతా ధికారుల ఆదేశాల మేరకు టీఎస్‌పీఎస్సీ ఫారెస్టు రేంజ్ ఆఫీసర్ల తుదిజాబితాను వెల్లడించింది. వారికి పోస్టింగ్‌లూ ఇచ్చారు. ఫారెస్టు బీట్ ఆఫీసర్ల తుది జాబితా విడుదలపైనా అధికారులు దృష్టి సారించాలని అభ్యర్థులు కోరుతున్నారు.

ప్రపంచ విశిష్ట ఆలయంగా యాదాద్రి

పనులన్నీ పూర్తయిన తరువాతే ప్రారంభం

- 173 ఎకరాల భూసేకరణకు రూ.70కోట్లు విడుదల
- 1100 ఎకరాల్లో టెంపుల్ సిటీ నిర్మాణం: సీఎం కేసీఆర్



ఆలయ పనులను పరిశీలిస్తున్న కేసీఆర్

నవతెలంగాణ–యాదాద్రి భువనగిరి ప్రతినిధి

యాదాద్రి ఆలయం ప్రపంచంలోనే విశిష్ట ఆలయంగా అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు తెలిపారు. ఆలయ ప్రారంభోత్సవానికి 133 దేశాల నుంచి వైష్ణవ పండితులను పిలిపిస్తామని వెల్లడించారు. సీఎం కేసీఆర్ రెండోసారి బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా ఆదివారం యాదాద్రి క్షేత్రాన్ని దర్శించారు. అనంతరం కొండపై జరుగుతున్న ప్రధానాలయం, వ్రత మంటపం, శివాలయం, ప్రసాద విక్రయశాల, పుష్కరిణి పనుల పురోగతిని నిశితంగా పరిశీలించారు. అనంతరం టెంపుల్ సిటీ (పెద్దగుట్ట)పై ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. 6వేల మంది రుత్వికుల సమక్షంలో ఆలయ ప్రారంభోత్సవాన్ని నిర్వహిస్తామనీ, ప్రపంచ నలుమూలల నుంచి సుమారు 10 నుంచి 15లక్షల మంది హాజరవుతారనీ తెలిపారు. శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్నజీయర్ స్వామి పర్యవేక్షణలో ఆగమశాస్త్ర నియమాలకు అనుగుణంగా రూ.2వేల కోట్ల అంచనాతో అంతర్జాతీయ ఆధ్యాత్మిక క్షేత్రంగా తీర్చిదిద్దుతున్నామని వివరించారు. ఆలయ పనులు త్వరగా పూర్తి చేయడానికి నెలకు రెండుసార్లు యాదాద్రి క్షేత్ర పర్యటనకు వస్తానని వెల్లడించారు.

సర్వహంగులతో పెద్దగుట్టపై 1100 ఎకరాల్లో టెంపుల్ సిటీని అభివృద్ధి చేస్తామని కేసీఆర్ ప్రకటించారు. ప్రస్తుతం 832 ఎకరాల్లో టెంపుల్ సిటీ అభివృద్ధి కోసం ల్యాండ్ డెవలప్‌మెంట్ చేశామనీ, మరో 270 ఎకరాలు సేకరించి కాటేజీలు నిర్మిస్తామనీ చెప్పారు. రూ.2కోట్లు, కోటీ, 50లక్షలు, 25లక్షల చొప్పున నాలుగు రకాలుగా కాటేజీల నిర్మాణానికి డిజైన్లు పూర్తి చేశామన్నారు. 43 మంది దాతలు రూ.2కోట్లతో కాటేజీలు నిర్మించడానికి ముందుకు వచ్చారని వెల్లడించారు. తెప్పోత్సవం కోసం 30ఎకరాల్లో ఉత్తర భాగంలో ఉన్న గండిచెర్వును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని వివరించారు.

భక్తుల క్యూ కాంప్లెక్స్, బస్‌స్టేషన్, వాహనాల పార్కింగ్, నిత్యాన్నదాన సత్రం తదితర నిర్మాణాలు త్వరలో చేపట్టనున్నట్టు వెల్లడించారు. రాజు వెగస్నా ఫౌండేషన్ అధ్యక్షులు అనంత కోటి రాజు, కార్యదర్శి ఆనందరాజులు స్వామి వారి ఆలయంలో నిత్యాన్నదాన సత్రం నిర్మాణం కోసం సీఎం కేసీఆర్‌కి రూ.10 కోట్ల చెక్కును విరాళంగా అందజేశారు. సీఎం వెంట మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎంపీలు జె.సంతోష్‌కుమార్, బూర నర్సయ్యగౌడ్, బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్యేలు గొంగిడి సునీత, పైళ్ల శేఖర్‌రెడ్డి, గ్యాదరి కిషోర్, మర్రి జనార్దన్‌రెడ్డి, కంచర్ల భూపాల్‌రెడ్డి, ఎమ్మెల్సీలు ఎలిమినేటి కృష్ణారెడ్డి, కర్నె ప్రభాకర్, మాజీ మంత్రి ఉమామాధవరెడ్డి తదితరులున్నారు.

ఫార్మసిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్ నామినేటెడ్ సభ్యులు సంజయ్‌రెడ్డి



నవతెలంగాణ బ్యూరో– హైదరాబాద్

రాష్ట్రంలో ఫార్మసిస్టుల సమస్యల పరిష్కారం తనవంతు కృషి చేస్తానని ఫార్మసీ కౌన్సిల్ నామినేటెడ్ సభ్యులు డాక్టర్ ఆకుల సంజయ్‌రెడ్డి హామీనిచ్చారు. గత నెలలో సంజయ్‌రెడ్డి ప్రభుత్వం ఫార్మసీ కౌన్సిల్ కౌన్సిల్ సభ్యునిగా నియమించిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా పలువురు జాతీయ, రాష్ట్ర స్థాయి ప్రముఖులు ఆయనను ఘనంగా సన్మానించారు. ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (న్యూఢిల్లీ), అధ్యక్షులు, జేఎస్ఎస్ యూనివర్సిటీ వీసీ డాక్టర్ బి.సురేష్, ఇండియన్ ఫార్మాస్యూటికల్స్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ టివి నారాయణ, తెలంగాణ ప్రయివేటు ఫార్మసీ కాలేజెస్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ కె.రామదాసు, తెలంగాణ ఫార్మసీ కాలేజెస్ ప్రిన్సిపల్స్ సన్మానించిన వారిలో ఉన్నారు.

రాష్ట్రంలో రాజ్యాంగం అమలవుతోందా?

మారంపల్లి దుశ్చర్యపై ఇప్పటికీ స్పందించని ప్రభుత్వం : కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి స్కైలాబ్‌బాబు



మాట్లాడుతున్న కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి స్కైలాబ్‌బాబు

నవతెలంగాణ–కంఠేశ్వర్/నందిపేట్

రాష్ట్రంలో రాజ్యాంగం ఏ మేరకు అమలవుతుందో పరిశీలించుకోవాలని కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి స్కైలాబ్‌బాబు అన్నారు. ప్రభుత్వం ఉన్నత వర్గాలను చేరదీయడం వల్లే వీడీసీలు దళితులను, ఎంబీసీలను కింది కులాల వారిని తమ చెప్పుచేతుల్లో ఉంచుకుంటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిజామాబాద్ జిల్లా నందిపేట్ మండలం మారంపల్లిలో 80 దళిత కుటుంబాలు సాంఘిక బహిష్కరణకు గురయ్యాయనీ, దీనిపై ఇప్పటికీ ప్రభుత్వం స్పందిచడం లేదనీ ఆవేదన వ్యక్తం చేశారు. హైకోర్టు న్యాయవాదులు, కేవీపీఎస్ నాయకులు నిజనిర్ధారణ కమిటీగా ఏర్పడి ఆదివారం మారంపల్లి గ్రామాన్ని సందర్శించారు. అనంతరం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని సీఐటీయూ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గ్రామాల్లో వీడీసీలు పాలన కొనసాగిస్తుంటే, వాటికి ప్రభుత్వం అండగా ఉండటం వల్లనే ఇలాంటి ఘటనలు కొనసాగుతున్నాయని ఆరోపించారు. దీనికి ప్రత్యక్షంగా ఆర్మూరు ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి వత్తాసు పలుకుతున్నట్టు కనిపిస్తోందన్నారు. 41 రోజుల నుంచి 80 మాల కుటుంబాలు వీడీసీలతో గ్రామ బహిష్కరణకు గురైనా ప్రభుత్వం, అధికార యంత్రాంగం పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. బాధితులకు ఇప్పటికీ పాలు, వ్యవసాయ పనులకు ట్రాక్టర్లు, నిత్యవసరాలు ఇవ్వడం లేదని తెలిపారు. గ్రామంలో జరిగిన పోశమ్మ పండగకు వారినెవరినీ పిలువలేదన్నారు. దీంతో బహిష్కరణ జరిగిందని నిజనిర్ధారణ కమిటీ నిర్ధారించిందని తెలిపారు. బాధితులను జిల్లా పోలీస్ కమిషనర్, కలెక్టర్, ప్రజా ప్రతినిధులు పరామర్శించకపోవడం సరికాదన్నారు. ఘటనపై నిజామాబాద్ ఎంపీ స్పందించకపోవడం దారుణమన్నారు. దీనిపై విచారణ జరపడానికి వచ్చిన జాతీయ ఎస్సీ చైర్మెన్ రాములును వీడీసీ సభ్యులు అడ్డుకున్నప్పటికీ పోలీసులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరించడం సరైంది కాదన్నారు. ఈ విషయంపై హైకోర్టు న్యాయవాదులతో పిటిషన్‌ను వేస్తున్నట్టు తెలిపారు. నిజనిర్ధారణ బందంలో హైకోర్టు న్యాయవాది టీవీ రమేష్, విశాల్, శశి వర్ధన్, కేవీపీఎస్ నాయకులు ఎం.కపాసాగర్, గుంటి లక్ష్మణ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి పెద్ది వెంకట్రాములు, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి జంగం గంగాధర్ పాల్గొన్నారు.

పంచాయతీ కార్యాలయానికి గులాబీ రంగు

నవతెలంగాణ–బీబీనగర్



గ్రామ పంచాయతీ కార్యాలయానికి గులాబీ రంగు వేయడంతో ఆ గ్రామ యువకులు ఆందోళనకు దిగారు. రంగు మార్చాలంటూ పక్కనే ఉన్న సెల్ టవర్ ఎక్కి నిరసన తెలిపారు. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలం చిన్నరావుపల్లి గ్రామంలో ఆదివారం జరిగింది. పంచాయతీ ఎన్నికల్లో టీఆర్ఎస్ బలపర్చిన అభ్యర్థి గెలుపొందినా శనివారం పదవీ బాధ్యతలు చేపట్టలేదు. కానీ కార్యాలయానికి గులాబీ రంగు వేయిస్తుండగా ఇతర పార్టీ నాయకులు, యువకులు అడ్డుకున్నారు. ఇది నిబంధనలకు విరుద్ధమని వాదించారు. గులాబీ రంగు వెంటనే మార్చాలని గ్రామ సచివాలయం పక్కనే ఉన్న సెల్ టవర్ ఎక్కారు. అనంతరం గ్రామ ప్రధాన కూడలిలోని అంబేద్కర్ విగ్రహం వద్ద బైటాయించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని రంగు మార్పిస్తామని హామీనివ్వడంతో యువకులు ఆందోళన విరమించారు.

అనుబంధ గుర్తింపునకు దరఖాస్తు గడువు పెంపు

- ఇంటర్ బోర్డు కార్యదర్శి అశోక్

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

రాష్ట్రంలో 2019–20 విద్యాసంవత్సరంలో జూనియర్ కాలేజీల అనుబంధ గుర్తింపునకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు గడువును ఈనెల 12వ తేదీ వరకు పొడిగించినట్టు ఇంటర్ బోర్డు ప్రకటించింది. ఈ మేరకు ఇంటర్ బోర్డు కార్యదర్శి ఎ అశోక్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. షెడ్యూల్ ప్రకారం గతనెల 31వ తేదీతో అపరాధ రుసుం లేకుండా దరఖాస్తు చేసే గడువు ముగిసింది. కాలేజీ యాజమాన్యాల విజ్ఞప్తి మేరకు అపరాధ రుసుం లేకుండా అనుబంధ గుర్తింపు కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తులను ఈనెల 12వ తేదీ వరకు స్వీకరిస్తామని తెలిపారు. జనరల్, ఒకేషనల్ జూనియర్ కాలేజీ యాజమాన్యాలు దరఖాస్తు చేయాలని కోరారు. అదనపు సెక్షన్లు, సీట్ల కోసమూ దరఖాస్తు చేయాలని సూచించారు. అపరాధ రుసుం రూ.3 వేలతో ఈనెల 25 వరకు, రూ.5 వేలతో వచ్చేనెల 8 వరకు, రూ.10 వేలతో వచ్చేనెల 20వ తేదీ వరకు అనుబంధ గుర్తింపు కోసం దరఖాస్తు చేసే అవకాశముందని తెలిపారు. కాలేజీ షిఫ్టింగ్, సొసైటీ పేరు మార్పు, కాలేజీ పేరు మార్పు వంటివి అనుబంధ గుర్తింపు కోసం దరఖాస్తు ప్రతిపాదనల్లో పొందుపరచాలని సూచించారు. వచ్చేనెల 20వ తేదీ తర్వాత దరఖాస్తులను స్వీకరించబోమని తెలిపారు.

రెండు బైకులు ఢీ.. ఇద్దరు మృతి

నవతెలంగాణ–కొత్తకోట

రెండు బైకులు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. మరొకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన వనపర్తి జిల్లా కొత్తకోట మండలం కానాయిపల్లి గ్రామంలో ఆదివారం జరిగింది. ఎస్ఐ రవికాంత్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. మదనాపురం మండలం అజ్జకొల్లుకు గ్రామానికి చెందిన రాము (18) వ్యక్తిగత పనుల విషయమై వనపర్తికి బైక్‌పై వెళ్లి స్వగ్రామం తిరిగివస్తున్నాడు. కొత్తకోట మండలం సంకిరెడ్డిపల్లికి చెందిన అబ్బియ్యనాయక్(38) తన భార్య బుచ్చమ్మతో కలిసి తన స్వగ్రామానికి బైక్‌పై వస్తున్నాడు. కానాయిపల్లి స్టేజీ వద్ద వీరిరువురి బైక్‌లు ఎదురెదురుగా ఢీకొనడంతో రాము, అబ్బియ్యనాయక్ అక్కడికక్కడే మృతి చెందారు. బుచ్చమ్మకు తీవ్రగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు ఆమెను 108 వాహనంలో వనపర్తి ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

Telangana State Technology Services Limited (TSTSL)
RFP for selection of Service Provider for operation and maintenance of Labour Department Portal
Time schedule of various tender related events:


Bid calling date	04-02-2019
Pre-bid conference date and time	11-02-2019, 11.30 AM
Bid closing date/time	16-02-2019, 03:00 PM
Bid Document Fee	Rs. 10,000/-
TSTS Contact person	kcsheker-tsts@telangana.gov.in rpushpa-tsts@telangana.gov.in
TSTS Reference No.	TSTS/OAP/23977/LD/2019

For further tender details and specifications please visit http://www. tsts.telangana.gov.in/tenders and https://tender.telangana.gov.in
Sd/- Managing Director, TSTSL

బీసీ బిల్లు కోసం కేంద్రంపై ఒత్తిడి

ఢిల్లీలో మకాం వేసిన సంఘాల నేతలు

- వివిధ పార్టీల నేతలతో సంప్రదింపులు
- ప్రయివేటు బిల్లుకు సిద్ధం



నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

పార్లమెంట్‌లో బీసీ బిల్లు పెట్టేందు కోసం బీసీ సంఘాల నేతలు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నారు. గత మూడు రోజులుగా ఢిల్లీలో తిష్ట వేసి భారీ ప్రదర్శనలు నిర్వహించడంతో పాటు వివిధ రాజకీయ పార్టీల ఎంపీలను కలిసి పార్లమెంట్‌లో బిల్లు పెట్టేలా కృషి చేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు. అన్నింటా అభివృద్ధి చెందిన అగ్రకులాలకు అడగకుండానే 10 శాతం రిజర్వేషన్లు పెట్టి ఒక్క రోజుల్లోనే బిల్లును ఆమోదింప చేశారని, కానీ 30 సంవత్సరాలుగా బీసీ బిల్లు కోసం పోరాడుతున్నా కేంద్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని బీసీ సంఘాల నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య, ఉపాధ్యక్షులు గుజ్జ కృష్ణ పార్లమెంట్ సమావేశాల కన్నా ముందే ఢిల్లీ చేరుకుని జాతీయ పార్టీల నేతలతో సమావేశమయ్యారు. వారితో పాటు రాష్ట్రానికి చెందిన బీసీ సంఘాల నేతలు పెద్ద ఎత్తున ఢిల్లీ చేరుకుని వారికి మద్దతుగా నిలిచారు. ఈ బడ్జెట్ సమావేశాల్లోనే బీసీ బిల్లును ఆమోదింపచేసుకోవాలన్న ఆలోచనలో నేతలు ఉన్నారు. లేకుంటే పార్లమెంట్ ఎన్నికలు దగ్గర పడుతుండటంతో బీసీ బిల్లు మూలకు పడే అవకాశం ఉందని భావిస్తున్నారు. ప్రధానమంత్రి బీసీ అయినప్పటికీ బీసీల సమస్యల పరిష్కారానికి ఎలాంటి కృషి చేయడం లేదని, అగ్రకులాల సంక్షేమానికే ప్రాధాన్యం ఇస్తున్నారంటూ ఆగ్రహంతో ఉన్నారు. బడ్జెట్ సమావేశాల్లో బిల్లును ఆమోదించకుంటే వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీకి చరమగీతం పాడాలంటూ సంఘాల నేతలు పిలుపునిస్తున్నారు.

బీసీ బిల్లు కోసం ఆర్ కృష్ణయ్య, గుజ్జ కృష్ణ లాంటి సీనియర్ నేతలు ఢిల్లీలో డిఎంకే, ఏఐడీఎంకే, కాంగ్రెస్, టీడీపీ, టీఆర్ఎస్, వైఎస్ఆర్‌సీపీ పార్టీ ఎంపీలతో చర్చలు జరిపారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో బిల్లు పెట్టడానికి ముందుకు రాకపోతే అన్ని పార్టీలు కలిసి ప్రయివేటు బిల్లు పెట్టాలని విజ్ఞప్తి చేశారు. గతంలో వైఎస్ఆర్‌సీపీ ప్రయివేటు బిల్లు ప్రవేశపెట్టిన విషయాన్ని గుర్తు చేశారు. బీసీలకు రాజకీయ రిజర్వేషన్ల బిల్లు పెడితే ఏ వర్గం కూడా వ్యతిరేకించే అవకాశం లేదని, ఇటీవల అగ్రకులాలకు 10 శాతం రిజర్వేషన్లు పెట్టడంతో ఆ వర్గాల నుంచి కూడా వ్యతిరేకత రాదని ఆయా పార్టీల పార్లమెంట్ సభ్యులకు నచ్చ చెబుతున్నారు. చట్ట సభలలో రిజర్వేషన్లు పెట్టాలని తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో అసెంబ్లీ తీర్మానాలు చేసి కేంద్రానికి పంపించిన విషయాన్ని గుర్తు చేశారు. ఈ పార్లమెంట్ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం బిల్లు పెట్టకపోతే ప్రయివేటు బిల్లు పెట్టడానికి డీఎంకే, అన్నాడీఎంకే, వైసీపీ పార్టీలు సంసిద్ధత వ్యక్తం చేశాయి. దీనికి అన్ని పార్టీలు కూడా మద్దతు తెలిపే అవకాశం ఉంది.

VASUNDHARA RASAYANS LIMITED
CIN:L24110TG1987PLC007242
Regd. Off:Shed No.42,Phase-II, I.D.A., Mallapur, Hyderabad - 500076, TELANGANA, INDIA.
ప్రకటన
సెబీ లిస్టింగ్ రెగ్యులేషన్స్ 2015 (ఎల్ఓడిఆర్) యొక్క రెగ్యులేషన్ 47(1)ను అనుసరించి, ఇందుమూలంగా ప్రకటన ఇవ్వడమేమనగా, 31 డిసెంబర్, 2018తో ముగిసిన మూడవ త్రైమాసికం కొరకు ఆడిట్‌చేయని ఆర్థిక ఫలితాలను పరిగణించుటకు మరియు ఆమోదించుటకు కంపెనీ యొక్క రిజిస్టర్డు ఆఫీసు చిరునామా వద్ద గురువారం, 14.02.2019న మ.2.30 గం.లకు కంపెనీ యొక్క బోర్డు ఆఫ్ డైరెక్టర్ల సమావేశం నిర్వహించబడును.
బోర్డు ఆదేశానుసారం
వసుంధర రసాయన్స్ లిమిటెడ్ తరఫున
సం/-
సునీల్ కుమార్ జైన్
డైరెక్టర్
ప్రదేశం: హైదరాబాద్
తేది: 02-02-2019
DIN No: 00117331

DHANALAXMI ROTO SPINNERS LIMITED
CIN:L18100TG1987PLC007769
రిజిస్టర్డు ఆఫీస్: సర్వే నం.114&115, స్టేషన్ రోడ్, తిమ్మాపూర్-509325, మహబూబ్‌నగర్ జిల్లా (తెలంగాణ).
ప్రకటన
సెబీ (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ & డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్, 2015 యొక్క రెగ్యులేషన్ 47 (1) (ఎ)ను అనుసరించి ఇందుమూలంగా ప్రకటన ఇవ్వడమేమనగా, 31.12.2018తో ముగిసిన త్రైమాసికం కొరకు ఆడిట్‌చేయని ఆర్థిక ఫలితాలను పరిగణించుటకు సంబంధించి కంపెనీ యొక్క రిజిస్టర్డు ఆఫీస్ వద్ద బుధవారం, 13 ఫిబ్రవరి, 2019న సా.4.00గం.లకు కంపెనీ యొక్క బోర్డు ఆఫ్ డైరెక్టర్ల సమావేశం నిర్వహించబడును.
For Dhanalaxmi Roto Spinners Limited
సం/-
రాజ్‌కుమార్ జవాని
మేనేజింగ్ డైరెక్టర్
ప్రదేశం: హైదరాబాద్
తేది: 04-02-2019

SANGAM HEALTHCARE PRODUCTS LTD
రిజిస్టర్డు ఆఫీసు: ఫ్లాట్ నం. 205 & 206, అమర్ చంద్ శర్మ కాంప్లెక్స్, ఎస్.పి.రోడ్, సికింద్రాబాద్, హైదరాబాద్
ప్రకటన
సెబీ (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ & డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్, 2015 యొక్క రెగ్యులేషన్ 47తో చదవగల రెగ్యులేషన్ 29ను అనుసరించి ఇందుమూలంగా ప్రకటన ఇవ్వడమేమనగా, 31.12.2018తో ముగిసిన త్రైమాసికం కొరకు ఆడిట్‌చేయని ఆర్థిక ఫలితాలను పరిగణించుటకు మరియు ఆమోదించుటకు సంబంధించి బుధవారం, 13.02.2019న సా.4.00గం.లకు కంపెనీ యొక్క బోర్డు ఆఫ్ డైరెక్టర్ల సమావేశం నిర్వహించబడును.
సదరు నోటీసు కంపెనీ యొక్క వెబ్‌సైట్: http://www.sangamhealthcare.co.in పై మరియు బిఎస్ఇ లిమిటెడ్: www.bseindia.com పై కూడా అందుబాటులో ఉంటుంది.
For Sangam Health Care ProductsLimited
సం/-
ఎ. బాల గోపాల్
మేనేజింగ్ డైరెక్టర్
ప్రదేశం: సికింద్రాబాద్
తేది: 02-02-2019
(DIN: 01702903)

ఆంధ్రప్రదేశ్ టన్నెరీస్ లిమిటెడ్
రిజిస్టర్డు ఆఫీసు: లెదర్ కాంప్లెక్స్ ఏరియా, నెల్లిమర్ల-535 217 విజయనగరం జిల్లా, ఆంధ్రప్రదేశ్
CIN: L19110AP1974PLC001711
Tel No. 022-24934923,
Fax: 022-24934294
e-mail ID:sugandhas78@rediffmail.com
Website: www.aptl.net.in
సెబీ (లిస్టింగ్ ఆబ్లిగేషన్స్ అండ్ డిస్‌క్లోజర్ రిక్వైర్‌మెంట్స్) రెగ్యులేషన్స్, 2015 యొక్క రెగ్యులేషన్ 47(1)(ఎ)ను అనుసరించి, ఇందుమూలంగా ప్రకటన ఇవ్వడమేమనగా, 31 డిసెంబర్, 2018తో ముగిసిన త్రైమాసికం కొరకు ఆడిట్ చేయని ఆర్థిక ఫలితాలను ఆమోదించుటకు సంబంధించి 13 ఫిబ్రవరి, 2019 బుధవారం రోజున కంపెనీ యొక్క బోర్డు ఆఫ్ డైరెక్టర్ల సమావేశం నిర్వహించబడును.
బోర్డు సమావేశం యొక్క ప్రకటన కంపెనీ యొక్క వెబ్‌సైట్: www.aptl.net.in పై మరియు స్టాక్ ఎక్స్ఛేంజి యొక్క వెబ్‌సైట్ www.bseindia.com పై కూడా అప్‌లోడ్ చేయబడింది.
బోర్డు తరఫున
సం/-
సుగంధ శెలాట్కర్
డైరెక్టర్
DIN No. 06906156
ప్రదేశం: ముంబయి
తేది: 02 ఫిబ్రవరి, 2019

CES LIMITED
(Formerly known as SERVE ALL ENTERPRISE SOLUTIONS LIMITED)
Regd. Office: 7th Floor, Tower A, Ramky Selenium, Nanakramguda, Financial District, Gachibowli, HYDERABAD - 500 039
Phone No. 040 - 42421122, Fax No. 040 - 40102456
NOTICE
Notice is hereby given that pursuant to Regulation 47 of the SEBI(LODR) Regulations,2015 , meeting of Board of Directors of the Company is scheduled to be held on Thursday, 14th , February , 2019 at 4:00 p.m. at 7th Floor Tower-A, Ramky Selenium, Nanakramguda, Gachibowli, Hyderabad - 500 032, inter- alia consider and approve Standalone Financial results of the Company for Quarter End 31st December , 2018.
The above details are also available on the website of the Company (www.cesltd.com) and the BSE Limited (www.bseindia.com) where shares of the Company are Listed.
Place : Hyderabad
Date: 01.02.2019
For CES Limited
Sd/-
Surya Prakash. M
Company Secretary

Apollo Micro Systems Limited
(formerly Apollo Micro Systems Private Limited)
రిజిస్టర్డు ఆఫీస్: ప్లాట్ నం.128/ఎ, రోడ్ నం.12, బిఎమ్ఎల్ రోడ్, ఐడిఏ మల్లాపూర్, ఉప్పల్ మండలం, హైదరాబాద్-500076, తెలంగాణ, ఇండియా ;
కార్పొరేట్ గుర్తింపు నంబరు :L72200TG1997PLC026556 Telephone: +91 40 2716 7000 – 99; Facsimile: +91 40 2715 0820; Email: cs@apollo-micro.com; Website: www.apollo-micro.com;
తేది: 02 ఫిబ్రవరి, 2019న కంపెనీచే జారీచేయబడిన ప్రకటనకు సవరణ
31 డిసెంబర్, 2018 (ఐఎన్‌డి ఏఎస్)తో ముగిసిన త్రైమాసికం మరియు తొమ్మిది నెలల వ్యవధి కొరకు ఆడిట్‌చేయని స్టాండ్అలోన్ ఆర్థిక ఫలితాల నివేదిక డిస్‌క్లోజర్ కొరకు తేది.02 ఫిబ్రవరి, 2019న కంపెనీచే ఇవ్వబడిన పత్రిక ప్రకటనకు ఇది సూచనగా, మేము ఇందుమూలంగా మీకు తెలియజేయునది ఏమనగా కాలమ్ నం.3లో సంవత్సరం 31.12.2018 (ఆడిట్‌చేయని) బదులుగా 31.12.2017 (ఆడిట్‌చేయని)గా అనుకోకుండా పేర్కొనడమైనది.
కాలమ్ నం.3లోని సంవత్సరంను 31.12.2018 (ఆడిట్‌చేయని)గా చదవగలరు.
ఇది మీకు సమాచారం మరియు రికార్డు కొరకు.
బోర్డు ఆఫ్ డైరెక్టర్ల తరఫున
For Apollo Micro Systems Limited
సం/-
ప్రదేశం: హైదరాబాద్
తేది: 02 ఫిబ్రవరి, 2019
విఠల్ చైతన్య శివ శంకర్
కంపెనీ సెక్రటరీ మరియు కాంప్లియన్స్ ఆఫీసర్

ఫారం జి (తేది పొడిగించబడినది)
ఆసక్తి వ్యక్తపరచుట కొరకు ఆహ్వానం
(ఇన్‌సాల్వెన్సీ & బ్యాంక్రప్టసీ (ఇన్‌సాల్వెన్సీ రిజొల్యూషన్ ప్రాసెస్ ఫర్ కార్పొరేట్ పర్సన్స్) రెగ్యులేషన్స్, 2016 యొక్క రెగ్యులేషన్ 36ఎ (1) క్రింద)

	సంబంధిత వివరాలు	
1.	కార్పొరేట్ డెటార్ పేరు	అపెక్స్ డ్రగ్స్ లిమిటెడ్
2.	కార్పొరేట్ డెటార్ యొక్క ఇన్‌కార్పొరేషన్ తేది	05/12/1989
3.	ఇన్‌కార్పొరేటెడ్/ రిజిస్టర్డుచేయబడిన కార్పొరేట్ డెటార్ క్రింది అథారిటీ	రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్- హైదరాబాద్
4.	కార్పొరేట్ డెటార్ యొక్క కార్పొరేట్ గుర్తింపు సంఖ్య/ పరిమిత లియబిలిటీ గుర్తింపు సంఖ్య	U24230TG1989PLC010737
5.	కార్పొరేట్ డెటార్ యొక్క రిజిస్టర్డు ఆఫీసు మరియు ప్రధాన కార్యాలయం (ఏదేనిఉన్న) చిరునామా	రిజిస్టర్డు ఆఫీస్: 210, 2వ అంతస్తు, రామ్స్ ఎన్‌క్లేవ్, పోంగా హౌస్ పైన, ఎర్రగడ్డ, హైదరాబాద్, తెలంగాణ-500018
6.	కార్పొరేట్ డెటార్ యొక్క ఇన్‌సాల్వెన్సీ ప్రారంభ తేది	06/09/2018
7.	ఆసక్తి వ్యక్తపరుచుటకు ఆహ్వాన తేది	04/02/2019 (Revised) 11/01/2019 (Original)
8.	కోడ్ యొక్క సెక్షన్ 25(2)(హెచ్) క్రింద రిజొల్యూషన్ దరఖాస్తుదారుల కొరకు అర్హత ఇవ్వుట అందుబాటులో ఉంటాయి	కోడ్ యొక్క సెక్షన్ 25(2)(హెచ్) క్రింద రిజొల్యూషన్ దరఖాస్తుదారుల కొరకు అర్హత దిగువనుండి పొందవచ్చు. www.witworthipe.com
9.	సెక్షన్ 29ఎ క్రింద వర్తించు అనర్హత యొక్క నిబంధనలు ఇవ్వుట అందుబాటులో ఉండును	సెక్షన్ 29ఎ క్రింద వర్తించు అనర్హత యొక్క నిబంధనలను దిగువ వెబ్‌సైట్: www.witworthipe.com నుండి పొందవచ్చును. దిగువ వెబ్‌సైట్‌పై కూడా లభించును. IBBI: http://ibbi.gov.in/webfront/legal_framewo rk.php
10.	ఆసక్తి వ్యక్తపరుచుట స్వీకరణ కొరకు చివరి తేది	18/02/2019 (Revised) 25/01/2019 (Original)
11.	ప్రాస్పెక్టివ్ రిజొల్యూషన్ దరఖాస్తుల యొక్క ప్రొవిజనల్ జాబితా జారీచేయు తేది	28/02/2019 (Revised) 31/01/2019 (Original)
12.	ప్రొవిజనల్ జాబితాకు అభ్యంతరాలు దాఖలు చేయుట కొరకు చివరి	05/03/2019 (Revised) 04/02/2019 (Original)
13.	ప్రాస్పెక్టివ్ రిజొల్యూషన్ దరఖాస్తుల తుది జాబితా జారీచేయు తేది	15/03/2019* (Revised) 12/02/2019 (Original)
14.	ప్రాస్పెక్టివ్ రిజొల్యూషన్ దరఖాస్తులకు రిజొల్యూషన్ ప్లాన్స్ కొరకు ఇన్ఫర్మేషన్ మెమోరండం, ఎవాల్యూయేషన్ మ్యాట్రిక్స్ మరియు అభ్యర్థన జారీచేయు తేది	05/03/2019 (Revised) 04/02/2019 (Original)
15.	రిజొల్యూషన్ ప్లాన్, ఎవాల్యూయేషన్ మ్యాట్రిక్స్, ఇన్ఫర్మేషన్ మెమోరండం మరియు తదుపరి సమాచారం కొరకు అభ్యర్థన పొందు విధానం	ప్రొవిజనల్/ఫైనల్ లిస్ట్‌తోసహా రిజొల్యూషన్ దరఖాస్తుదారు(లు) సీరియల్ నం.21 క్రింద ఇవ్వబడినట్లుగా ఇమెయిల్ ద్వారా రిజొల్యూషన్ ప్లాన్ కొరకు ఎవాల్యూయేషన్ మ్యాట్రిక్స్, ఇన్ఫర్మేషన్ మెమోరాండమ్ మరియు అభ్యర్థను ఇవ్వబడును. రిజొల్యూషన్ దరఖాస్తుదారు(ల)చే తీసుకోబడిన కాన్ఫిడెన్షియాలిటీ దాఖలు తరువాత అవి కల్పించబడును.
16.	రిజొల్యూషన్ ప్లాన్లు దాఖలుచేయుట కొరకు చివరి తేది	15/04/2019* (Revised) 18/02/2019 (Original)
17.	రిజొల్యూషన్ ప్రొఫెషనల్‌కు రిజొల్యూషన్ ప్లాన్లు దాఖలుచేయు విధానం	పై ఐటమ్ 16లో పేర్కొన్నట్లుగా రిజొల్యూషన్ ప్లాన్స్ యొక్క దాఖలు కొరకు చివరి తేదికి ముందుగా ఐటమ్ 21లో పేర్కొన్న చిరునామా వద్ద సీల్డు ఎన్వలప్‌లో భౌతికంగా/ పోస్టుద్వారా మరియు ఇమెయిల్ ద్వారా రిజొల్యూషన్ ప్రొఫెషనల్‌కు ప్రాస్పెక్టివ్ రిజొల్యూషన్ దరఖాస్తుదారు(లు) రిజొల్యూషన్ ప్లాన్స్‌ను దాఖలుచేయాలి.
18.	ఆమోదం కొరకు అడ్జుడికేటింగ్ అథారిటీకు రిజొల్యూషన్ ప్లాను దాఖలుచేయుట కొరకు అంచనా తేది	15/05/2019* (Revised) 05/03/2019 (Original)
19.	రిజొల్యూషన్ ప్రొఫెషనల్ యొక్క పేరు మరియు రిజిస్ట్రేషన్ నంబరు	కపిల్ దేవ్ తనేజ IBBI/IPA-003/IP-N00069/2017-18/10547
20.	బోర్డుతో రిజిస్టరైనట్లుగా రిజొల్యూషన్ ప్రొఫెషనల్ యొక్క పేరు, చిరునామా & ఇ-మెయిల్	పేరు: కపిల్ దేవ్ తనేజ/ చిరునామా: ఇంటి నం.B4–సి/డిడి, జానక్‌పురి, న్యూ ఢిల్లీ–110058. Email ID: kapildtaneja@gmail.com
21.	రిజొల్యూషన్ ప్రొఫెషనల్‌తో సంప్రదింపుల కొరకు ఉపయోగించు ఇ-మెయిల్ & చిరునామా	చిరునామా: సి–124, గ్రౌండ్ ఫ్లోర్, లజపత్ నగర్–1, న్యూ ఢిల్లీ–110024. Email ID: apexdrugs.ip@gmail.com
22	తదుపరి వివరాలు ఇవ్వుట అందుబాటులో ఉంటాయి	కపిల్ దేవ్ తనేజ–రిజొల్యూషన్ ప్రొఫెషనల్ Weblink: www.witworthipe.com Email: apexdrugs.ip@gmail.com kapildtaneja@gmail.com
23	ఫారం జి యొక్క ప్రచురణ తేది	04/02/2019 (Revised) 11/01/2019 (Original)

*వ సిఓసి సమావేశంలో సిఓసిచే ఆమోదించినట్లుగా ఎన్‌సిఎల్‌టి, హైదరాబాద్ నుండి 90 రోజుల పొడిగింపుకు లోబడి ఉంటుంది.
సం/-
కపిల్ దేవ్ తనేజ
రిజొల్యూషన్ ప్రొఫెషనల్
IBBI/IPA-003/IP-N00069/2017-18/10547
అపెక్స్ డ్రగ్స్ లిమిటెడ్ విషయంలో
ఇంటి నం.B4–సి/ డిడి, జానక్‌పురి, న్యూ ఢిల్లీ–110058
E-Mail: kapildtaneja@gmail.com, apexdrugs.ip@gmail.com Phone: 9810758385

కదిలించే కవిత్వం...

దిగులుపడ్డ పడ్డ మనసుకు కన్నీరైన గుండెకు కూలబడ్డ హృదయానికి కవిత్వమో దేవాలయం. అక్షరాలను కవితలు చేసి అలంకరిస్తాడు కవి. ఎంచుకున్న వస్తువు నిర్మాణ క్రమం వెలుగురేఖల్ని ప్రసరిస్తాయి. రవివర్మ కుంచెలా కవికలం కలకాలం నిలిచే కవితలకు ప్రాణం పోస్తుంది. చాలా తక్కువ మందికి ఉంటుంది ఆ ప్రతిభ. కవిత్వమో నిరంతర జ్వలనం ప్రసాదమూర్తి గారికి. కదిలించిన ప్రతి సందర్భాన్నీ కవిత్వీకరించటం కవికి కొత్త విషయమేమీకాదు కానీ ఆ క్రమంలో శషభిషలు లేకుండా సూటిగా గుండెల్లో గుడిగంట మోగినట్టు చెప్పే ఒడుపు తెలిసిన కవి ప్రసాదమూర్తి.


ఇటీవలే వారు వెలువరించిన కొత్త కవితా సంపుటి, దేశంలేని ప్రజలు ఆ విషయాన్ని స్పష్టీకరిస్తుంది. డెబ్భై రెండు ఖండికలు పరితను పండు వెన్నెల్లా పలకరిస్తాయి. కల్లోల గోదారిలా కుదిపేస్తాయి. తొలిపొద్దు కిరణంలా వెలుగులు పంచుతాయి. ఎంచుకున్న వస్తువును మృదువైన శిల్పంగా మలిచే మనోహర శిల్పి ప్రసాదమూర్తి. బాధను అనుభవించటమేకాదు బట్వాడా చేయటం తెలిసిన స్వాప్నికుడు. ప్రతీకలు తూనికేసినట్టు తూగుతాయి.అక్షరాలు విరబూస్తాయి. పద్యం వెన్నెలై విరగకాస్తుంది. అదీ వారి ప్రత్యేకత.

కొన్నింటిని పరిచయం చేసే ప్రయత్నం చేస్తాను. 'వాస్తుశిల్పి' కవితలో తనకో విశాల దృక్పథాన్నిచ్చిన తల్లిని ఎలా తలుచుకుంటారో చూడండి. "కన్నీళ్ళు ప్రవహిస్తాయి.../ కత్తులు లోపలికొచ్చి పూలగుత్తులవుతాయి/ అదేమిటో ఎటు తిరిగినా నాకు సూర్యుడూ చంద్రుడే కనపడతారు/

ఏమైనా ఈ ఇంటిని అన్నికాలాల్లోను/ అన్ని వైపులా తెరిచి ఉండేలా కట్టిన/ మా అమ్మ నిజంగా గొప్ప వాస్తు శిల్పి/ అంటారు.. తనను తీర్చిదిద్దిన తల్లికి కవి సమర్పించిన కైమోడ్పుల కవిత అది.

ఈ కవికి తనను లాగేసిన అంశమేదైనా పద్యమే. తనతో తాను యుద్ధంచేసి మరీ భావాలకు భవభూతిలా పదబంధాల కానుకిస్తాడు. అది హక్కుల హరింపుపై నిరసన అయినా శీతాకాలపు మంచు వలయినా వలేసి పదాలను అక్షరాల సముద్రంలోంచి ఏరతాడు. 'మంచువల' అనే ఖండికలో రాత్రి అల్లిన మంచు వలను సూర్యుడు లాగటాన్ని ఊరంతా చూపిస్తాడు కవి.

పచ్చిపచ్చి కిరణాలను/ గుళ్ళమీదా ఇళ్ళమీదా దులపరిస్తూ/ అని మొదలు పెట్టి పొలాల మీదుగా ఊరి మీదుగా చెరువుల మీదగా/ వలనులాక్కుంటూ వచ్చి/ ఊరవతల వెలివాడలో కూలబడతాడు/ బహిష్కృత స్మృతుల బ్రహ్మజెముడు పొదలకు చిక్కుకున్న/ వలను లాగలేక ఇనుడు ఖిన్నుడవుతాడు/ అని కొంచెం ముందుకు వెళ్ళి మనల్ని, మన మనసుల్ని అక్కడ నిలబెట్టేస్తాడు. ఊరంతా తిరిగిన కవి దాచుకున్న స్మృతుల చెమ్మ అది..



ఇక మకుట పద్యం దేశం లేని ప్రజలు చూస్తే ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న పరిణామాలు కవిని కుదిపేయగా బాధ పరుచుకున్న పద్యం మనముందు మోకరిల్లుతుంది.. బాధను వ్యక్తం చేయడంలో ఈ కవి సందేహపడడు. కలవరపడతాడు.

కళవళపడతాడు.. నిప్పులో ముంచిన అక్షరాలను పదాలుగా వెలికి తీస్తాడు. దేహాలను దేశాలకవతల గుడారాలుగా పాతుకుంటున్న/ కాందిశీకుల కళ్ళలో కత్తులు పూస్తున్న కాలం గురించి మాట్లాడాలి/ అంటాడు

దృశ్యాన్ని చూపిస్తూ/ దేశాలిప్పుడు డిఎన్ఏ పరీక్షలు చేస్తున్నాయి/ అని వాపోతాడు. మనుషుల మధ్య ఇనప తెరలు దేశాల మధ్య ఇనప తెరలు దేశంలేని ప్రజల చితిని పేరుస్తున్నాయని చింతిస్తూ "దేశంలేని ప్రజలే నా కలల తీరంనిండా"అని కన్నీటి సమూహాల హాహాకారాలతో నివాళి సమర్పిస్తారు.

ఈ కవికి తన ఊరంటే ఇష్టం. ఊరు వెళ్ళినప్పుడల్లా ఒక అనుభూతిని పద్యంగా చిలకరిస్తారు. ధ్వంసమైన ఊరి చెరువును చూసి కవి గుండె చెరువవ్వగా జాలువారిన వాక్యాలు చూడండి పచ్చదనాన్ని ఊడ్చిపారేయడానికి/ రొయ్యలూ చేపలు కొత్త పారలు మోసుకొచ్చాయి/ అంటూ తనకంతా తారుమారుగా ఉంది అని నిరాశ వ్యక్తపరుస్తారు.... అలా అని ప్రతిసారీ నిరాశే ఉంటుందనుకోకండి.

"లేతవరిమొక్కలు పద్యం కూడా ఆయన ఊరువెళ్ళినప్పుడే అనుభూతిగా వెలువడ్డదే. చుట్టమొచ్చాడని పలకరింపుగా/ చుట్టూ పంట చేలలో లేత వరి మొక్కలు/ కొత్త కవితలై తలలు పైకెత్తి నవ్వినట్టు" అని సమాధానపడతాడు.

కవికి కాలస్పృహ ఉండాలంటారు. కవి ప్రసాదమూర్తి తన కవితలద్వారా.. స్టీఫెన్ హాకింగ్ స్మృతులను పరిచయం చేస్తూ "కాలం కాగితం మీద జ్ఞాన దీపాలు లిఖిస్తూ/ ఏ గహనాంబరాల గవేషణలోనే/ తుది ప్రయాణంలో అతను" అంటారు కవి..

కాస్ట్రో,సాహిర్ లూధియాన్వీ,గౌరీ లంకేష్ జ్ఞాపకాల స్మృతులను తవ్విపోస్తారు.


అన్ని కవితల్లోను తాత్వికధార ఒదుగుతూ ఆకట్టుకుంటుంది. వస్తువుకు తగ్గ భావోద్వేగాలతో కవితలతో దీపకాంతులై వెలుగుతుంటాయి. అన్ని కవితల్లోనూ చివరి వాక్యం చీల్చే కత్తిలా పదునెక్కి ఉంటుంది. ఏమాత్రం గందరగోళం చోటుచేసుకోని కవితలన్నీ మనిషి రీతికి లోకభీతికి నిదర్శనంగా నిలుస్తాయి. కవి వాదానికి మనం కట్టుబడకపోవచ్చు కానీ కవి తన వాదనను కొనసాగించిన తీరు ముచ్చటేస్తుంది. పందిరేసి అల్లినట్టున్న పదాల పొందిక జీవితంలోని తీపిని చేదును పరిచయం చేస్తూ మనిషిగా మన కర్తవ్యాన్ని గుర్తుచేస్తుంది. ఆలోచింపచేసే ముఖచిత్రం.. ఆకట్టుకునే శీర్షికలు... దేశంలేని ప్రజలు కవితా సంపుటి కవిత్వాన్నెందుకు పలవరించాలో సున్నితంగా పలకరించాలో సునిశితంగా చెప్పే కావ్యం.

– సి.యస్.రాంబాబు, సెల్ : 94904 01005

స్వేచ్ఛా జీవులు

పిచ్చుకల అరుపులతో
మా లాన్‌లోకి తొంగిచూసాను
తులసిమొక్కను అంటుకున్న
గొల్లభామతో
గులాబీ పువ్వుపై వాలిన సీతాకోక
మంతనాలు
సాలీడు సన్నని తీగల
సరిగమలు పలుకుతూ
కుండీకి మొక్కలకు
మధ్య వారధయ్యింది
ఏంటీ సంగతి అంటూ
ఒక తీగను అటూ తీసింది,
గుట్టుగా గుసగుసగా
చెప్పుకుంటున్నాయి
జామ పండు రాలిన శబ్దానికి
అన్నీ గొంతు సవరించుకుంటూ వాటి
వాటి స్థానాలకు ఎగిరిపోయాయి
నాలుగు ఆకులు అక్కడ
రాలిపడున్నాయి
వాటిపై ఇలా రాసుంది
కామ్రేడ్..
స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు అంటూ
ఏవో జెండాలు ఎగరేస్తున్నారు
ఈ జనాలు అప్పుడప్పుడు,
మనకెప్పుడవిజి
గింజల్లేవు
నీళ్ల లేవు
చెట్లు లేవు
మట్టి లేదు
కానీ మనముండాలి వాళ్ళకి
పంజరాల్లో బొమ్మల్లా
మన మ్యానిఫెస్టో ప్రకారం
వాటిని నిరసిస్తూ
ఈ రోజు శీతాకాల సమావేశం
గూళ్లకు చేరేముందే అందరం
పొన్న చెట్టు నీడన ఒక సందేశాన్ని
అన్నివైపులా చేరవేయాలంటూ....
అది చదివిన నా కళ్ళు చెమర్చాయి
ఆకాశం కూడా చెమ్మగిల్లినట్లుంది
సన్నగా వర్షం
ఆ రోజు నుండి
మా ఇంటి వసారాలో మట్టి ,చెట్లు,
పూలు,రకరకాల జీవాలు
వాటి సమావేశాలన్నీ
నా ఇంటి గుమ్మంలోనే...

– సుభాషిణి తోట




తెలుగు సాహిత్యంలో భావ విప్లవం బలపడి తీక్షణ కాల్పనికత వీస్తున్న రోజుల్లో చైనాదేశంలో నవ సాంస్కృతికోద్యమం నడిచింది. దీని నాయకుల్లో హుషిహ్ (1862-1962) ఒకరు. ఈయన వ్యవహారిక సత్తావాదాన్ని స్థాపించి చైనా పునర్నిర్మాణవాదానికి విద్యాపరంగా సాహిత్య పరంగా మద్దతు ఇచ్చిండు. 1939లో నోబెల్ పురస్కారానికి నామినేట్ అయిన హుషిహ్ భారతీయ సంస్క తికి " India conquered and dominated China culturally for twenty centuries without ever having to send single soldier across her borders" అంటూ1937లో హార్వర్డ్ యూనివర్సిటీ ప్రసంగంలో నీరాజనం పట్టిండు. సమాజంలో సాహిత్యంలో చోటుచేసుకునే మార్పులు పరిణతి దిశగా సాగినప్పుడే చైతన్యం నూరుపూలుగా వికసిస్తుందన్నడు. 1917 జనవరిలో బీజింగ్ నుండి వెలువడిన కమ్యూనిస్టు సిద్ధాంత పత్రిక 'న్యూ యూత్'కు హు షిహ్ రాసిన విమర్శావ్యాసం ఎంతో విలువైనది. ఇందులో ప్రతిపాదించిన ఎనిమిది అంశాలు కొత్తదనం అన్నింటా కోరుకునే కవులకు రచయితలకు మార్గదర్శకాలు. ఈ వ్యాసం కొలంబియా విశ్వవిద్యాలయానికి చెందిన థియోడర్ డి బెరీ, రిచర్డ్ లుఫ్రినోలు సంయుక్తంగా సంకలనం చేసిన 'సోర్సెస్ ఆఫ్ చైనీస్ ట్రెడిషన్- వాల్యూమ్-2, కొలంబియా యూనివర్సిటీ ప్రెస్, 2000'లో అందుబాటులో ఉంది.

అభ్యుదయ సృజన ఒక బాధ్యత

కొలంబియా విశ్వవిద్యాలయంలో తత్వశాస్త్ర పరిశోధకుడిగా (1917) ఉన్న సమయంలో జాన్ డ్యూయీ ప్రభావానికి హు షిహ్ లోనయ్యిండు. పరిశోధనానంతరం మాతృదేశానికి తిరిగి వచ్చి, తన గురువు డ్యూయీ స్థాపించిన ప్రాగ్మాటిజానికి జీవితకాలం ప్రచారకుడిగా కొనసాగిండు. పెకింగ్ విశ్వవిద్యాలయానికి అధ్యక్షుడిగా పనిచేసి చైనా విద్యారంగాన్ని విస్తృతంగా ప్రభావితం చేసిండు. 'May Four Movement'కు ముఖ్య భూమిక నిర్వహించిన హుషిహ్ చైనా ఆధునిక కవిత్వానికి ఆద్యుడిగా నిలబడిండు. చైనా పునర్వికాసం మీద విరివిగా రచనలు చేసిండు. వినూత్న సాహిత్య సృష్టికి హు షిహ్ విశ్వసించి ఉద్ఘాటించిన "I believe that literary reform' at the present time must begin with these eghit items:(1)Write with substance. (2)Do not imitate the ancients. (3) Emphasize grammar. (4).Reject melancholy. (5) Eliminate old cliches. (6)Do not use allusions. (7)Do not use couplets and parallelisms. And (8)Do not avoid popular expressions or popular forms of characters" ఈ సూచనలు సాహిత్య మౌలిక లక్షణాల్ని లోతుగా పట్టిస్తూ వినూత్నతకు పాదు వేస్తవి.

Write with substance అంశం కింద అనుభూతికి ఆలోచనకు రచనలో ప్రాధాన్యత ఉండాలన్నడు. కేవలం పదజాలం, వాక్యం సముదాయం, స్వరలయల కూర్పు రచన కాదు. రచనకు అనుభూతే ఆత్మ అని, జ్ఞానం, ఆదర్శం, ఒక దివ్యచక్షువు రచనలోని ఆలోచన ద్వారా పాఠకులకు అందాలన్నడు హు షిహ్. Do not imitate the ancients అంశంలో సాహిత్యం కాలవాచి, మార్పుకు సూచి అని, పాత కథల ఎత్తిపోతల వలన లాభం లేదని, కవులు రచయితలు వస్తు రూపాల్లో ఎవరి స్వంత ముద్ర వారికి ఉండాలన్నడు. గ్రామ్య జీవద్భాష జీవనేతివృత్తాలు ఘనమైన సాహిత్యం అవుతాయన్నడు. వ్యాకరణం పట్ల చులకన,నిరాదరణ సాహిత్య వేత్తలకు పనికిరాదన్నడు. భాషకున్న రాజస్వ నియమావళిగా భాషా ప్రాదేశికతగా వ్యాకరణాన్ని అభివర్ణించిండు. యువతరానికి సృజన పట్ల గల మోహోద్రేకం కలం పేర్ల విషయంలో కావచ్చు, కాలస్వభావాన్ని చిత్రించడంలో కావచ్చు జ్ఞాన పైత్యంగా మారకూడదన్నడు. మూసవిధానాన్ని తీవ్రంగా నిరసించిండు. ఎవరిరైతే స్వీయభాషను, సొంత గొంతుకను,



స్వీయానుభవాలను రచనలో రక్తి కట్టించలేరో, ఎవరికైతే own terms of description ఉండదో వాళ్లను సాహిత్య సోమరులుగా పేర్కొన్నడు. పూర్వ కవులు చెప్పిన సాదృశ్యాలను, జాతీయాలను, చారిత్రక ఘట్టాలను, సామ్యతలను, ఉటంకింపులను యధాతథంగా అరువు పుచ్చుకోవడం హీనత్వంగా, అసమర్ధతగా పేర్కొన్నడు. మానవభాషకు సమాంతరత్వం ప్రత్యేక లక్షణమైనప్పటికీ, ఆయా కవుల ద్విపదలను, శ్లోకాలను తిరిగి చెప్పడం, కథాకథనాల్లో వర్ణనల్లో సమాంతరత్వం హేయమైన చర్యగా క్షీణతగా తిరస్కరించిండు. ప్రజలకు అర్థం అయ్యే జీవనోక్తులు, జీవద్రూపాలు సహజంగా



వాటికవే అలంకారంగా ఔచిత్యంగా ప్రాకృతికతగా రూపొందుతున్నపుడు కావాలని పరిహరించడం సాహిత్య మర్యాద కాదని వివరణ ఇచ్చిండు. సజీవ వ్యక్తీకరణకు స్థానం కల్పిస్తే రచనలకు జీవం జవం సమకూరుతాయన్నడు.

నీరసం నిస్సత్తువ నిర్లిప్తత నిస్పృహ సమాజాన్ని ముంచేస్తున్న సమయాల్లో, రొడ్డకొట్టుడు వేలంవెర్రి అనుకరణ అచేతనం కళారంగాన్ని ఆవరించిన సందర్భంలో సాహిత్యమే పరిష్కారానికి దారి చూపే అంతిమ యోధ. అన్ని కాలాల్లో, అన్ని సమాజాలల్లో రచన యోధగా తయారు కావడానికి కావల్సిన సూచనలను సలహాలను నిర్మొహమాటంగా ప్రకటించి సాహిత్యాభివృద్ధిలో అభ్యుదయ సృజన ఒక మేధో బాధ్యత అని గుర్తు చేసిండు .సాహిత్యం లో వచ్చిన మార్పులు సమాజంలో కనిపించడం ఒక నింపాది పద్ధతి అయితే, సమాజంలో వచ్చిన పరిణామాలు సాహిత్యంలో కనిపించడం అనేది రెండో పద్ధతి అత్యంత వేగవంతమైనది. ఈ రెండిటిలో ఏ పద్ధతిలో స్పందించే వారికైనా హు షిహ్ ఎనిమిది సూత్రాలు అభ్యసించి అనుసరించదగినవి. కలకాలం నిలబడే సాహిత్యం, ప్రజా రాజకీయాల నిర్మాణంలో భాగస్వామ్యం కలిగిన సాహిత్యం, కళాత్మక అవసరాలే కాదు సామాజిక బాధ్యత నిర్వహించే సాహిత్య సృష్టికి పరితపించే వాళ్లందరికి హు షిహ్ వ్యాసం సదా పాఠ్యాంశం.

– డా.బెల్లి యాదయ్య

సెల్ : 98483 92690

సాహిత్యవార్తలు

నేడు పూలబాట ఆవిష్కరణ సభ

పింగళి వేంకట కృష్ణారావు రచించిన 'పూలబాట' బాలశతకం ఆవిష్కరణసభ ఈ రోజు సాయంత్రం నాలుగు గంటలకు ఎల్.బి.నగర్ సౌభాగ్య కమ్యూనిటీ హాల్‌లో జరుగుతుంది. 'సాహితీకిరణం' సంపాదకులు పొత్తూరి సుబ్బారావు అధ్యక్షతన జరిగే ఈ సభలో పుస్తకాన్ని ప్రముఖ సాహితీవేత్త సుధామ ఆవిష్కరిస్తారు.

5న చైతన్యప్రకాశ్ సంస్మరణ సభ

ప్రముఖ రచయిత చైతన్యప్రకాశ్ సంస్మరణ సభ ఈ నెల అయిదో తేదీన రవీంద్రభారతి కాన్ఫరెన్స్‌హాలులో జరుగుతుందిన తెలంగాణ రచయిత సంఘం అధ్యక్షుడు నాళేశ్వరం శంకరం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సభలో నందిని సిధారెడ్డి, కాశీం, కె.పి. అశోక్‌కుమార్, వి. శంకర్, కందుకూరి శ్రీరాములు ప్రభృతులు ప్రసంగిస్తారు.

7న రెండు పుస్తకాల ఆవిష్కరణ సభ

డా॥ కొండపల్లి నీహారిణి కథల సంపుటి - రాచిప్ప, సాహిత్య వ్యాసాల సంపుటి - సృజన రంజని- ఆవిష్కరణ సభ ఈ నెల ఏడో తేదీ ఉదయం పదిన్నర గంటలకు రవీంద్రభారతి మినీహాల్‌లో జరుగుతుందని తెలంగాణ రచయితల సంఘం ఒక ప్రకటనలో తెలియజేసింది. ఈ రెండు పుస్తకాలని నందిని సిధారెడ్డి, ముదిగంటి సుజాతారెడ్డి ఆవిష్కరిస్తారు.

8న కావ్య పరిమళం సభ

తెలంగాణ సాహిత్య అకాడమీ నెలనెలా కావ్యపరిమళం పరంపరలో భాగంగా ఈ నెల 8వ తేదీన సాయంత్రం ఆరుగంటలకు రవీంద్రభారతి మినీహాల్‌లో సభ జరుగుతుంది. కాళోజీ 'నా గొడవ'పై తూర్పు మల్లారెడ్డి ప్రసంగిస్తారు, సభకు నందిని సిధారెడ్డి అధ్యక్షత వహిస్తారని తెలంగాణ సాహిత్య అకాడమీ కార్యదర్శి ఏనుగు నరసింహారెడ్డి తెలియజేశారు.

బండారి రాజ్ కుమార్‌కు యువపురస్కారం

తెలంగాణ రాష్ట్రం,వరంగల్ రూరల్ జిల్లా పాతమగ్దుంపురం గ్రామానికి చెందిన కవి బండారి రాజ్ కుమార్‌కు 2018 సంవత్సరానికిగాను కలకత్తా భారతీయ భాషా పరిషత్ యువపురస్కారాన్ని ప్రకటించింది. మార్చి 15ꠄ16 తేదీలలో కలకత్తాలో జరిగే ప్రత్యేక కార్యక్రమంలో పురస్కార ప్రధానం జరుగుతుంది. పురస్కారం కింద రూ.21,000/- (ఇరవై ఒక్క వేల రూపాయలు) నగదు,ప్రశంసా పత్రం,శాలువా ప్రదానం చేస్తారు.

కొత్త నడక

పూర్వజన్మలో అమ్మె ఉంటుంది
ప్రతిరోజూ నా అవసరాలు తీర్చి
నన్ను శుభ్రం చేసి దుస్తులు వేసి
ఆప్యాయతతో పలకరిస్తున్న
ఆమెకు నేను ఏమివ్వగలను ?
పక్షం రోజుల తర్వాత..నా పాదాలు
ఇపుడిపుడే చేతనత్వం సంతరించుకున్నాయి..
బతకటానికి ఎదురు నిలబడాలంటే
ఒక్క అడుగైనా ముందుకు వేయాల్సిందే..
జీవనవనంలో పరిచిన పూలబాట పై
నా నడక సాగిపోవాలి
మునివేళ్లపై నిలబడి సన్నజాజులు కోసుకునే
ఉదయాలకోసం ఎదురు చూస్తున్న
ఇపుడిపుడే ఎదుగుతున్న దాన్ని
నవ్య కవిత్వమై వికసిస్తున్న దాన్ని
ఇంటికి రాగానే
అక్షరాల పరిమళం గుప్పుమంటూ
నా గుండె తలుపు తట్టింది
కొన్ని దినాలుగా ఆసుపత్రి మందులకు, శరీరకోతలకు
తల్లడిల్లిన హృదయం.. కవన మలయసమీరం
నా తనువు ను స్పర్శించగానే
కవన పూదోటను చేరాలనే
తొందరలో నా పదములకు
కొత్త గా నడకలు నేర్పిస్తున్న..



– ములుగు.లక్ష్మిమైథిలి, 9440088482

కవిత్వంలో మొదటి కోండ్ర

నాగవర్మ కవిత్వంలో ఇది మొదటి కోండ్ర. ఆయన కరీంనగర్‌లో 2004లో డిగ్రీ చదువుతున్నప్పుడే కవిత్వ పొలిమేరలకు వచ్చిండు. ఆ తర్వాత ఉన్నత చదువులు, ఉద్యోగవేట వివాహం అన్న దశలు విజయవంతంగా దాటుకొని సాహిత్య వ్యవసాయంలో సాలు పెట్టిండు.

ముత్యం నాగవర్మ కవిత్వం నిండా ఎవుసం, వ్యవసాయదారుడు, ఊరు, బడి, బడిపిల్లలు అల్లుకుంటరు. భూమి మీద మనసుకు పట్టనివ్వని ఆవేదన గన్పిస్తది.

నీకు భూమంటే మన్నే కనువడతది
కాని ఈ భూమే
మాకు బువ్వ పెట్టే తల్లి
ఆసర పెట్టే కొడుకు
ఆపతిల ఆదుకునే సోపతి


మంచిర్యాల జిల్లాకు ఎర్రగుంటపల్లిలో ఏండ్లకు పైగా సింగరేణి ఓపెన్ కాస్ట్ మైనింగ్‌కు తమ భూమి ఇయ్యమని రైతులు నిరాహారదీక్ష చేస్తున్నరు. ప్రభుత్వం బలవంతంగా భూములు గుంజుకునే విధానాలపై ఆయన చలించి పోయిండు.

నాగవర్మ మిషన్ కాకతీయ ద్వార చెరువుల తవ్వకాన్ని రైతుకవిగా ఆనందాన్ని పంచుకుంటాడు.

నిన్నటిదాకా పని లేని నీరటి ఇగ
కాలువ గట్టు మీద కవాతు చేత్తడు
నీరు గట్టె అసొంటి నాగలి ఇగ
జేరొ పోత్తె పరుగులు తీస్తది

కవి అనుకులమా వ్యతిరేకమా అని కాదు ఆయా విధానాలపైనే ఒక ద్రష్టగా వ్యాఖ్యానిస్తాడు. ముందే చెప్పినట్టు పల్లెటూర్ల మీద రాయని కవి లేడు. నాగవర్మ పుట్టింది ఉద్యోగం చేస్తున్నదీ పల్లెనే గనుక ఆ అనుబంధం ఇంకా పచ్చిపచ్చిగా కొనసాగుతుంది.

చెరువులు కుంటలు
కాలువలు వాగులే కాదు
చిన్న చిన్న మడుగులు కూడా
నా మనోఫలకం మీద మహా సముద్రాలే
ఎందుకంటే
నీటి బొట్టు తాకితేనే తప్ప
మొలకెత్తని రైతు కుటుంబంలో పుట్టాను



'ప్రశ్న అంటే ఎత్రాజ్' అనే గొప్పగా చెప్పాడు వర్మ. ప్రశ్ననే గదా సమాజ అంశను దొరుకబట్టేది. ప్రశ్న లేకపోతే మళ్ళీ చెప్పింది వినే బానిస మనస్తత్వం వ్యాపిస్తది. అల్లకల్లోలం అవుతున్న సామాజిక అంశాలను సహజంగానే కవి పట్టుకుంటాడు.

ఇట్లాంటి పలు కవితలు సాళ్ళు సాళ్ళుగా పరుచుకున్నాడు. బడి మీద పిల్లల మీద బాగానే ఉన్నయి. ఎందుకంటే నిరంతరం పాఠశాలనే జీవితం గదా!

పిల్లని ప్రశ్న ఒక ఇత్తు
సారు ఇగురం తోనే మొలకెత్తు

రకరకాల ప్రశ్నించే విద్యార్థులకు పదును పెట్టి శాస్త్రీయ, ఆలోచనల వైపు ప్రోది చేయాల్సింది ఉపాధ్యాయుడు. అందుకే ప్రశ్న అనే విత్తనాన్ని ఇగురంగా మొలకెత్తించాల్సిందిగా చెప్పుతాడు.


ఇప్పుడు ఇక్కడ ప్రశ్నించే ఎత్రోజ్
నిలదీత ధిక్కారం నీ కంట్లో కారం

ఇప్పుడు ప్రశ్నలకు భయపడే కాలం. కొన్ని ప్రశ్నలను ఆదిలోనే అంతం చేస్తున్న కాలం దాపురించింది. 'ప్రశ్న అంటే ఎత్రాజ్' అనే గొప్పగా చెప్పాడు వర్మ. ప్రశ్ననే గదా సమాజ అంశను దొరుకబట్టేది. ప్రశ్న లేకపోతే మళ్ళీ చెప్పింది వినే బానిస మనస్తత్వం వ్యాపిస్తది. అల్లకల్లోలం అవుతున్న సామాజిక అంశాలను సహజంగానే కవి పట్టుకుంటాడు.

కూర తిన్నందుకే
కుతికెలు కోస్తిరా అని ప్రశ్నిస్తే
కుల్లబొడిసి నల్లసిరా మొఖానికి పూసిపోతరు

బహుళ సంస్కృతుల సమాజంలో విపరీత పెడధోరణుల పల స్పందించినట్లే తన నానమ్మ మరణంపై చాలా గొప్ప ఎలిజీ రాసిండు. 'ఎడారైన వాడ' అనే కవితలో వాల్ల ఊరివాల్లు మరణించినపుడు ఒక్కొక్కరి పేర్లతో కవిత వాల్లకు నివాళిగా ఉంది. 'వరికల్లం' శీర్షికన వచ్చిన ఈ కవిత్వం భాషలో, భావంలో కొత్తకొత్తగా ఉంది.

– అన్నవరం దేవేందర్, 94407 63479





"నా బరువు గురించి నేను మాట్లాడినా మాట్లాడకపోయినా సోషల్ మీడియాలో చర్చిస్తూనే ఉంటారు. నాకు ఏ ఇబ్బందీ లేనప్పుడు మీకెందుకు బరువుగా అనిపిస్తోంది? పాత తరం హీరోయిన్లు అందరూ బొద్దుగానే ఉండేవారు. వాళ్లకంత పాపులారిటీ వచ్చిందంటే అది కేవలం వాళ్ల యాక్టింగ్ స్కిల్ వల్లే కానీ సైజ్ జీరో వల్ల కాదు. ఒకవేళ ఏదైనా చిత్రంలో సైజ్ జీరో పాత్రలో నన్ను చూపించాలనుకుంటే నా దగ్గరకు రాకండి.

- నిత్యా మీనన్, దక్షిణాది నటి"

సౌత్ పోల్‌లో సాహసపోలీస్

సెవెన్ సమ్మిట్స్ అధిరోహించిన తొలి మహిళ

అపర్ణ బెంగుళూరులోని నేషనల్ లా కాలేజ్ నుంచి డిగ్రీ పట్టాను తీసుకున్నారు. విద్యార్థిగా ఉన్నప్పుడే ఎన్‌సిసిలో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. 2002లో ఉత్తరప్రదేశ్ క్యాడర్ ఐపీఎస్ అధికారిగా సెలక్ట్ అయ్యారు. ప్రస్తుతం డెహ్రాడూన్‌లో ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ) డీఐజీగా విధులు నిర్వర్తిస్తున్నారు. మొదటినుంచీ ఆమెకు పర్వతారోహణ అంటే ఎంతో ఇష్టం. పర్వతారోహణలో శిక్షణ కోసం మనాలిలో ఉన్న 'అటల్ బిహారి వాజ్‌పేయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మౌంటనీరింగ్ అండ్ అలీడ్ స్పోర్ట్స్' లో చేరారు. మౌంటనీరింగ్‌కు సంబంధించి అడ్వాన్స్ కోర్సు కూడా పూర్తి చేశారు. ప్రపంచంలోని ప్రతి ఖండంలో ఉన్న అత్యంత ఎత్తైన పర్వతాలను అధిరోహించడమే లక్ష్యంగా నిర్ణయించుకున్నారు. ముందుగా సముద్ర మట్టానికి ఇరవైవేల అడుగుల ఎత్తులో ఉండే లఢక్‌లోని స్టోక్‌కాంగ్రి శిఖరాన్ని అధిరోహించారు. ఆ తర్వాత ఆమె ఏడుఖండాల్లోని అతి ఎత్తైన పర్వతారోహణ జైత్రయాత్రను ప్రారంభించారు.

ఏడు ఖండాల్లో..

ముందుగా టాంజానియాలోని కిలిమంజారో(19340అడుగులు) పర్వతాన్ని ఆగస్టు, 2014లో అపర్ణ అధిరోహించారు. ఆఫ్రికన్ ప్లేట్ లోనే ఇది అతి ఎత్తైన పర్వతం. ఇండోనేషియాలోని మరో పర్వతశిఖరాగ్రాన్ని చేరిన ఆమె సాహసయాత్ర అంతటితో ఆగలేదు. 2015లో ఉత్తర అమెరికాలోని అలస్కా(20,310 అడుగులు) పర్వతాగ్రాన్ని చేరి మరోసారి తన సత్తాను చాటుకున్నారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి చేతుల మీదుగా రాణి లక్ష్మీబాయి పురస్కారం అందుకున్నారు. ఆ తర్వాత ఆస్ట్రేలియా ఖండంలోని మౌంట్ కోస్సియుస్కో(17310 అడుగులు) దక్షిణ అమెరికన్‌లోని అకోకాగువా (22,834 అడుగులు)పర్వతశ్రేణులను అధిరోహించారు.

డిఐజి టెలికాంగా బాధ్యతలు నిర్వహిస్తున్న అపర్ణ అంటార్కిటిక్ మిషన్ కోసం నెలరోజులు తన విధులకు సెలవు పెట్టారు. ప్లేట్ లోని అతి ఎత్తైన శిఖరం విన్సన్‌మౌంటెన్‌ను 2016లో అపర్ణ అధిరోహించారు.




ఎవరెస్ట్ లక్ష్యంగా..

2014, 2015 సంవత్సరాల్లో ఎవరెస్ట్‌శిఖరాన్ని చేరుకోవడానికి ఆమె సమాయత్తమైనా అక్కడి వాతావరణ పరిస్థితులు అనుకూలించపోవడం, భూకంపం రావడంతో తన ప్రయత్నాన్ని వాయిదా వేశారు. అంటార్కిటిక్



ఖండంలో విజయవంతంగా పర్వతారోహణ చేసిన తర్వాత ఆసియాఖండం లోని ఎవరెస్ట్‌శిఖరాగ్రాన్ని చేరే ప్రయత్నం చేశారు. ఈ సాహసయాత్ర 9 ఏప్రిల్ 2016 న ప్రారంభించారు. చైనా వైపు నుంచి ఎవరెస్ట్ పైకి చేరుకోవడానికి సిద్ధమయ్యారు. నలుగురి బృందంలో USA, బెల్జియం దేశాల నుంచి కొందరు పర్వతారోహకులు ఉన్నారు. అతి కష్టం మీద 45 డిగ్రీల కంటే తక్కువ ఉష్ణోగ్రత, 150 కిలోమీటర్ల వరకు అధిక వేగంతో కూడిన చల్లగాలులు వీచే వాతావరణంలో ఆమె దాదాపు 45రోజులు ఉన్నారు. మొత్తం యాత్ర సమయంలో దాదాపు 13.5 కిలోల బరువు కోల్పోయారు. అయినా పట్టుదల కుండా శిఖరంవైపే అడుగులు వేశారు. 21 మే , 2016 నాటికి ఆమె ప్రయత్నం ఫలించి ఎవరెస్టుపైకి



చేరారు. భారతపతాకంతో పాటు ఉత్తరప్రదేశ్ పోలీస్‌జెండాను ఆమె ఎవరెస్టుశిఖరంపై ఎగురువేశారు. దీంతో ఆమె ప్రపంచంలోని అత్యధిక ఎత్తైన శిఖరాలన్నింటినీ విజయవంతంగా అధిరోహించారు. ఈ ఘనతను సాధించిన మొట్టమొదటి మహిళా ఐపిఎస్ అధికారిగా రికార్డు సాధించారు. ఏడు ఖండాల్లోని ఎత్తైన పర్వతారోహణ సాహసయాత్రల్లో పాల్గొని ప్రపంచ ప్రసిద్ధిగాంచిన శిఖరాలనెన్నింటినో ఎక్కి తన సత్తాను నిరూపించుకున్నారు.

ఆ తర్వాత ఆమె సౌత్‌పోల్‌లో 111 కిలోమీటర్లు నడిచి మరో రికార్డు సృష్టించారు. 'మైనస్ 40 డిగ్రీల ఉష్ణోగ్రతల మధ్య రోజుకు 8 గంటలు నడక మరిచిపోలేని అనుభూతి. నా చేతులు, వేళ్లు చలితో బిగుసుకుపోయేవి. సమస్యల మధ్య యాత్ర పూర్తి చేయడం ఆనందంగా ఉంది.' అంటారు అపర్ణ. 'భర్త ఐఎఎస్ ఆఫీసర్ సంజయ్ కుమార్ ప్రోత్సాహం, తమ ఇద్దరు పిల్లలు స్పందన, నీల్ తన సాహసయాత్రలకు సంపూర్ణమద్దతు ఇస్తారని, ఉత్తర ప్రదేశ్ ప్రభుత్వ, తమ డిపార్ట్‌మెంట్ సహకారంతోనే తాను ఈ సాహసాలు చేయగలిగాను' అని చెప్పే ఆమె ఎందరికో స్ఫూర్తి.

సమస్యలు లేని జీవితం కోరుకునే వారు, సమస్యలంటే భయపడేవారు ఆమెను చూసి సమస్యలు జీవితమాధుర్యాన్ని పెంచే ఎసెన్స్ అన్నది తెలుసుకోవాలి.

వి.యశోద

వ్యక్తిగత పరిశీలన తప్పనిసరి!

పన్నెండేళ్ల నుంచి ఆడపిల్లలకు వైట్ డిశ్చార్జ్ (తెల్లబట్ట) సమస్య మొదలువుతుంది. ఈ విషయం గురించి వారికి అంతగా తెలియదు. కొంతమంది తల్లులకు ఈ విషయం చెబుతారు.. కొందరు మాత్రం ఈ విషయం బయటకు చెప్పడానికి ఇష్టపడరు. పన్నెండేళ్ల వయస్సు నుంచి మెనోపాజ్ వరకు ఈ సమస్య ప్రతి ఒక్కరినీ ఇబ్బంది పెడుతుంది. దీని గురించి చాలామందికి సరైన అవగాహన ఉండదు. తెలుసుకోవడానికి చాలామంది మొహమాటపడుతుంటారు. అలాకాకుండా తమ శరీరంలో జరిగే మార్పులను తల్లితోనో, పెద్దవారితో చర్చించడం వల్ల సమస్యకు తగిన పరిష్కారం దొరుకుతుంది.



నోట్లో లాలాజలం ఎలా తయారు అవుతుందో, అలాగే మహిళల జననేంద్రియాల నుంచి కూడా తెల్లని స్రావం తయారవుతుంది. దీన్నే వాడుక భాషలో తెల్లబట్ట అంటారు. వైద్య పరిభాషలో 'ల్యూకోరియా' అంటారు.

దీనివల్ల దుర్వాసన, దురద వంటి సమస్యలేవీ ఉండవు. శారీరకంగా, మానసికంగా ఉద్రేకానికి గురైనప్పుడు ఇది వస్తుంది. ఇది దాదాపు అన్ని వయసుల వారిలో కనిపిస్తుంది. పది నుండి పన్నెండు ఏళ్ల వయసులో.. అంటే రజస్వల కావడానికి ముందు సుమారు మూడు నుంచి ఆరు నెలల పాటు తెల్లబట్ట అవుతుంది. ఇది జననావయవాల పెరుగుదల, రక్త సరఫరా ఎక్కువ కావడాన్ని సూచిస్తుంది. దీనికి ఎటువంటి చికిత్స అవసరం లేదు. బహిష్టు రావడానికి నాలుగైదు రోజుల ముందు కానీ, పది పన్నెండు రోజుల ముందు కానీ తెల్లబట్ట కనిపించడం సర్వ సాధారణం. వ్యక్తిగతంగా కొన్ని జాగ్రత్తలు తీసుకోవడం వల్ల తగ్గించుకోవచ్చు.

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి. కాటన్ లోదుస్తులు వాడటం. బహిష్టు సమయంలో శానిటరీ నాప్కిన్స్ వాడడం, వాటిని ప్రతి రెండు గంటలకు ఒకసారి మార్చుకోవడం. గోరువెచ్చని నీటితో శుభ్రపరుచుకోవడం. గాఢమైన కెమికల్స్ కలిగి వుండే డెట్టాల్, సబ్బులు వాడకూడదు. మైల్డ్ సోపుతోనే శుభ్రపరచుకోవాలి. పరూఫ్యూమ్స్, సుగంధ ద్రవ్యాలు వాడరాదు. ❄

మానవి మీ స్పందన

'మానవి' పేజీలు మీకెలా ఉన్నాయి? ఇంకా ఏం కావాలనుకుంటున్నారు? మీ కుటుంబ సభ్యుల, మిత్రుల స్పందన ఎలా ఉంది? 'నవతెలంగాణ' కార్యాలయానికి రాయండి. మీ సూచనలు, సలహాలు ఇ-మెయిల్ nava-maanavi@gmail.com కు తెలియ జేయండి.

మా చిరునామా
మానవి, నవతెలంగాణ దినపత్రిక
ఎం.హెచ్. భవన్, ప్లాట్ నెం. 21/1, 1-8-664, అజామాబాద్, ఆర్.టి.సి. కల్యాణ మండపం సందు, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ - 500 020. లేదా 94900 99016కు ఫోన్ చేయండి. ఇప్పటికే మా ప్రయత్నాలను అభినందిస్తూ స్పందిస్తున్న వారికి కృతజ్ఞతలు.

ఆఫర్‌కు ముందు ఇవీ ముఖ్యమే...

జాబ్‌కు ఎంపికయ్యారు. నిజంగా ఆనందించాల్సిన సందర్భమే. అయితే ఓకే చెప్పేముందు ఒకసారి ఆలోచించండి. ఆఫర్ చేసిన వేతనం సరిగానే ఉందా! వృత్తిపరంగా ఎదిగేందుకు ఆస్కారం ఉందా! బ్రేక్ తీసుకుని ఉన్నత విద్య కోసం వెళ్లవచ్చా! వంటి ప్రశ్నలు వేసుకోండి. ప్రశాంతంగా ఆలోచించిన తరవాతే జాబ్ ఆఫర్‌ను అంగీకరించాలి. దీనికి కొన్ని ప్రాతిపదికలు ఉన్నాయి. అవేంటో చూద్దాం.



- ❖ ఆయా వ్యక్తులు తమ ప్రాధాన్యాన్ని బట్టి ఉద్యోగాన్ని ఎంచుకుంటారు. పెద్ద పొజీషన్ కావాలా? చిన్న పొజీషన్ అయినా పర్వాలేదా అనేది ఎవరికి వారే తేల్చుకోవాలి. పొజీషన్ కావాలనుకునే వారు ముఖ్యంగా విజయాలు సాధించాలంటే ఉదయం తొమ్మిది నుంచి సాయంత్రం అయిదు గంటల వరకు పని కోరుకుంటే ఉపయోగం ఉండదు. ఒక్కోసారి బ్రేక్ తీసుకునే వీలు కూడా ఉండదు. ఇది సవాళ్ళతో కూడకున్న వ్యవహారం.
- ❖ లక్షల్లో వేతనం కాకున్నా సముచిత జీతం కోరుకోవడం సమంజసమే. అందుకే ఆరంభంలో ఇచ్చే వేతనం ఎంత అన్నది పరిశీలించుకోవాలి. 'పెయిడ్ ఇన్ పీనట్స్' అంటే ఆరంభ వేతనం మొదలుకొని ఏటా ఇచ్చే ఇంక్రిమెంట్ వరకు అంతా చిల్లర వ్యవహారంలా ఉండకూడదు. ప్రత్యేకించి కొన్ని పనులు నిర్వర్తించే విధంగా మనమంతా ఆరితేరి ఉంటాం. ఆయా కంపెనీల్లో చేర వచ్చా లేదా తేల్చుకునేందుకు ఆ సమీక్షలు ఒక మేర ఉపయోగపడతాయి.
- ❖ ప్రోగ్రెసివ్ లెర్నర్స్ మాత్రమే ముందు ముందు పురోగతి చెందుతారు. కొన్ని కంపెనీలు మాత్రమే తమ ఉద్యోగులు ఉన్నత విద్యాభ్యాసం లేదంటే శిక్షణకు అవకాశం కల్పిస్తాయి. స్పెషల్ ప్రోగ్రామ్స్, కోర్సులు నిర్వహిస్తూ ఉంటాయి. అలాగే ఉన్నత చదువుల్లో చేరే ఉద్యోగులకు కొన్ని కంపెనీలు స్కాలర్‌షిప్స్ ఇస్తుంటాయి.
- ❖ కంపెనీ ఎదుగుదల ఒక్కటే ప్రమాణం కాదు. మన పురోగతి కూడా అందులో భాగం కావాలి. ఈ విషయంలో స్పష్టత ఉండాలి. ఫలానా సమయానికి ఒక పొజీషన్‌కు చేరుకోవాలన్న కోరిక ఉండాలి. అందుకు అనుగుణంగా ఉద్యోగ ఎంపిక విషయంలో మన అడుగులు పడుతున్నాయా లేదా అన్న కోణంలోనూ సమీక్షించుకోవాలి. అక్కడ పని చేస్తున్నవారి ఎదుగుదల ఎలా ఉందో ఒకసారి సమీక్షించుకుంటే మంచిది. ఆరోగ్యం, పే బెనిఫిట్స్, ట్రావెల్, లివింగ్ కాస్ట్, వెహికిల్ తదితర మినహాయింపులూ ఒక సారి చూసుకోవాలి. ❄



హార్మోన్ల బ్యాలెన్స్ కోసం..

శరీరంలో జీవనక్రియలను నిర్వర్తించేందుకు వివిధ గ్రంధులు స్రవించే హార్మోన్లు ఉపయోగపడుతాయి. ఈ హార్మోన్లలో హెచ్చుతగ్గులు వచ్చినప్పుడు అనేక ఆరోగ్యసమస్యలు తలెత్తుతాయి. వీటిని నివారించాలంటే హార్మోన్లను బ్యాలెన్స్ చేయాలి. ఇందుకోసం ఉపయోగపడే ఆసనాల్లో మత్స్యాసనం ఒకటి. ఈ ఆసనం ద్వారా శరీరంలోని హార్మోన్లను స్రవించే గ్రంధులు ఉత్తేజితమవుతాయి.

మత్స్యాసనం

ముందుగా రెండు కాళ్ళు ముందుకు చాపి కుడికాలిని ఎడమ తొడ పైకి, ఎడమకాలిని కుడితొడ పైకి పెట్టి పద్మాసనంలో కూర్చోవాలి. ఇప్పుడు నెమ్మదిగా మోచేతులను చాలా జాగ్రత్తగా ఒకదాని తర్వాత ఒకటి భూమిపై ఆనిస్తూ నెమ్మదిగా పడుకోవాలి. ఇప్పుడు కుడిచేత్తో ఎడమకాలి బొటనవేలును, ఎడమచేత్తో కుడికాలి బొటనవేలును పట్టుకోవాలి. వీలైతే మీ తల పై భాగాన్ని భూమికి ఆనించి మీ చుబుకాన్ని వీపుని పైకి ఉంచాలి. ఈ ఆసనంలో అలాగే 30నుంచి అరవై సెకన్ల పాటు ఉండాలి. తర్వాత ముందుగా తలని, ఆ తర్వాత కాళ్ళని రిలాక్స్ చేసి శవాసనంలో కాసేపు ఉండాలి.



శ్రీచందన
డిజె ఫిట్‌నెస్ హబ్
9666665458

ఉపయోగాలు..

- ఊపిరితిత్తుల సమస్యలు తగ్గుతాయి.
- హార్మోన్ల హెచ్చుతగ్గుల సమస్య తీరుతుంది
- జీర్ణక్రియ మెరుగవుతుంది.
- గొంతు కండరాలు బాగా మసాజ్ అయి డబుల్ చిన్ సమస్య తగ్గుతుంది.

జాగ్రత్తలు..

బిపీ ఉన్నవారు చేయకూడదు.

నడుము శస్త్రచికిత్సలు అయిన వారు, మైగ్రేన్‌తో బాధపడుతున్నవారు డాక్టర్ సలహాతో, యోగానిపుణుని పర్యవేక్షణలో ఈ ఆసనం వేయాలి..





ఇట్లు చేద్దాం

కొద్దిగా బేకింగ్ సోడా తీసుకొని, క్లాత్ మీద లేదా స్పాంజ్ మీద చిలకరించి, టైల్స్ బాగా రుద్ది కడగాలి. మరకలు పడ్డ ప్రదేశాన్ని స్క్రబ్ చేసి నీటితో శుభ్రం చేయాలి. లేదా బేకింగ్ సోడా పేస్ట్‌ను ఉపయోగించి శుభ్రం చేసుకోవచ్చు.





కారణాలెన్నో...

వైరల్, బాక్టీరియల్, ఫంగల్ ఇన్ఫెక్షన్లలో జుట్టు విపరీతంగా ఊడుతుంది. క్యాన్సర్లలోనూ, క్యాన్సర్ చికిత్సలో వాడే మందులకు, రేడియేషన్‌కు జుట్టు మొత్తం ఊడి పోయినా, వయసులో ఉన్న వారికి ఆ చికిత్స పూర్తి కాగానే మళ్లీ జుట్టు పెరగవచ్చు, తిరిగి రాకపోవచ్చు. ఇటువంటి సందర్భాలలో కొందరు తమ జుట్టుని క్యాన్సర్ బాధితుల కోసం డొనేట్ చేస్తుండటం మంచి పరిణామం. కొన్ని వాతా వరణ పరిస్థితులు అంటే వేడి, చల్లదనం జుట్టుకు పనికి రావు. జుట్టుని మాటి మాటికీ బ్లో డ్రయింగ్ చేయించడం కూడా జుట్టు కోల్పోడానికి కారణమవు తుంది.జుట్టుకు వేసే వివిధ రకాల రంగులకు చెందిన రసాయనాలు, షాంపూలూ, తల మీద వుండే చర్మాన్ని నాశనం చేయడంతో పాటు, జుట్టు రాలిపోవడానికి కారణ మవుతాయి. అందుకే డాక్టర్ సలహాతో మాత్రమే చుండ్రు, ఫంగల్ లేదా బాక్టీరియల్ ఇన్ఫెక్షన్లకు సంబంధించిన షాంపూలూ, లోషన్లూ వాడాలి.

అందమైన కురుల వల్ల సౌందర్యం మరింత ఇనుమడిస్తుంది. బ్యూటీ క్లినిక్‌లలోనూ,హెయిర్ సెలూన్ల లోనూ బోలెడంత డబ్బూ, సమయం వెచ్చించే వారు తెలుసుకోవలసిందేంటంటే పైపైన రాసే నూనెల వల్ల, షాంపూల వల్ల పొందే ప్రయోజనం చాలా తక్కువ. మంచి ఆహారం అంటే ఆకు కూరలు, పప్పులు, గుడ్లు, ఇతర ఖనిజాలు కలిగిన సమతులాహారం తప్పని సరిగా తీసుకోవాలి. దాంతో పాటు చక్కని నిద్రా, జుట్టు రాలిపోడానికి దారితీసే అనారోగ్యాలు దరిచేరకుండా చూసుకో వడం. కాలుష్యం లేని వాతావరణంలో ఉండటం. అనవసరమైన కెమికల్స్, రంగులు జుట్టుకు హాని చేస్తాయని గ్రహించి వాటికి దూరంగా ఉండటం ఉత్తమం. ❄

సవాలుగా పెండింగ్ కేసులు

సత్వర పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలి :సీజేఐ



అమరావతి : న్యాయవ్యవస్థ అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని, వాటిలో పెండింగ్ కేసులూ కూడా ఒకటని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి రంజన్ గొగోయ్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తాత్కాలిక భవన ప్రారంభం, శాశ్వత భవన భూమిపూజ, శిలాఫలక ఆవిష్కరణ కార్యక్రమాల్లో ఆదివారం ఆయన పాల్గొన్నారు. అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ పెండింగ్ కేసుల పరిష్కారానికి తక్షణ ప్రాధాన్యత ఇవ్వాల్సిఉందని న్యాయమూర్తులకు సూచించారు. దేశ వ్యాప్తంగా 3 కోట్ల కేసులు అపరిష్కృతంగా ఉన్నాయని, వీటిలో పదేళ్లకు పైగా 25 లక్షల కేసులు పెండింగ్‌లో ఉండటం ఆందోళన కలిగిస్తోందని చెప్పారు. శాశ్వత హైకోర్టు నిర్మాణానికి సంబంధించిన భూమి పూజ కార్యక్రమంలో పాల్గొని, శిలా ఫలాకాన్ని ఆవిష్కరించారు. దేశ వ్యాప్తంగా హైకోర్టు జడ్జి పోస్టులు 392 ఖాళీగా ఉన్నాయని, ఇందులో 270 పోస్టులకు అభ్యర్థులకు సంబంధించిన ప్రతిపాదనలు హైకోర్టుల నుంచి పంపాలని ఆయన కోరారు. మరో 130 పోస్టులు సుప్రీంకోర్టు పరిధిలో ఉన్నాయని,భర్తీకి సంబంధించిన ప్రకియ జరుగుతోందన్నారు. త్వరలో 75 శాతం ఖాళీలను భర్తీ చేస్తామన్నారు. రాజ్యాంగ బద్ధమైన విధులు సక్రమంగా నిర్వర్తించడమేతప్ప న్యాయవ్యవస్థలో వ్యక్తిగత అభిప్రాయాలు ఉండకూడదని అన్నారు. ఎనిమిది నెలల్లో హైకోర్టు తాత్కాలిక భవనాన్ని నిర్మించి రాజ్యాంగ బద్ధమైన విధిని ముఖ్యమంత్రి నిర్వర్తించారన్నారు. ఏపీలో హైకోర్టుభవనం ఏపీ ప్రజల సంస్కృతి, ఆనందానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మాట్లాడుతూ అమరావతిలో నల్సార్ యూనివర్సిటీ ఏర్పాటుకు సహకరించాలని చీఫ్ జస్టిస్‌కు అమరావతి నిర్మాణంలో హైకోర్టు భవనం ఓ ప్రధాన ఘట్టమన్నారు. సుప్రీంకోర్టున్యాయమూర్తులు ఎన్‌వి రమణ, ఎల్ నాగేశ్వరరావు మాట్లాడుతూ ఏపీ హైకోర్టు నిర్మాణం చారిత్రాత్మకమన్నారు. భూములిచ్చిన రైతులను తరతరాలు గుర్తుంచుకుంటాయన్నారు. జస్టిస్ ఆర్ సుభాష్‌రెడ్డి మాట్లాడుతూ అమరావతికి హైకోర్టు రావడంతో ఏపీ ప్రజలకు మరింత చేరువలో న్యాయం ఉంటుందన్నారు. హైకోర్టు చీఫ్ జస్టిస్ సి. ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో హైకోర్టు ఉండాలనే ప్రజల కోరిక నెరవేరిందన్నారు. తెలంగాణ హైకోర్టు చీఫ్ జస్టిస్ రాధాకృష్ణన్ మాట్లాడుతూ ప్రజలకు హైకోర్టు అందుబాటులోకి రావడం మంచి పరిణామమన్నారు.

ఉపాధ్యాయులపై నిర్బంధం



గుంటూరు/ఏలూరు :ఉద్యోగుల రిటైర్మెంట్ జీవితానికి భరోసా లేని నూతన పెన్షన్ విధానం రద్దు కోరుతూ ఉపాధ్యాయులు కదం తొక్కారు. యూటీఎఫ్ పిలుపు మేరకు 7న అసెంబ్లీ ముట్టడించడానికి ఆదివారంనాడు గుంటూరు నుంచి ఒకటి, ఏలూరు నుంచి మరోటి రెండు పాదయాత్రలు ప్రారంభ మయ్యాయి. అయితే, గుంటూరులో శాంతియుతంగా సాగుతున్న పాదయాత్రను పోలీసులు అడ్డగించి, ఉపాధ్యాయులను నిర్బంధించారు.

అనంతపురం, చిత్తూరు, కడప, కర్నూలు, ప్రకాశం, నెల్లూరు, గుంటూరు జిల్లాల నుంచి ఆదివారం వేకువజామునే వేలాది మంది ఉపాధ్యాయులు గుంటూరు చేరుకున్నారు. గుంటూరు మార్కెట్ సెంటర్ నుంచి ప్రారంభమైన పాదయాత్ర చందనా బ్రదర్స్ వద్దకు రాగానే పోలీసులు బారికేడ్లు పెట్టి ఆపేశారు. యూటీఎఫ్ నాయకులను, ఉపాధ్యాయుల్ని అరెస్ట్ చేసి నగరంలోని వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పి.బాబురెడ్డి, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ వై.శ్రీనివాసరెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు సహా సుమారు వెయ్యి మందిని అరెస్ట్ చేశారు. తొలుత చుట్టుగుంట నుంచి పాదయాత్ర ప్రారంభమవుతుందని నాయకులు ప్రకటించటంతో పోలీసులు ఆ ప్రాంతంలో భారీగా మోహరించి, అక్కడకు వచ్చిన కొద్ది మంది ఉపాధ్యాయుల్ని అరెస్ట్ చేశారు. అయితే అనూహ్యంగా ఉపాధ్యాయులు స్థానిక మార్కెట్ సెంటర్ నుంచి పాదయాత్ర ప్రారంభించారు. అప్పటికే అర కిలోమీటరు వరకూ ముందుకు సాగిన పాదయాత్రను పోలీసులు మార్గం మధ్యలో అడ్డుకున్నారు. ఈ సందర్భంగా నాయకులు, పోలీసుల మధ్య తీవ్ర వాగ్వాదం జరిగి, ఉపాధ్యాయులు రోడ్డుపైనే బైఠాయించారు. వారిని బలవంతంగా వాహనాల్లోకి ఎక్కించి అరెస్ట్ చేశారు.

సీపీఎస్ రద్దు కోరుతూ పాదయాత్రలు

- గుంటూరులో అక్రమ అరెస్టు
- ఏలూరులో మరో యాత్ర ప్రారంభం
- 7న అసెంబ్లీ ముట్టడి

పోలీసు కళ్యాణ మండపంలో నిర్బంధంలో వున్న ఉపాధ్యాయులతో సభ నిర్వహించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి పి.బాబురెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అత్యంత దుర్మార్గంగా నిరసనలను అణచివేస్తుందన్నారు. సీపీఎస్ రద్దుకు ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనే తీర్మానం చేయాలని, దానికి సంబంధించిన జీవోలనూ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నెల 7న అసెంబ్లీ ముట్టడి నిర్వహిస్తున్నామని, అప్పటికీ స్పందించకపోతే అన్ని సంఘాలనూ కలుపుకొని సమ్మెకు వెళ్లేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. మండలిలో పీడీఎఫ్ ఎమ్మెల్సీల బృందం ఈ విషయంపై నిలదీస్తామని ఎమ్మెల్సీ శ్రీనివాసరెడ్డి చెప్పారు. మాజీ ఎంఎల్‌సీ కెఎస్.లక్ష్మణ రావు మాట్లాడుతూ సీపీఎస్ రద్దు చేయని పక్షంలో ఉపాధ్యాయులు, ఉద్యోగుల కుటుంబాలు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగిన గుణపాఠం చెబుతాయని తెలిపారు. యూటీఎఫ్ రాష్ట్ర కోశాధికారి కె.శ్రీనివాసరావు, రాష్ట్ర సహాధ్యక్షులు శ్రీదేవి, ఎన్.వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ పద్మావతి తదితరులను అరెస్టు చేశారు. నిర్బంధించిన ఉపాధ్యాయుల్ని సాయంత్రానికి విడుదల చేశారు.

ఏలూరు నుంచి పాదయాత్ర...

పశ్చిమగోదావరి జిల్లా ఏలూరు నగర పాలక సంస్థ కార్యాలయం నుంచి యూటీఎఫ్ ఆధ్వర్యంలో మహాపాద యాత్ర ప్రారంభమైంది. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి జిల్లాలో వేలాది మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ప్రారంభ సభకు యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు షేక్‌సాబ్జీ అధ్యక్షత వహించారు. ఈ అసెంబ్లీ సమావేశాల్లోనే సీపీఎస్ రద్దుకు తీర్మానం చేయాలని, ప్రభుత్వ ఉత్తర్వులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

నిర్వాసితులకు న్యాయమైన పరిహారం ఇవ్వాలి : రైతు సంఘం

నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

మల్లన్నసాగర్, గౌరవెల్లి రిజర్వాయర్ల కోసం సేకరిస్తున్న భూములకు న్యాయమైన నష్టపరిహారం ఇవ్వాలనీ, గౌరవెల్లి రిజర్వాయర్ కింద తన భూమి ముంపునకు గురైందన్న ఆవేదనతో రైతు మల్లారెడ్డి మృతి చెందారని, ఆయన కుటుంబానికి రూ 10 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించాలని తెలంగాణ రైతు సంఘం డిమాండ్ చేసింది. ఆదివారం ఈమేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. మల్లన్నసాగర్, గౌరవెల్లి రిజర్వాయర్ల నిర్వాసిత రైతులకు వేములఘాట్ తరహాలో ఎకరానికి రూ 16లక్షల పరిహారం ఇవ్వాలని సంఘం రాష్ట్ర కార్యదర్శి టి సాగర్ డిమాండ్ చేశారు.

పసుపునకు మద్దతు ధర చెల్లించాలి

జనవరి నుంచి పసుపు పంట మార్కెట్లకు వస్తున్నదని ఆరైతులు పెట్టిన పెట్టుబడి కూడా రాని పరిస్థితి నెలకొందని సాగర్ తెలిపారు. క్వింటా పసుపునకు రూ 10వేలు మద్దతు ధర అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిజామాబాద్, జగిత్యాల, సంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో పసుపు సాగు అవుతుందని సాగుతుందని పేర్కొన్నారు. ఈ క్రమంలో పసుపునకు మద్దతు ధర కల్పించి, రైతులను ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

ప్రజల కోసం పని చేయడం ఉన్నతం

అల్లం నారాయణ



నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

ప్రజల కోసం పని చేయడాని కంటే మించిన పని మరొకటి లేదని ప్రెస్ అకాడమి చైర్మెన్ అల్లం నారాయణ అన్నారు. ఆదివారం మాసబ్ ట్యాంక్‌లోని మీడియా అకాడమీ కార్యాలయంలో బీసీ కమిషన్ సభ్యులు జూలూరి గౌరీ శంకర్ సంపాదకత్వంలో ప్రముఖ విద్యావేత్త వైవిరెడ్డిపై వెలువరించిన "నిలువెత్తు పాఠం" అనే పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అల్లం నారాయణ మాట్లాడుతూ వైవీరెడ్డి ప్రిన్సిపాల్‌గా పని చేసి అనేక మంది విద్యార్థులను ఉన్నత శిఖరాలకు తీసుకువెళ్లారని చెప్పారు. తెలంగాణ నేలలో కళాశాలలను తీర్చిదిద్దే కర్తవ్యంలో వైవీరెడ్డి తనవంతు కర్తవ్యాన్ని నిర్వర్తించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ ఆంజనేయులు గౌడ్, లక్ష్మణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

35 మందితో ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కమిటీ

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

భారత మార్క్సిస్టు కమ్యూనిస్టు పార్టీ ఐక్య (ఎంసీపీఐయూ) రాష్ట్ర ద్వితీయ మహాసభలు గతనెల 31, ఈనెల 1,2 తేదీల్లో మూడు రోజులపాటు కామారెడ్డిలో జరిగాయి. 35 మందితో ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శిగా తాండ్ర కుమార్ తిరిగి ఎన్నికయ్యారు. వర్కింగ్ కార్యదర్శిగా ఎస్ సాంబయ్య, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులుగా ఉపేందర్‌రెడ్డి, మద్దికాయల అశోక్, గాధ గోని రవి, వనం సుధాకర్, కుంభం సుకన్య, వరికుప్పల వెంకన్న, సబ్బని కృష్ణ ఎన్నికయ్యారు. ఈ మహాసభల్లో 16 రాజకీయ తీర్మానాలను ఆమోదించామని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వనం సుధాకర్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు.

200 కిలోల గంజాయి పట్టివేత

- నలుగురు నిందితుల అరెస్టు

నవతెలంగాణ–పటాన్‌చెరు

విశాఖ జిల్లా ఏజెన్సీ ప్రాంతం నుంచి ముంబైకి తరలిస్తున్న 200 కిలోల ఎండు గంజాయిని ముత్తంగి ఔటర్ రింగ్ రోడ్డు టోల్ ప్లాజా వద్ద ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు ఎక్సైజ్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మెదక్ ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కేఏబీ.శాస్త్రి, ఎక్సైజ్ జిల్లా సూపరింటెండెంట్ చంద్రయ్యగౌడ్‌తో కలిసి ఆదివారం ఈ వివరాలు వెల్లడించారు.

ఒడిస్సా రాష్ట్రంలోని మల్కాన్‌గిరికి చెందిన దేవేందర్ అనుపాల్, నాగల్‌గిద్ద మండలం ఎక్కడపల్లి గ్రామానికి చెందిన సంజీవ్, రామచంద్రాపురం వడ్డెర కాలనీకి చెందిన మణికంఠ, బండ్లగూడకు చెందిన జైసింగ్ రాథోడ్‌లు విశాఖ నుంచి ముంబైకి రూ. 20 లక్షలు విలువ చేసే 200 కిలోల ఎండు గంజాయిని రెండు కార్లతో తరలిస్తున్నారు. సమాచారం అందుకున్న ఎక్సైజ్, ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ముత్తంగి ఔటర్ రింగ్ రోడ్డు టోల్ ప్లాజా వద్ద శనివారం రాత్రి తనిఖీలు నిర్వహించారు. గంజాయినీ, కారును స్వాధీనం చేసుకుని నిందితులను అదుపులోకి తీసుకున్నారు. జిల్లాలోని నారాయణఖేడ్ ప్రాంతంలో గంజాయిని పూర్తిస్థాయిలో అరికట్టామని తెలిపారు. విశాఖ ఏజెన్సీ ప్రాంతాల నుంచి కొందరు గంజాయిని తీసుకొచ్చి పటాన్‌చెరు పారిశ్రామిక వాడలోని కార్మికులు, విద్యార్థులను టార్గెట్ చేసుకొని విక్రయిస్తున్నారని తెలిపారు.

'కిరీటాలు' మాయంపై విచారణ

- అర్చకులు, సిబ్బందిని ప్రశ్నించిన అధికారులు
- రెండు రోజుల్లో నిందితులను పట్టుకుంటాం : ఈవో

తిరుపతి :తిరుపతి శ్రీగోవిందరాజుస్వామి ఆలయం తిరుమల శ్రీవారి ఆలయం తర్వాత ప్రసిద్ధిగాంచినది. ఆలయంలో గర్భాలయానికి పక్కనే లక్ష్మీ, వెంకటాచలం, పద్మావతి దేవిలతో కూడిన ఉప ఆలయం ఉంది. ఆ ఆలయంలోని దేవతా మూర్తుల మూడు కిరీటాలు శనివారం మధ్యాహ్నం నుంచి కనిపించకుండా పోయాయి. ఈ విషయాన్ని సాయంత్రం గుర్తించిన సంబంధిత ఆలయ సూపరింటెండెంట్, డిప్యూటీ ఈవో వరలక్ష్మీ దృష్టికి తీసుకెళ్లారు. స్థానికంగా అర్చకులను విచారించిన అనంతరం 1300 గ్రాముల బరువుగల (మూడు కిరీటాలు) నగలు మాయమైనట్టు నిర్ధారించుకుని ఈస్టు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు అర్బన్ ఎపీ అన్బురాజన్ ఆధ్వర్యంలో ఫింగర్‌ప్రింట్స్ నిపుణులు ఆలయానికి చేరుకుని ఆలయంలో వెలుపల, లోపల క్షుణంగా పరిశీలించారు. ముందుగా ఆలయంలోని 12 సిసి కెమెరాల పుటేజీలను స్వాధీనం చేసుకున్నారు. టీటీడీ విజిలెన్స్ సీవీ అండ్ ఎస్వో గోపీనాథ్‌జెట్టి, వారి సిబ్బందితో కలిసి జెఈవో పోలా భాస్కర్ రాత్రి 9 గంటల నుంచి ఆలయం తలుపులు మూసివేసి విచారణ చేపట్టారు. ఆలయంలో పని చేస్తున్న అర్చకులను, సిబ్బందిని, ముగ్గురు



మహిళా స్వీపర్లను విచారించారు. అర్థరాత్రి 2 గంటల ప్రాంతంలో అర్చకులను విచారించిన అర్బన్ ఎస్‌పీ మీడియాతో మాట్లాడుతూ 1300 గ్రాముల బరువున్న మూడు బంగారు కిరీటాలు చోరీకి గురైనట్లు నిర్ధారణ అయిందని, అందుకు సంబంధించి విచారణను వేగవంతం చేస్తున్నామన్నారు. టీటీడీ సీవీఎస్‌వో గోపినాథ్‌జెట్టి మీడియాతో మాట్లాడుతూ ఇప్పటి వరకు 12 సిసి కెమెరాల్లో శనివారం సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు ఉన్న పుటేజీలను పరిశీలించామని, అందులో అనుమానీతులను పిలిపించి విచారించామన్నారు. సాయంత్రం టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ ఆలయాన్ని సందర్శించి, విచారణ గురించి అడిగి తెలుసుకున్నారు. రెండురోజుల్లో నిందితులను పట్టుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో టీటీడీ అదనపు సీవీఎస్‌వో శివకుమార్ రెడ్డి, సీఈ చంద్రశేఖర్‌రెడ్డి, ఏప్ ఏసీఏవో బాలాజీ, స్పెషల్‌గ్రేడ్ డిప్యూటీ ఈవో వర లక్ష్మీ, టీటీడీ అధికారులు, తిరుపతి పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో నలుగురు మృతి

- పెళ్లింట విషాదం

లావేరు (శ్రీకాకుళం జిల్లా): విద్యుత్ శాఖాధికారుల నిర్లక్ష్యం కారణం గా పెళ్లింట విషాదం చోటు చేసుకుంది. పెళ్లి పనుల్లో బిజీగా ఉన్న ఆ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. బుధవారం జరగాల్సిన నిశ్చితార్థానికి అంతా సిద్ధం చేస్తున్న సమయంలో జరిగిన ఈ ప్రమాదంలో నలుగురు మృతిచెందారు. వీరిలో భార్యాభర్తలు ఉన్నారు. వీరి కుమారుడు, కాబోయే పెళ్లికొడుకు ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. మృతుల కుటుంబసభ్యుల కథనం మేరకు.. శ్రీకాకుళం జిల్లా లావేరు మండలం పాతరౌతుపేటకు చెందిన కొమ్ము వెంకన్న(48) కుమారుడు శ్రీనివాసరావు వివాహం మార్చి 13న జరపాలని నిశ్చయించారు. ఈ నేపథ్యంలో కొత్త రౌతుపేటకు చెందిన తన బావ ఆబోతుల రాములు (54)తో కలిసి అరటి గెలలను తెచ్చేందుకు వెంకన్న తన పొలానికి వెళ్లారు. అరటి గెలలను కోస్తుండగా కొమ్మలు వారికి విద్యుత్తు వైర్లకు తగిలాయి. దీంతో, విద్యుదాఘాతానికి గురై వారిద్దరూ అక్కడికక్కడే మృతి చెందారు. వీరు ఎంతకీ రాకపోవడంతో రాములు భార్య పుణ్యవతి (45), అదే గ్రామానికి చెందిన బంగారమ్మ (46)తో కలిసి పొలానికి వెళ్లింది. నేలపై పడి ఉన్న వీరిద్దరినీ చూసి వారిని పట్టుకోవడంతో వారు కూడా విద్యుదాఘాతానికి గురై అక్కడికక్కడే చనిపోయారు. వీరిని వెతుకుతూ పొలానికి వెళ్లిన శ్రీనివాసరావు కూడా విద్యాదాఘాతానికి గురయ్యాడు. దీన్ని గమనించిన సమీపంలోని కోళ్లఫారం యజమాని చిరంజీవి వెంటనే విద్యుత్తు నిలుపుదల చేయడంతో శ్రీనివాసరావు ప్రాణాపాయస్థితి నుంచి బయటపడ్డాడు. ఇక్కడి నుంచి ఈ వైర్లను తొలగించాలని విద్యుత్తు శాఖాధికారులను పలుమార్లు కోరినా పట్టించుకోలేదని మృతుల కుటుంబసభ్యులు వాపోయారు.

మత ఘర్షణలతో రాజకీయ లబ్ది


నవతెలంగాణ – న్యూఢిల్లీ బ్యూరో:

మత ఘర్షణలతో రాజకీయ లబ్ది పొందడం హేయమైన చర్య అని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యురాలు సుభాషిణీ అలీ అన్నారు. కుల, మత కొట్లాటలను ఏ నాగరిక సమాజమూ స్వాగతించదని... అయితే ప్రస్తుతం అధికారంలో ఉన్నటువంటి పాలకులు మాత్రం మత ఘర్షణలకు పాల్పడటాన్ని ఫ్యాషన్‌గా భావిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. బీజేపీ హయాంలో పౌర హక్కుల సంఘాలపై దాడులు విపరీతంగా పెరిగాయని వివరించారు. దళిత, గిరిజన, అణగారినవర్గాల కోసం అన్ని సంఘాలు సంఘటితంగా పోరాడాలని అన్నారు. పెట్టుబడిదారీవర్గాల కోసం పని చేస్తున్న పాలకపక్షాలు పౌర సంఘాలపై దేశ విద్రోహం పేరుతో భౌతిక, న్యాయపరంగా దాడులు చేస్తున్నాయని వివరించారు. కేంద్రంలో అధికారం వెలగబెడుతున్న మోడీ సర్కారు పెట్టుబడిదారీవర్గాల కోసం నిరంతరం పని చేస్తూ అణగారినవర్గాల సమస్యలను విస్మరిస్తున్నదని వివరించారు.

'రెరా'కు రండి

రాష్ట్రంలో 3 వేల రియల్ ఎస్టేట్ కంపెనీలు

- రిజిస్ట్రేషన్ చేసినవి కేవలం 1900లే...
- షోకాజు నోటీసులిచ్చినా పట్టించుకోని వైనం
- అవగాహన కల్పిస్తున్న 'రెరా' అధికారులు
- భూ వివాదాల పరిష్కారానికి ఫాస్ట్‌ట్రాక్ కోర్టు



గుడిగ రఘు

రాష్ట్రంలో భూక్రయవిక్రయాలను క్రమబద్ధికరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ(రెరా) చట్టాన్ని తెచ్చింది. ఎక్కడ భూ అమ్మకాలు, కొనుగోళ్లు జరిపే కంపెనీలు రెరాలో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని ప్రభుత్వం చేసిన సూచనను రియల్టర్లు పెద్దగా పట్టించుకోవడం లేదు. ఈ చట్టంతోపాటు రాష్ట్రానికి కొంత ఆదాయం రావడంతోపాటు వినియోగదారులకు పూర్తి భరోసా ఉంటుందని రెరా అధికారులు చెబుతుంటే, రియల్టర్లు మాత్రం అచితూచి వ్యవహరిస్తున్నారు. ముఖ్యంగా ఎజెంటు సైతం తమకేమీ సంబంధం లేన్నట్టు వ్యవహరిస్తున్నారు. రియల్టర్లు, ఎజెంట్లకు అవగాహన కల్పించేందుకు రెరా అధికార యంత్రాంగం చర్యలు తీసుకుంటున్నది. ఇప్పటికే మూడు దఫాలుగా రియల్టర్లు, ఎజెంట్లకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించింది. రెరాలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని అధికారులు పదే పదే కోరుతున్నారు. రాష్ట్రంలో 3452 రియల్ ఎస్టేట్ కంపెనీలు ఉండగా, ఎజెంట్లు సుమారు 5వేల మంది వరకు ఉంటారని రెరా అంచనా వేసింది. అందులో 1918 కంపెనీలు, 1534 మంది ఎజెంట్లు మాత్రమే ఇప్పటివరకు నమోదు చేసుకున్నట్టు అధికారులు చెబుతున్నారు. మిగతా కంపెనీలను కూడా రెరాలో రిజిస్ట్రేషన్ చేసుకునేలా ప్రయత్నం చేస్తున్నది. అందులో 2017లో ఏర్పడిన ప్రతి కంపెనీ విధిగా రెరా పరిధిలోకి రావాలనే నిబంధన పెట్టింది. కొత్త వెంచర్లు, ప్లాట్ల అమ్మకం, కొనుగోళ్ల ప్రతి అంశం రెరా కన్నుసన్నల్లోనే జరగాలని ప్రభుత్వం భావిస్తున్నది. గతంలో డీటీసీపీ, మున్సిపాల్టీలు, కార్పొరేషన్లు, టీఎస్ఐఐసీలు అనుమతి ఇచ్చినప్పటికీ రెరాలో తప్పనిసరిగా రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలనే మార్గదర్శకాలు రెరాలో ఉన్నాయి. ఆమేరకు హైదరాబాద్‌లో ప్రత్యేకంగా కార్యాలయాన్ని ఏర్పాటు చేసింది.

భూ వివాదాలకు రెరా చెక్

పాట్ల అమ్మకాలు, కొనుగోళ్లలో ఏర్పడిన వివాదాలు, అగ్రిమెంట్ ప్రకారం నిర్మాణాలు జరపకపోవడం, భవనాలు నాసిరకంగా నిర్మించడం, తప్పుడు ధృవీకరణ పత్రాలు సృష్టించి అమ్మడం తదితర భూవివాదాలకు రెరా చెక్ పెట్టనుంది. దీని కోసం



ప్రత్యేక న్యాయ విభాగాన్ని సైతం ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు ప్రారంభించింది. ఇప్పటికే ఆ విభాగ పర్యవేక్షణకు రిటైర్డ్ జడ్జిని నియమించింది. ఎవరైనా రెరాకు ఆన్‌లైన్లో ఫిర్యాదు చేస్తే వెంటనే వారికి షోకాజ్ నోటీసులు జారీ చేయనుంది. భూవివాదాల పరిష్కారానికి రెరా మధ్యవర్తిత్వం వహించనుంది. అప్పటికీ సమస్య పరిష్కారం కాకపోతే రెరా కోర్టులో న్యాయ విచారణ ఎదుర్కొవాల్సి వస్తుంది.

మహారాష్ట్ర రెరా కంటే ఇక్కడ ఫీజు తక్కువే...

దేశంలోనే మహారాష్ట్రలో రెరాకు బాగా అదరణ ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు. ఆ రాష్ట్రంలో కంపెనీని రిజిస్ట్రేషన్ చేయించుకోవడానికి రూ 50 వేల ఫీజు చెల్లిస్తున్నారు. అయినా అక్కడ ఆయా కంపెనీలు,రియల్టర్లు ఉత్సహం చూపిస్తున్నారు. అక్కడ రోజుకు సుమారు 200 మంది బాధితులు న్యాయం కోసం వస్తున్నారని రెరా ఉన్నతాధికారి తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ ఫీజు కేవలం రూ 5 వేలుగా సర్కారు నిర్ణయించింది. వ్యాపారపరంగానే కాకుండా ప్రభుత్వ ఖజానాకు ప్రయోజనకారిగా రియల్ఎస్టేట్ కేరాఫ్ అడ్రస్‌గా ఉన్నది. అత్యంత వేగంగా విస్తరిస్తున్న నగరాల్లో హైదరాబాద్, వరంగల్, కరీంనగర్ నగరాలు ఉన్నాయి. మహారాష్ట్రలో రెరాలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలంటే 37 ధృవీకరణ పత్రాలు సమర్పించాల్సి ఉన్నది. తెలంగాణ రెరాలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలంటే కేవలం 17 ధృవీకరణ పత్రాలు సమర్పిస్తే సరిపోతుంది. అందులో 10 ధృవీకరణ పత్రాలు



మాత్రం కచ్చితంగా ఆన్‌లైన్‌లోనే సమర్పించాల్సి ఉంటుంది. రెరాలో రిజిస్ట్రేషన్ కోసం పలుదఫాలుగా అవకాశం ఇచ్చినా తాజా ఈ నెల 15 వరకు గడువును మరోసారి పొడిగింది. ఆ లోపు రిజిస్ట్రేషన్ చేయించుకోని ప్రమోటర్లకు రూ 2 లక్షల పెనాల్టీ వేస్తామని రాష్ట్ర ప్రభుత్వం హెచ్చరించింది.

అమరుల త్యాగాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

- ప్రభుత్వ హామీల భ్రమల నుంచి బయటపడాలి: రంగాపూర్ విజయోత్సవ సభలో తమ్మినేని

నవతెలంగాణ–మంచాల

అమరుల త్యాగాలను ప్రజల్లోకి తీసుకెళ్లి వారిలో స్ఫూర్తిని నింపాలని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లా మండల పరిధిలోని రంగపూర్ గ్రామ సర్పంచ్ స్థానాన్ని సీపీఐ(ఎం) గెలుపొందిన సందర్భంగా ఆదివారం వియోత్సవ సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. రంగారెడ్డి జిల్లాలో మంచాల మండలం పోరాటాల గడ్డకు పుట్టినిల్లని తెలిపారు. కామ్రేడ్ కృష్ణమూర్తి, పోచమోని జంగయ్య, తోడే అడవయ్య, కర్రె కోటప్ప, కుకూడాల జంగారెడ్డి, శ్రీరామ్, వెంకటయ్య, దానయ్య, పోచయ్య, మహబూబ్ పాషా, నరహరి లాంటి ఎర్ర సూరీలను కన్న నేల అని కొనియాడారు.

తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో దున్నే వాడికి భూమి కావాలని భూమి కోసం, భుక్తి కోసం, వెట్టి చాకిరి విముక్తి కోసం రక్తం చిందించిన వారి త్యాగాలను గుర్తు చేశారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా, ఈ ఉద్యమాన్ని ఆపడం ఎవరి తరమూ కాదన్నారు. మండలంలో నలుగురు సర్పంచులు, 6 గురు ఉపసర్పంచ్లు, 53 మంది వార్డు సభ్యులు గెలవడం మంచి పరిణామమన్నారు. అధికార పార్టీ ఇచ్చిన హామీల భ్రమల్లో కొట్టుకుపోకుండా, ప్రభుత్వం చేపడుతున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేయాలని సూచించారు. ఈ సభలో జిల్లా కార్యదర్శి భూపాల్, కార్యదర్శివర్గ సభ్యులు పగడాల యాదయ్య, మండల కార్యదర్శి కర్నాటి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ కర్నాటి కవిత, సర్పంచ్ డబ్బికార్ మమత, ఉపసర్పంచ్ కుకూడాల జంగారెడ్డి పాల్గొన్నారు.



విజయోత్సవ సభలో మాట్లాడుతున్న తమ్మినేని

ప్రత్యేకంగా ఆటో రిజిస్ట్రేషన్లు అన్యాయం

- 5న ఇందిరాపార్కు వద్ద మహాధర్నా
- ఊబర్, ఓలాలపై పోలీసులు చర్యలెందుకు తీసుకోరు?: ఆటో డ్రైవర్స్ యూనియన్ల జేఏసీ

నవతెలంగాణ బ్యూరో–హైదరాబాద్

ప్రత్యేకంగా ఆటో రిజిస్ట్రేషన్ల పేరిట పోలీసులు ఆటోవాలాలను వేధించడం అన్యాయమని ఆటో డ్రైవర్స్ యూనియన్ల జేఏసీ పేర్కొన్నది. కనీసం ఆటో యూనియన్లతో కూడా చర్చించకుండా రిజిస్ట్రేషన్ల పేరిట ఆటోకు రూ.220 వసూలు చేయడాన్ని నిరసిస్తూ ఈ నెల ఐదో తేదీన ఇందిరాపార్కు వద్ద మహాధర్నా నిర్వహించనున్నట్టు ప్రకటించింది. హైదరాబాద్‌లోని హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జేఏసీ నేతలు మాట్లాడారు. మై ఆటో ఈజ్ సేఫ్ పేరిట సపరేటు ఆటో రిజిస్ట్రేషన్ కార్యక్రమాన్ని వెంటనే రద్దు చేయాలని పోలీసు కమిషనర్‌ను డిమాండ్ చేశారు. సర్జ్ ప్రైసింగ్‌ప పేరుతో ప్రయాణికులను రాత్రింబవళ్లు లూటీ చేస్తుంటే ఆ సంస్థల యాజమాన్యాలపై కమిషనర్ ఎందుకు చర్యలు తీసుకోవట్లేదని ప్రశ్నించారు. ఆర్సీ పర్మిట్లను పెట్టుకుని ఆటోవాలాలను ఇష్టమొచ్చినట్టు బెదిరిస్తున్న ఫైనాన్షియర్లపై పీడీ యాక్టు ప్రయోగించాలని ప్రభుత్వాన్ని కోరారు. నగరంలో సరిపడా ఆటోస్టాండ్లను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. నాలుగున్నరేండ్ల కింద రూ.2900 ఉన్న థర్డ్ పార్టీ ఇన్సూరెన్స్ నేడు రూ.8 వేలు దాటిందని, ఆ ఇన్సూరెన్స్‌లో ప్రభుత్వమే 50 శాతం భరించాలని విన్నవించారు. జీహెచ్ఎంసీ పరిధిలోని ఆర్టీఏ కార్యాలయాల్లో కూడా ఆటోలు స్క్రాప్‌చేసి వాటి స్థానంలో కొత్త ఆటోల రిజిస్ట్రేషన్‌కు అనుమతించాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లకు డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు, ఈఎస్ఐ సౌకర్యాలను కల్పించాలని, ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆటో డ్రైవర్లపై ఆర్టీఏ, పోలీసుల వేధింపుల నుంచి కాపాడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్స్ యూనియన్ల జేఏసీ నాయకులు మహ్మద్ అమానుల్లా ఖాన్, బి.వెంకటేష్, లక్ష్మణ్, వి.కిరణ్, శ్రీనివాస్, ఎ.సత్తిరెడ్డి, చంద్రశేఖర్, మహ్మద్ ఇబ్రహీం అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

సమాజానికి వైద్యుడు- పోరాటాలకు యోధుడు



భూపతి వెంకటేశ్వర్లు

వీర తెలంగాణా కష్టజీవుల కార్ఖానా
గాయాల్ని కర్తవ్యం చేసే గతి తార్కికం
ఫ్యూడల్ కోటను బద్దలు కొట్టిన అరుణపతాకం
కార్మికోద్యమ నిబద్ధతలో కాలజ్ఞాన ప్రాపకం
ఉర్దూ దద్దును తెలుగు చేసే రసానుభూతి వ్యాసంగం
రాజ బహుదూర్‌గౌర్ మెరిసే అనుభవాల ప్రాభవం!

అది హైదరాబాద్.. కిక్కిరిసిన మధ్య తరగతి ప్రజలుండే చిక్కడపల్లి. మరోపక్క సూర్యుడికి అడ్డంగా మొలిచిన భాగ్యవంతుల భవనాల బాగ్‌లింగంపల్లి. అటూఇటూ ముక్కులూడే మురికి కాలువల మధ్యలో ఆకలి వలసల దినకూలీల కలల వీధి సూర్యనగర్. ఆ వీధిలోని 'మల్లె పందిరి' (చమేలీకా మండవా) ఆ వయోవృద్ధుడు ఉండే ఇల్లు. ఎన్నో పోరాటాల్లో ఆరితేరిన యోధుడు, చెక్కు చెదరని సోషలిస్టు విశ్వాసం- కాలానికి వెలగట్టే కమ్యూనిస్టు విజ్ఞానం. ఆయన నివాసమే మార్క్సిస్టు గ్రంథాలయం. ఆయన ఇంటికి ఎవరు వెళ్లినా ఎదురుగా "పోరాటం చేయలేనివాడు పారిపోతాడు, త్యాగం చేయలేనివాడు మాతెగ నుండి జారిపోతాడు" అంటూ గోడకు వేలాడే నినాదం. చదవకుండా తప్పించుకోలేని ఆ కవితా ఖండిక సారమే డా॥ రాజ్ బహుదూర్ గౌర్ ఇదే జీవితం.

వర్తమాన సమస్యలను మదించి పరిష్కారాలు, ప్రయోజనాల కోసం కృషి చేసే నాయకుడు ఆయన. సమకాలీన ప్రజలే కాదు, భవిష్యత్తు తరాల వారి బతుకులు కూడా బాగుండాలని యోచించేవాడు. తపించేవాడు, అందుకు మార్గనిర్దేశం చేసే నిజమైన ప్రజా సేవకుడు. రాజ్ బహుదూర్ గౌర్. అరుదైన నేత. చెరగని చిరునవ్వు ఆయన చిరునామా. ఆయన కమ్యూనిస్టు నాయకుడు, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, కార్మికోద్యమ నేత. తన జీవితాంతం కమ్యూనిస్టుగా ఆదర్శప్రాయంగా బతికారు. నిజాం నిరంకుశ పాలనపై ఎదురు తిరిగి అజ్ఞాత జీవితం గడుపుతూ అనేకమంది యువకులకు రాజకీయ శిక్షణ ఇచ్చారు. నాలుగు భాషలలో ఆరితేరినవాడు. అన్ని వర్గాల ప్రజలను ఇట్టే ఆకట్టుకునే "మధుర భాషణమున మర్యాద ప్రాప్తిరస్తూ" అన్నట్టుగా చెళ్ళమనే చమత్కారం- భళ్లుమనే వ్యంగ్యం, కండ్లల్లో కరుణ, కఠోరమైన క్రమశిక్షణ ఆయన సొంతం.

సాయుధ పోరాట కాలంలో పెన్ను, గన్నూ రెంటినీ చేతపట్టి భారత కమ్యూనిస్టు ఉద్యమంలో కీలక పాత్ర పోషించారు. ప్రపంచ కార్మిక సమాఖ్య (డబ్ల్యూఎఫ్‌టీయూ) నాయకుడిగా రష్యా, బల్గేరియా, మంగోలియా, జెకోస్లోవియా, ఉత్తర కొరియా తదితర దేశాలను సందర్శించి కార్మిక స్థితిగతులను పరిశీలించారు. సరిగ్గా వ oదేళ్ల క్రితం హైదరాబాద్ పాత నగరంలోని గౌలి పురాలో 1918 జులై 21 న ఉత్తర భారతదేశం నుం చి వలస వచ్చిన కుటుం బంలో రాజ్ బహదూర్ గౌర్ జన్మించారు. 1939 లో నాగ్‌పూర్‌లో జరిగిన ఏఐఎస్ఎఫ్ మహా సభలకు మగ్దూంతో కలిసి హాజర య్యారు. అప్పుడే కమ్యూ నిస్టు పార్టీలో ప్రవేశం పొందారు. 1941లో ఉస్మానియా వైద్య కళాశా ల విద్యార్థి సంఘం ఉపాధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. 1943లో వైద్య విద్యను పూర్తి చేసిన తరువాత డాక్ట ర్‌గా ప్రాక్టీసు పెట్టమని ఎంతోమం ది వత్తిడి తెచ్చినా "కాయ చికిత్స చేసేవాళ్లు చాలా మంది ఉన్నారు. సమాజంలో దోపిడీ, దౌర్జన్యాలకు అసలైన చికిత్స చేయాలి" అనుకొని కమ్యూనిస్టు పార్టీ కార్యకలాపాల్లో పూర్తిగా నిమగ్నమయ్యాడు. నిజాం రైల్వే కార్మికుల ట్రేడ్ యూనియన్ ని ర్మాణంలో కీలక పాత్ర పోషించాడు. 1945లో ఔరంగాబాద్‌లో ఆల్ హైదరాబాద్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ఏర్పాటు చేశాడు. 1946 లో రాజ్ బహదూర్ గౌర్ కార్యదర్శి గా ఎన్నికయ్యాడు. పైగా మెడికల్ కాలేజీ నుంచి పట్టభద్రుడైన తొలితరం డాక్టర్లలో రాజ్ ఒకరు. "మీకు డాక్టర్ ఉద్యోగం ఇస్తాం" అని ఎన్ని ప్రలోభాలు పెట్టినా తృణ ప్రాయంగా తోసివేశారు. 1946 అక్టోబర్ 16న అణచివేత వ్యతిరేక దినాన్ని పాటించి సార్వత్రిక సమ్మె చేశాడు. దీంతో ప్రభుత్వం అరెస్టు చేసింది. 1946 నవంబర్ 15న కమ్యూనిస్టు పార్టీని నిషేధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. ఆ తర్వాత సెంట్రల్ జైలు నుంచి ఆ స్పత్రికి తీసుకొస్తుండగా నానా చిత్ర హింసలు పెట్టిన పో లీసులు. నాటకీయ ఫక్కీలో "నాకు మూత్రం వస్తుంది" అని పోలీసుల కండ్లు కప్పి తప్పించుకొని రాచకొండ అడవులలో తలదాచుకున్నా మళ్లీ పోలీసులు అరెస్టు చేశారు. హైదరా బాద్ సంస్థానం భారత్‌లో విలీన మైన తర్వాత కూడా ఆయ నను జైలులోనే పెట్టారు. ఆతని విడుదల ప్రమాదకరమని ఆనాటి సర్కారు భావించింది. అయినా జైలు నుండే 1952లో రాజ్యస భకు ఎన్నికయ్యారు. తర్వాత భారత ప్రభుత్వం ఆదేశాల మేరకు విడుదల య్యారు. రెండుసార్లు రాజ్యసభ స భ్యుడిగా ఎన్నికయ్యారు. 1964లో ఆయన రాష్ట్ర కమ్యూనిస్టు పార్టీ స హాయ కార్యదర్శిగా ఎన్నికయ్యారు. 1969లో సీపీఐ జాతీయ సమితీకి ఎన్నికయ్యారు. 1975 నుంచి 1988 వరకు కేంద్ర కార్యవర్గ సభ్యు డిగా ఉన్నారు.






దేశానికి మతోన్మాద ముప్పు ఎదురు కానుందని ఏనాడో పసిగట్టి న చైతన్యశీలి. సోషలిజం ప్రస్థానం లో ప్రజాస్వామ్యాన్ని లౌకికతత్వాన్ని పరిరక్షించుకోవాల్సిన అవసరాన్ని ఆయన వక్కాణించారు. దేశంలో ఎన్నెన్నో దారులలో చీలికలు ఆయన కమ్యూనిస్టు శ్రేణుల ఐక్యత అవస రాన్ని గుర్తించారు. ఆయన గొప్ప విప్లవకారుడే కాదు, గొప్ప కవి కూడా. మంచి వక్త, ఈ "అరాచకా నికి విప్లవానికి రేఖామాత్రమే భేదం ఉంది, వ్యక్తిగత ప్రయోజనాల కోసం తిరుగుబాటు చేయడం అరాచకం, సామాజిక ప్రయోజనాల కోసం తిరుగుబాటు చేయడం విప్లవం. విప్లవంలో క్రమశిక్షణ అదు పు చేస్తుంది. అదుపు చేయలేనప్పుడు అరాచకమే విప్లవ మవుతుంది. అది పుట్టిన చోటే అంతమవుతుంది. వ్యక్తిని పండించి వ్యవస్థను పరిమళింపజేసేదే కమ్యూనిజం" అం టారాయన. రాజ్ బహద్దూర్ మగ్దూం మొహియుద్దీన్ ప్రాణ సఖుడే కాదు, తోటి కార్మికోద్యమ నేత. 70 వేల మంది ట్రేడ్ యూనియన్ సభ్యుల్ని తయారు చేసి ఆంధ్ర రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఏఐటీయూసీలో విలీనం చేసాడు. శ్రామిక కవితా నిర్వచనానికి పరాకాష్ట రాజ్. సాహిత్యంలో దిట్ట. ఉర్దూ కవు ల్ని, బాగా అధ్యయనం చేశాడు. ప్రేమ్‌చంద్ కథలు మొదటి ప్రేరణ. గాలిబ్, ఇక్బాల్ ఫిరాఖ్, మగ్దూం కవిత్వాలు స్ఫూర్తి. నిత్యం చదువుతూ రాస్తూ ఉండేవాడు. ఒకసారి జ్వాలముఖి రాజ్ గారితో కవిత్వానికి కాలం చెల్లిందా? అని ప్రశ్నిస్తే కవి త్వం స్వభావం సమాజావసరాలకు అనుగుణంగా మార వచ్చు కానీ కవిత్వం కనుమరుగు కాదన్నాడు. అంతేకాదు, ఒక సమస్య పరిష్కారాల్ని నిర్దిష్టంగా, కళారూపంగా మలిచి సులభంగా ప్రజల మెదళ్లలోకి పంపించేవారు. కవులు, కళా కారులు మాత్రమేనని, కళాకారులు లేకుండా కమ్యూనిస్టులు లేరని స్పష్టం చేశారు. పాటలు, కవితలు ప్రజలకు ప్రేరణలే కాదు, పోరాటాల అలసటను కూడా తీర్చాలి అంటారాయన. సాహిత్యం ఖచ్చితంగా దిశను నిర్ధారించాలి. ప్రజల్ని సంఘ టిత పరిచి పోరాటానికి సిద్ధం చేయాలి. తెలంగాణ ఉద్యమ కాలంలో అలాంటి పాత్రనే నిర్వహించింది. ఎన్నికల విష యం మాట్లాడినపుడు ఎన్నికలే సర్వస్వం కాదు. ఎన్నికల ద్వారా వ్యవస్థను మార్చడం అసాధ్యం. కానీ పార్లమెంట్ కూడా ప్రజల చేతుల్లో ఆయుధం. దాన్ని మనం నిర్లక్ష్యం చేయజాలం. విశాల దృక్పథం, ఆత్మ విమర్శ అతి ముఖ్యం అన్నారు. "ఒక పోరాట రూపాన్ని ఇదమిద్ధంగా శాసించరాదు. పోరాట రూపాల్ని పరిస్థితులు నిర్ణయిస్తాయి. ప్రజా సహకారాన్ని భాగస్వామ్యాన్ని బట్టి ప్రవర్తించాలి. నిర్బంధం విరుచుకుపడ్డ కాలంలో పోరాట వీరుల్ని అడవుల్లో ఉండమనే వారు కొండల్లోకి వచ్చి అన్నపానీయాలు అందించేవారు. ప్రాణాలు చేతుల్లో పెట్టుకొని నమ్మకంగా పనిచేసే కొరియర్ల సహాయం అసామాన్యం. ఊళ్లోకి పోరాట వీరుల్ని రావద్దనేవారు. ఎందుకంటే నిర్బంధం పెరిగి పోరాటం దెబ్బతింటుందనేవారు. పోరాట వీరుల్ని కాపాడుకోవడంలో ప్రజలు ప్రాణాలకు తెగించేవారు. ప్రజల ఇష్టానికి భిన్నంగా పోరాటాన్ని చేయజాలం ప్రజల మూడ్ ఎన్నికల వైపు మళ్లించబడి ఉంది. తెలంగాణ సాయుధ పోరాటంలో వ్యవసాయక విప్లవం ప్రధానం. అందులో భాగంగానే రాజకీయ, ప్రజాస్వామిక సాంస్కృతిక పోరాటాలు అభివృద్ధి చెంది ప్రధాన పోరాటంలో కలిసిపోయాయి. తెలంగాణ పోరాటంలో అతి ముఖ్యాంశం సాంస్కృతికమైనది. ఆంధ్ర మహాసభ ఆవిర్భావం సాంస్కృతికంగా ఏకం చేసింది. సాంస్కృతిక ఉద్యమంలో నుంచి రాజకీయోద్యమం బలపడింది. వీరేశలింగం గురజాడల్ని కూడా కమ్యూనిస్టులు ప్రచారంలోకి తెచ్చారు. కుల, వర్గ విబేధం లేకుండా ప్రజల మధ్య ఐక్యతను సాధించారు. భూ సంస్కరణలు అంతిమ లక్ష్యం. దాన్ని సాధించారు. తెలంగాణ సాంస్కృతిక ఐక్యతకు చిహ్నం. సంస్కృతిలోనే పోరాటం దాగి ఉంది. ఇది మరిచిపోవద్దు" అన్నారు.

అభ్యుదయ సాహిత్య, సాంస్కృతికోద్యమం పొడవు, వెడల్పులు పెరగాలి. విస్తృతి చెందాలి. విశాలం కావాలి. విశాల ప్రాతిపాదికపై వామపక్షం నిర్మించాల్సిన అవసరం ఉన్నట్టే సాంస్కృతిక రంగాల్లో విశాల ప్రాతిపదికపై ఉద్యమాల నిర్మాణం అవసరమంటారు. ఓ దాశరథి, ఆళ్వార్, ప్రేమ్‌చంద్, శ్రీశ్రీ, మగ్దూం, సుద్దాల, హష్మీ లాంటి కమిటెడ్ రచయితల అవసరం నేడుంది. అటువంటి వారిని మనమే తయారు చేసుకోవాలి. తయారు కావాలంటారు. ఆయనలో ఎక్కడా నిరాశ, దీనత్వం కనిపించవు. సెక్యూలరిజం బలపడాలని, ప్రజల ప్రజాస్వామ్యం ఏర్పడాలని, సోషలిజం స్వప్నం ప్రజలకు చెప్పాలని, ప్రజలకు పార్టీకి ఉన్న దూరం పోవాలని వామపక్ష ఐక్యత తక్షణ రాజకీయ ఆవశ్యకత అని అది అన్ని రంగాల్లో బలపడాలని ఆ వృద్ధ కేసరి ఆకాంక్ష.

వర్గ పోరాటాన్నీ మానవతా సంస్కారాన్నీ విరబూయించిన కమ్యూనిస్టు యోధుడాయన. 93 ఏండ్లు... తాను బతికినంత కాలం కమ్యూనిజాన్ని ప్రేమిస్తూ దానికి చేతనైనంత సేవ చేస్తూ 2011 అక్టోబర్ 7న తుదిశ్వాస విడిచారు. ఆయన అమరత్వం అరుణారుణం. ఆయన చరిత్ర గతమైనా ప్రస్తుతం చాలా అవసరం. అందుకే ఈ శతజయంతి అక్షర నివాళి.

సెల్ : 9490098343

ఈబీసీ రిజర్వేషన్ల అంతిమ లక్ష్యం ఏమిటి?



గ్యార మహేష్

వేల ఏండ్ల అణచివేతకు, దోపిడీకి చిన్న పరిహారంగా ఎస్సీ, ఎస్టీలకు రాజ్యాంగం రిజర్వేషన్లు కల్పించింది. ఈ రిజర్వేషన్లకు సామాజిక, ఆర్థిక, రాజకీయ వెనుకబాటు ప్రాతిపదికగా ఉన్నది. అణగదొక్కబడిన వర్గాలకు రిజర్వేషన్లే కాక కొన్ని రక్షణాత్మక చట్టాలూ ఉన్నాయి. వాటికోవలోకి చెందినవే ఎస్సీ, ఎస్టీలకు ప్రత్యేక కమిషన్, మంత్రిత్వ శాఖల ఏర్పాటు, 'ప్రివెన్షన్ ఆఫ్ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్'లు. ఇవి పై వర్గాలమనుకునే వారి నుండి కింది వర్గాలుగా చూడబడుతున్న వారికి ఇచ్చిన ప్రత్యేక రక్షణలు. అలాగే రాజ్యాంగంలోని ఆర్టికల్ 17 అంటరానితనాన్ని నిషేధించి దళితులకు రక్షణనిచ్చింది. రాజ్యాంగం కల్పించిన రక్షణలు దళితులను వివక్షనుంచి కాపాడటానికి సరిపోలేదు. సరిపోలేదనటానికి 1968లో తమిళనాడులోని కిల్వమణిలో, 1985లో కారంచేడులో దళితులపై జరిగిన దాడులు సాక్ష్యాలుగా నిలిచాయి. దాన్ని తగ్గించడానికి స్వాతంత్ర్యం వచ్చిన 42 ఏండ్లకు, రాజ్యాంగం అమల్లోకొచ్చిన 39 ఏండ్ల తర్వాత ఎస్సీ, ఎస్టీలకు సామాజిక వివక్ష నుంచి రక్షణలు లేవని తెలుసుకొని 1989లో 'ప్రివెన్షన్ ఆఫ్ ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ యాక్ట్' ని తెచ్చారు. ఇది తెచ్చిన రెండేండ్లకే 1991లో చుండూరులో మానవతకే మాయని మచ్చలాగా దళిత సంహారం జరిగింది. ఇది మన సమాజంలో దళితుల పట్ల కొనసాగుతున్న హీన చూపునకు తార్కాణం. బీహార్‌లో దళితులపై రన్‌వీర్ సేన దాడులు, రాజస్థాన్‌లో దాడులు ఇలా చెప్పుకుంటూ పోతే కోకొల్లలు. 2017లో అభంగ పట్నంలో జరిగిన అవమానం గురించి తెలిసిందే. నిన్నగాక మొన్న శబరిమలలోనికి మహిళ వెళ్తే 'శబరిమలలోకి ప్రవేశించిన దళిత మహిళ' అని మీడియా సంబోధించింది. అంటే ఇంకా దళితులకు ఆలయాల్లో ప్రవేశం లేదనీ, వాళ్లకు ప్రవేశించే ధైర్యం (అవర్ణుల ప్రవేశానికి సవర్ణులు ఒప్పుకోరనే భయం వల్ల) లేదనీ పరోక్షంగా ఒప్పుకోవడమే దానర్థం. ఇప్పటికీ అయ్యప్ప మాల ధరించినపుడు అవర్ణులూ, సవర్ణులూ వేర్వేరుగా ఉండటం చూస్తూనే ఉన్నాం. కులదురహంకార హత్యలైతే లెక్కలకే అందవు. ఇవన్నీ కుల వివక్ష ఇప్పటికీ కొనసాగుతున్నదనటానికి నిదర్శనాలు.


చుండూరు నరమేధంలో చనిపోయిన కొమ్మెర్ల అనిల్‌కుమార్ తండ్రి.. ఘటన జరిగిన 26 ఏండ్ల తర్వాత 2017లో మాట్లాడుతూ "ఘటన జరిగినపుడు చంపిన వారి పొలాలకు పోవొద్దని తీర్మానించుకున్నాం. అయితే ఆచరణలో అది మాత్రం మా వల్ల కాలేదు. ఎందుకంటే తరువాత పనిదొరకడం కష్టమైపోయింది. కొందరు బతకడానికి తిండిలేక చివరకు చంపిన వారి పొలాలకే పనులకు వెళ్లి పొట్టనింపుకోవాల్సి వచ్చింద"ని అన్నారు. అంటే వారికి ఉపాధి లేదు, ఆస్తీ లేదు. గౌరవ మర్యాదలూ లేవు. కనీసం ప్రాణాలకు రక్షణా లేదు. ఆకలి రుచినేకాదు మర్యాద కూడా ఎరుగదు. ఇంకా ఎన్నో! మరి ఆ ఆకలికి కారకులెవరు? చుండూరు లాంటి ఘటనలు ఎన్ని జరిగినా వారిపై శిక్షలెందుకు సరిగా పడటం లేదు? వాటికి ఒకటే సమాధానం 'వివక్ష'. అధికారుల వివక్ష. పాలకుల వివక్ష. పాలకులే వివక్ష చూపిస్తే వారికి రక్షణేది? రిజర్వేషన్లు అమలు జరిపిన 66 ఏండ్ల తర్వాత కూడా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాల్లో 3.96 శాతం ఎస్సీలు, 4.37 శాతం ఎస్టీలు మాత్రమే ఉన్నారు. దీన్నిబట్టి రిజర్వేషన్ల అమలులో వివక్ష ఉన్నదని స్పష్టమవుతున్నది. మరి ఈ వివక్షకు అంతమెపుడు? వీటన్నిటికీ సమాధానం కులాన్ని సమూలంగా తీసేసినపుడే దొరుకుతుంది. కులం పోయిన నాడు మాత్రమే ఈ వివక్ష పోతుంది. మరి ఇలాంటి వివక్షలేమైనా అగ్రవర్ణాలు అనుభవిస్తున్నాయా? లేదు. అగ్రవర్ణ పేదలకు సహాయం కచ్చితంగా చేయాల్సిందే. అయితే అది రిజర్వేషన్ల ద్వారా కాదు. సుప్రీంకోర్టు కూడా 1992లో ఇందిరా సహాని కేసులో ఆర్థిక వెనుకబాటు రిజర్వేషన్లకు ప్రాతిపదిక కారాదని పేర్కొన్నది.

69 ఏండ్లుగా అమలుచేస్తున్నాం ఇంకా రిజర్వేషన్లు అవసరమా? అని కొందరు ప్రశ్నిస్తున్నారు. వేల ఏండ్ల వివక్షనీ, వనరుల లేమినీ ఇన్నేండ్లలో తీసేయడం సాధ్యమా? అన్న ప్రశ్న వేసుకోవాలి. సమాజంలో వివక్ష ఏ స్థాయిలో ఉన్నదో పరిశీలించాలి. 69 ఏండ్ల రిజర్వేషన్లపై విమర్శిస్తున్నారు, మరి వేల ఏండ్ల నుంచి ఇప్పటి వరకూ వనరులపై రాజ్యాంగేతర రిజర్వేషన్ల సంగతేంటి? వీటన్నిటినీ హేతుబద్ధంగా ఆలోచించాలి. చారిత్రాత్మక దోపిడీ నుంచి అవర్ణులకు లేదా కింది కులాలుగా సమాజంలో గుర్తింపబడిన వారికి ఇచ్చిన ఈ రిజర్వేషన్ల అంతిమ లక్ష్యం సమూల కుల నిర్మూలనే. కులం లేని నాడు మనిషి కేంద్రంగా విలువలు నిర్మాణం అవుతాయి. అది సమసమాజ స్థాపనకు నాంది అవుతుంది. కుల నిర్మూలనే రిజర్వేషన్ల అంతిమ లక్ష్యమైనప్పటికీ ఆర్థిక, రాజకీయ సమానతలను సాధించడానికి ప్రస్తుతం ఇది తోడ్పడుతోంది. అంతేగానీ కేవలం ఆర్థిక సమానత్వం కోసం మాత్రమే కాదు.

లక్ష్యాలను ఇపుడు ఈబీసీ రిజర్వేషన్లతో కాలరాస్తున్నారు. పేదరికంతో బాధ పడుతున్న అగ్రకులస్తులు ఎవరి నుంచి సామాజిక వివక్షకు గురవుతున్నారు. వారికి ఎవరి నుంచి రక్షణలు కావాలి? వారి ప్రాతినిధ్యాన్ని ఎవరు దోచుకుంటున్నారు? లాంటి మౌలిక ప్రశ్నలకు సమాధానం ఇవ్వకుండా రిజర్వేషన్లు ఎలా ఇస్తారు? పేదరికం ఆధారంగా రిజర్వేషన్లు కావాలనే వారు నిజంగా రిజర్వేషన్లు కావాలంటే కులవ్యవస్థను తీసేయాలని అడగాలి. ఆ తరువాత రిజర్వేషన్లను గూర్చి చర్చించాలి. అది హేతుబద్ధమైన డిమాండ్ అవుతుంది. ఇపుడు ఈబీసీ రిజర్వేషన్ల అంతిమ లక్ష్యం కుల వ్యవస్థను పటిష్ట పరచడమే అవుతుంది. రిజర్వేషన్ల ప్రాతిపదికను మారిస్తే రిజర్వేషన్ల లక్ష్యం పూర్తిగా చెడినట్టే. అపుడు కులనిర్మూలన జరగకపోగా కుల వ్యవస్థ గట్టి పడుతుంది. అది అనేక అశాంతులకు కారణభూతమవుతుంది. దానిద్వారా మళ్లీ ఓటర్ల విభజన జరుగుతుంది. తద్వారా కుల నాయకులు మాత్రమే లాభపడతారు. సామాన్య జనం మాత్రం కుల దురహంకార హత్యలతో, నాయకుల కులచిచ్చులతో నలిగిపోతూనే ఉంటారు. నాయకులకు కుల వ్యవస్థతో లాభపడాలని ఉంటుంది కాబట్టే కుల వ్యవస్థను వ్యతిరేకించడం లేదు. దానికి సాక్ష్యమే ఈబీసీ రిజర్వేషన్ బిల్లును అన్ని పార్టీలూ (నిమ్న కులాలకు ప్రతినిధుల మని చెప్పుకునే పార్టీలతో సహా) సమర్థించడం. ఇప్పుడు రాజ్యాంగ రీత్యా సాధ్యం కాని ఈ ఈబీసీ రిజర్వేషన్లతో లాభపడాలని బీజేపీ ప్రయత్నించగా దానికి అన్ని పార్టీలు భయపడి మద్దతివ్వడం దేనికి సంకేతం?


సెల్ : 7799295204

ప్రజా కళలకు గమ్యం చూపిన గరికపాటి



తంగిరాల చక్రవర్తి

ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ వ్యవస్థాపకుల్లో ఒకరు, ప్రజానాట్యమండలి నిర్మాతల్లో ప్రముఖుడు, నటుడు, దర్శక ప్రయోక్తగా ప్రజా వైద్యశాల వైద్యుడిగా ప్రసిద్ధుడైన డాక్టర్ గరికపాటి రాజారావు దాదాపు 105 ఏండ్ల కిందట 1915 ఫిబ్రవరి 5న రాజమండ్రిలో గరికపాటి సోమయ్య దేవర సోమలింగమ్మ దంపతులకు జన్మించాడు. విద్యార్థి దశలోనే నాటకాల్లో నటించడం, ఆదిభట్ల నారాయణ దాసు ఆటకీ, పాటకీ తాళం వేసి ఆయన మెప్పు పొందటం విశేషంగా ఆ రోజుల్లో చెప్పుకునేవారు. రాజారావులోని కళా పిపాసిని చూసి తండ్రి ఉద్యోగరీత్యా సికింద్రాబాద్ (లాలాగూడ వర్క్ షాపు) వచ్చారు. రాజారావు సత్య హరిశ్చంద్ర నాటకంలో మాతంగ కన్య పాత్రలో నటిస్తూ తొలిగా రంగస్థలి ప్రవేశం చేసారు. రాజారావుకు 15 ఏండ్ల వయసుకే నాగేశ్వరమ్మతో వివాహం జరిగింది. తండ్రి చేస్తున్న లాలాగూడ వర్క్‌షాపులో ఉద్యోగిగా చేరాడు. ఆ తర్వాత విజయ నగరంలో ఎస్ఎల్‌సీ, మద్రాస్‌లో ఎల్ఈఎం కోర్సులు చేశాడు. నాటకాన్ని మాత్రం విడువలేదు. గుళ్లపల్లి నారాయణ మూర్తి రాసిన విడాకులు నాటకానికి తొలిగా దర్శకత్వం వహించాడు. ఆనాడే రాజారావు కొత్తవారిని నాటకాల్లో పరి చయం చేశారు. "షాజహాన్" నాటకం ఆ రోజుల్లో రాజారావు గారికి మంచి ఖ్యాతి తెచ్చింది. ఈ నాటకానికి దేవీ ప్రసాద్ రామ్ చౌదరి మేకప్ వేయడం, కొర్రపాటి గంగాధర్ రావు ఎన్వీఆర్ సాంబశివరావు లాంటి వారు నటించడం గొప్ప విషయం. మద్రాస్ ఔత్సాహిక విద్యార్థులతో భమిడిపాటి "బాగు బాగు", బాల సుందరరావు 'అపోహ' నాటకాలు ప్రదర్శింపజేశారు. మహా మనిషి పుచ్చలపల్లి సుందరయ్య గారి సోదరుడైన పుచ్చలపల్లి రామచంద్రారెడ్డి స్నేహం, ప్రజా వైద్యశాలలో పని చేయడంతో రాజారావు మార్క్సిజం వైపు మళ్లాడు. విజయవాడకు సమీ పంలోని పోరంకి గ్రామంలో వైద్యశాల పెట్టారు. ఆ కాలంలోనే ఔత్సాహిక నటులతో "ఖిల్జీ రాజ్య పతనం" "రంగూన్ రౌడి" నాటకాలు ప్రదర్శించారు. ఆ రోజుల్లో బాల, యువజన సం ఘాలు నెలకొల్పారు. 1934లో (ఇఫ్టా) ఇండియన్ పీపుల్స్ థి యేటర్ అసోసియేషన్ ఆవిర్భా వంతో ఇఫ్టా రాష్ట్ర కన్వీనర్‌గా రాజారావు ఎన్నుకోబడ్డారు. ఇఫ్టా అనుబంధ శాఖగా ప్రజా నా ట్య మండలి ఏర్పాటుకు కృషి చేసి, దానికి దర్శకుడిగా, ప్రయో క్తగా రాజారావు పని చేశారు. కమ్యూనిస్టు పార్టీ సాం స్కృతిక దళంగా ప్రజా నాట్యమండలి పాత్ర అపూర్వమైనది. జిల్లాల్లో శిక్షణా శిబిరాలు ఏర్పాటు చేసి వందలాదిమంది కళాకారుల్ని రాజారావు తయారు చేశారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం ఇతివృత్తంగా సుంకర సత్యనారాయణ, వాసిరెడ్డి భా స్కరరావులు రాసిన "మా భూమి" సంచలనాలకు చిరునా మాగా మారింది. ఈ నాటకంలో పట్వారీ వెంకట్రావ్ పాత్రను రాజారావు పోషించి దర్శకత్వం వహించాడు. ఈ నాటకం ప్రభుత్వ నిషేధాన్ని ఎదుర్కొన్నది. అలాగే "హిట్లర్ భాగోతం" అనే వీధి భాగోతం అద్భుతంగా ప్రదర్శించారు. 'ప్రెస్ వర్కర్' నాటిక కూడా మంచి పేరు తెచ్చిoది రాజారావుకి. ఆచార్య ఆత్రేయ రాసిన "పరివర్తన" "ఈనాడు" "భయం" నాటకాలు ఆ రోజుల్లో ఘనతగా చెప్పుకునే "ఆంధ్ర నాటక కళా పరిషత్తు" పోటీల్లో ప్రదర్శించి పలు బహుమతులు సాధించారు రాజారావు. "కళా కళ కోసం కాదు ప్రజల కోసం" అని నమ్మాడు రాజారావు. అ ల్లూరి సీతా రామ రాజు నాటకం ఆంధ్ర, మద్రా సు, కేరళ, కర్నాటక, ఒరిస్సా, యూపీ, బెంగాల్, కేరళల్లో ప్రదర్శించారు. దర్శకత్వం వహించడమే కాకుం డా ఆ నాటకంలో రూథర్ ఫర్డ్ పాత్రలో నటించి మెప్పించారు. టెక్నికల్ విలువలతో ఈ నాటకాన్ని అన్ని హంగులతో గొప్ప గా తీర్చిదిద్ది ప్రదర్శించారు. ఎన్నో నూతన టెక్ని క్స్ ప్రవేశపె ట్టారు. మరాఠీ రచయిత మామా సా వర్కర్ రాసిన 'జై భవాని' నాటకాన్ని ఎస్. జగన్నాథ్ తెలుగులో అనువాదం చేయగా ఆ నాటకాన్ని ప్రదర్శించారు రా జారావు. ఎంతో పేరు తెచ్చిందీ నాటకం. అలాగే స్వీయ నిర్మా ణ దర్శకత్వంలో "పుట్టిల్లు" చిత్రాన్ని నిర్మించారు. కథనాయిక జమునను ఈ చిత్రం ద్వారానే వెండితెరకు తొలిగా పరిచయం చేశారు. అలాగే అల్లూరి రామలింగయ్య, పెరుమాళ్లు, కుటుం బరావు, కైకాల వంటి నటులు తాతినేని చలపతిరావు, మోహ న్‌దాస్ లాంటి సంగీత దర్శకుల్ని రాజారావే పరిచయం చేశా రు. వారు స్టార్స్‌గా వెలుగొందారు. తర్వాత కాలంలో 'దేవుడు చేసిన మేలు' చిత్రం నిర్మించినా ఆర్థిక ఇబ్బందులతో విడుదల కు నోచుకోలేదు. పాత్రల కథానికలు, హావభావాలు, వ్యక్తీకరణ, జనంలో చైతన్యం తెచ్చేలా ప్రదర్శన రక్తికట్టించడంలో ఆ యన రాజమండ్రిలో రాఘవ వేళ సమితితో విలువైన గ్రంథా లు సేకరించి గ్రంథాలయం స్థాపించారు. నటుడు, సమయ స్ఫూర్తి, పాత్రల నిర్ణయం ప్రదర్శనం పేరుతో ఆయన రచించి న విమర్శనా వ్యాసాలు ఇప్పటికీ ప్రమాణీకాలే. 8 సెప్టెంబర్ 1963లో జీవిత రంగ స్థలంలోంచి నిష్క్రమించిన రాజారావు గొప్ప కళాకారుడు, దర్శక ప్రయోక్త.



సెల్ : 9393804472

స్ఫూర్తి ప్రధాత మగ్దూం



తోట నగేష్

నిజాం నిరంకుశ పాలనలో భూస్వా మ్య వ్యవస్థలో నలిగిపోతున్న తెలంగాణను జాగృత పరచడానికి, నవ తెలంగాణ నిర్మాణం కోసం చైతన్యవంతమైన పాత్రవహించిన ప్రముఖులలో ప్రత్యేకంగా పేర్కొనవలసిన ప్రజానాయకుడు బహు ముఖ ప్రతిభా సంపన్నుడు 'మగ్దూం మొహి యుద్దీన్. ఆయన మెదక్ జిల్లా అందోల్‌లో 1908 ఫిబ్రవరి 4న జన్మించాడు. ఆయన పూర్తి పేరు అబూసయీద్ మహ్మద్ మగ్దూం మొహియుద్దీన్. తండ్రి గౌసుద్దీన్. వీరి పూర్వీకులు ఉత్తరప్రదేశ్‌లోని అజంగఢ్ ప్రాంతానికి చెందినవారు. ఆయన ప్రాథమిక విద్యా భ్యా సం అందోల్‌లో, హైస్కూలు చదువు సంగారెడ్డిలో జరిగింది. ఇంటర్మీడియట్ హైదరాబాద్‌లో చదివాడు. చి న్నతనంలోనే ఆయనలో స్వతంత్ర భావనలు అంకురిం చాయి. స్వంత కాళ్లపై నిలబడి జీవితాన్ని గడపాలనే ఆలోచనలు ఏర్పర్చుకొని ట్యూషన్‌లు చెబుతూ పత్రికలు అమ్ముతూ చదువుకున్నాడు. ఆయన రచనా వ్యాసంగం 1933లో పచ్చశాలువ (పీలీదుశాల్) అనే కవితా ఖండి కతో ప్రారంభమైంది. 1937లో 'ఉర్దూ నాటకాలు' అనే విషయం మీద పరిశోధన వ్యాసం రాసి ఉస్మానియా యూనివర్సిటీ నుండి ఎంఏ పట్టా పొందాడు. వెంటనే ఆయనకు సిటీ కాలేజీలో ఉర్దూ లెక్చరర్ ఉద్యోగం వచ్చింది. ఉస్మానియా యూనివర్సిటీలో చదువుతున్నప్పుడే కవిగా, నాటక రచయితగా, నటుడిగా పేరు పొందాడు. బెర్నార్డుషా నాటకానికి "హోష్ కె నాఖూన్" అనే ఉర్దూ అనుసరణ రాసి హైదరాబాద్‌లో రవీంద్రనాథ్ టాగూర్ ఎదుట ప్రదర్శించాడు. టాగూర్ ఆ నాటకం చూసి ఆనందం పట్టలేక ప్రదర్శన అయిపోగానే స్టేజీపైకి వెళ్లి మగ్దూంను అభినందించాడు. తన శాంతినికేతన్‌కు వచ్చి చదు వుకోవలసిందిగా ఆహ్వానించాడు. ఇలా విశ్వకవి రవీంద్రు డినే మెప్పించిన ఘనత మగ్దూంది. విద్యార్థి దశ నుండే మగ్దూంలో వామపక్ష భావజాలం ఉండేది. మార్క్స్ ప్రభా వం అధికంగా ఉండేది. 1939లో నాగపూర్‌లో స్థాపించ బడిన హైదరాబాద్ విద్యార్థి యూనియన్ ఏర్పాటులో ఆ యన పాత్ర ప్రముఖమైనది. 1941లో జరిగిన ప్రపంచ పరిణామాలతో మన దేశంలో కమ్యూనిస్టు పార్టీ ప్రభావం పెరగసాగింది. ఇందులో భాగంగా నైజాం రాష్ట్రంలో కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలు తెలంగాణ పల్లెల్లోకి వెళ్లి ప్రజలను చైతన్యవంతులను చేయడం మొదలుపెట్టారు. మగ్దూం తాను చేస్తున్న లెక్చరర్ ఉద్యోగానికి రాజీనామా చేసి పూర్తిస్థా యిలో కమ్యూనిస్టు ఉద్యమానికి అంకితమ య్యాడు. హైదరాబాద్ సంస్థానంలో ముఖ్యంగా తెలంగాణలోని ప్రతి జిల్లాలో జరిగే సభలలో పాల్గొని ఆనాటి ప్రభుత్వ నిరంకుశ పాలన, ప్రభుత్వ అధికారుల, జాగీ ర్దార్లు, దౌర్జన్య చర్యలను నిశితంగా విమర్శించేవాడు. భారత స్వాతంత్ర్య సమరంలో పాల్గొనవ లసిందిగా ప్రజలకు ఉద్బోధించేవాడు. ఆయన ఉపన్యాసం వినడానికి ప్రజలు వేల సంఖ్యలో వచ్చేవారు. నానాటికీ రా ష్ట్రంలో మగ్దూంకు పెరుగుతున్న పలుకుబడిని, ప్రఖ్యాతిని చూసి ప్రభుత్వం సహించలేకపోయింది. బ్రిటిష్ ప్రభుత్వా న్ని విమర్శించినందుకు అరెస్టు చేసి మూడు నెలల జైలు శిక్ష విధించింది. 1944-46 మధ్యకాలంలో కార్మికుల రక్షణ కో సం చట్టం చేయడానికి పోరాటం చేశాడు. ఎన్నో కార్మిక సం ఘాలను స్థాపించి కార్మికుల సంక్షేమం కోసం కృషి చేసిన మహనీయుడు మగ్దూం. భారతదేశానికి స్వాతంత్ర్యం లభించిన తరువాత హైదరాబాద్ సంస్థానం భారత దేశంలో విలీనం కావాలని ఇక్కడి రాజకీయ పక్షాలన్నీ పెద్ద పెట్టున ఉద్యమం లేవదీశాయి. కమ్యూనిస్టు పార్టీ ప్రముఖ నాయ కుడైన మగ్దూం ఈ ఉద్యమంలోనూ ప్రముఖ పాత్ర నిర్వ హించాడు. 1948 సెప్టెంబర్ 17న పోలీస్ చర్యతో హైద రాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైంది. తదనంతరం కమ్యూనిస్టు పార్టీ సార్వత్రిక ఎన్నికలలో పాల్గొనడంతో మగ్దూం హుజూర్‌నగర్ నుంచి శాసనసభ కు ఎన్నికయ్యాడు. తరువాత 1957లో శాసనమండలి సభ్యుడిగా ఎన్ని కై ప్రతిపక్ష నాయకుడిగా పని చేసి ఉత్తమ ప్రజాప్రతి నిధిగా ప్రఖ్యాతి పొందాడు. మగ్దూం మంచి హాస్య ప్రియుడు. ఎప్పుడూ నవ్వుతూ, నవ్విస్తూ సరదాగా ఉండేవాడు. హైదరాబాద్ రాష్ట్ర అసెంబ్లీలో ఫూల్‌చంద్ గాంధీ ఆరోగ్యమంత్రి. ప్రతిపక్ష నాయకుడైన మగ్దూం ఆరోగ్య శాఖలోని లోపాలను ఎత్తిచూపుతూ "ఫూల్‌చంద్ కాంటే బహుత్" (పువ్వులు కొంచెం ముళ్లేమో ఎక్కువ) అని ఛలోక్తి విసిరి గాఢమైన విషయాన్ని కూడా సున్నితంగా హాస్యాన్ని జోడించి చెప్పాడు. మగ్దూం "షాయరే ఇంక్విలా బ్" అనే బిరుదు పొందాడు. నీతికి, నిజాయితీకి, ఆశయపటిమకు, నిస్వార్థసేవకు మారుపేరు మగ్దూం.



సెల్ : 9912764580

ఉపాధి కరువైన ఫార్మసిస్టులు- బాధ్యత మరిచిన ప్రభుత్వాలు



ఎన్. కలీల్

రోగులకు మందులు అంటగట్టడంలో దోపిడీ భారీగా ఉంటోంది. ఆయా ఆసుపత్రుల్లో ఉన్న మెడికల్ షాపుల్లోనే మందులు కొనుగోలు చేయాలంటూ వైద్యులు ఎక్కువ మొత్తంలో రాస్తుంటారు. ఈ మోసం మనకు కండ్లకు కట్టినట్టు కనిపిస్తూనే ఉంటుంది. అయితే విదేశాల్లో కేవలం రోగి రోగాన్ని గుర్తించడం మాత్రమే వైద్యుడి పని. దానికి ఏ మందులు ఎంత మోతాదులో వాడాలనేది క్లినికల్ ఫార్మసిస్ట్ బాధ్యత. అంటే వైద్యుడు, క్లినికల్ ఫార్మసిస్ట్‌లు కలిసి రోగి బాధ్యత తీసుకుంటారు. వైద్యుల నిర్లక్ష్యం, మోసం చాలా వరకు తగ్గుతాయి. మనదేశంలో మాత్రం ఇలాంటి సేవలందించే క్లినికల్ ఫార్మసిస్టులు లేరు. ఎందుకు? ఉజ్వల భవిష్యత్ కలలతో ఫార్మా డీ కోర్సులో చేరే విద్యార్థులు, కళాశాలల నుంచి పట్టా పొందిన తర్వాత ఉద్యోగం కోసం పోరాడుతున్నారు. కోర్సు ప్రారంభించినప్పుడు చాలా అమితమైన ఆసక్తి చూపించిన ప్రభుత్వం, ఇప్పుడు చేతులు కడిగేసుకుంటుంది. ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను భరించడం ప్రభుత్వానికి సాధ్యం కాక, నాలుగు సంవత్సరాల ఫార్మసీ కోర్సును మూడేండ్లకు కుదించే ప్రయత్నాలు చేస్తోంది. మరి విద్యార్థులు మూడేండ్లలో ఫార్మసీని నేర్చుకోగలరా?

ఇతర దేశాలలో ఉన్న ఫార్మా డీ కోర్సును మన దేశంలో ప్రవేశపెట్టడానికి ఎంతో ఆసక్తి చూపించిన మన కేంద్ర ప్రభు త్వం మన ఆసుపత్రులలో, పీహెచ్‌సీలలో క్లినికల్ ఫార్మసిస్ట్ పో స్టులను నియమించడంలో మాత్రం నిర్లక్ష్యం చూపిస్తోంది. మన ఫార్మా డీ గ్రాడ్యుయేట్లు కెమిస్ట్రీ అధ్యయనం చేయలేదనీ, అందు వలన తమ కంపెనీలలో ఉద్యోగాలకు పనికిరారనీ మన ఫార్మా కంపెనీలు నిర్ధారించాయి. ఆంధ్రప్రదేశ్‌లో 60 ఫార్మా డీ కళాశాలలున్నాయి. వాటిలో 1,800 సీట్లు ఉన్నాయి. తెలంగాణలో 53 కళాశాలలున్నాయి. ప్రవేశాల సమయంలో ఒక్కొక్క విద్యార్థి నుంచి రూ.5 నుంచి8 లక్షల వరకూ డొనేషన్ రూపంలో ఏటా రూ. 1.5 -3 లక్షల వరకూ ఫీజుల రూపంలో ఫార్మా.డి కళాశాలలు వసూలు చేస్తున్నాయి. విద్యార్థులకు రూ.68వేల నుంచి రూ. 1.25 లక్షల చొప్పున ట్యూషన్ ఫీజుగా చెల్లిస్తారు. ఈ ట్యూషన్ ఫీజుల మొత్తాన్ని ప్రభుత్వం తిరిగి కళాశాలలకు ఇచ్చేస్తుంది. ఈ విద్యార్థులలో ప్రతి సంవత్సరం, 20 శాతం నుండి 25 శాతం మంది మాత్రమే ఫార్మసిస్ట్‌లు అసిస్టెంట్లు, అసి స్టెంట్ ప్రొఫెసర్లుగా పనిలో స్థిరపడగలుగుతున్నారు. అందుకే ఆసుపత్రులలో క్లినికల్ ఫార్మసిస్ట్ పోస్టులు ఏర్పాటు చేయాలని ఫార్మా డీ గ్రాడ్యుయేట్లు ఆందోళనలు చేస్తున్నారు.

వైద్య విద్య సంచాలక కార్యాలయం వారు బోధనాస్పత్రుల్లో వీరి సేవలు అవసరం లేదని చెప్తున్నారు. ఎంజీఆర్ ఆరోగ్య విజ్ఞాన విశ్వవిద్యాలయం వారిని సంప్రదిస్తే ఎంసెట్ ద్వారా జరిగే ప్రవేశాలకు మాకు సంబంధం ఉండదని చెప్తున్నారు. అదే ఫార్మా డీ విద్యార్థి ఫార్మసిస్టు ఉద్యోగానికి దరఖాస్తు చేస్తే మీది ఉన్నత స్థాయి చదువు కాబట్టి ఈ ఉద్యోగానికి అనర్హులు అంటారు. ఈ విషయంలో మాకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సమాచారం లేదని అంటారు. రాష్ట్ర వ్యాప్తంగా విద్యార్థులు ఈ దురవస్థకు ఎంతో కాలంగా ఆవేదన చెందుతున్నారు. మరోవైపు వీరి పేర్లు మాత్రం రాష్ట్ర ఫార్మసీ కౌన్సిల్‌లో నమోదు చేసుకుంటున్నారు. వైద్య ఆరోగ్య శాఖ సీనియర్ అధికారి ఒకరు దీనిపై స్పందిస్తూ "అమెరికాలో ఉన్నట్టు క్లినికల్ ఫార్మసిస్టులకు ఉద్యోగా వకాశాలు ఇక్కడ లేవు. ఈ కోర్సు పూర్తిగా విదేశాలకు చెందినదని" పేర్కొనడం గమనార్హం. వైద్యుల వలే ప్రాథమిక ఆరోగ్య సంరక్షణ అందించే అనుమతి గానీ, శస్త్రచికిత్స పరికరాలు ఉప యోగించడానికి గానీ ఫార్మా డీ గ్రాడ్యుయేట్లకు అధికారం లేదని చెప్పారు. ఫార్మా.డి కో ర్సు పూర్తి చేసిన పీజీ విద్యార్థులు 2013లో, రెగ్యులర్ విద్యార్థులు 2014లో చదువు పూర్తి చేశారు. అయితే ఫార్మా డీ అర్హతతో ఏ ఒక్క సంస్థ కూడా నియామకాలు చేపట్టడం లేదు. దీంతో కంగుతిన్న విద్యార్థులు విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.

ఈ కోర్సు పూర్తి చేసినవారు ఈ కింది బాధ్యతలకు అర్హులు

- ప్రభుత్వం నియమించే డ్రగ్ ఇన్స్పెక్టర్లు
- ఆస్పత్రుల్లో క్లినికల్ ఫార్మసిస్ట్‌లు
- వైద్య పరిశోధన, ఔషధ ప్రమాణాల పర్యవేక్షణ
- వైద్య కళాశాలలో అధ్యాపకులు
- ఫార్మ కో విజిలెన్స్ విభాగం
- రోగుల కౌన్సిలింగ్ కేంద్రాలు
- టెలీ, ఈ-ఔషధ కేంద్రాలు
- డి ఎడిక్షన్ కేంద్రాలు
- డ్రగ్ పాయిజన్ సమాచార కేంద్రాలు

కానీ కార్పొరేట్ ఆసుపత్రులు ఫార్మా డీ చేసిన వారిని నియమించుకోవడానికి అనాసక్తి చూపిస్తున్నాయి. వీరిని నియమిస్తే తమ ఆస్పత్రుల్లో ఔషధాల అమ్మకాలు తగ్గుముఖం పడతాయనే భావన కనిపిస్తోంది. ప్రపంచ ఆరోగ్య సంస్థ ప్రమా ణాల అమలుకు ప్రభుత్వం ఎలాంటి పోస్టులు కేటాయించకపోవడంతో ఈ విద్యార్హతతో ఎక్కడా అవకాశాలు రావడంలేదు. దీంతో ఈ కోర్సు పూర్తి చేసినవారు ఏం చేయాలో తెలియని పరిస్థితి నెలకొంది. వీరిని ఆసుపత్రులు నియమిస్తే ఔషధాలకు వెచ్చించే నిధులు 65 శాతం తగ్గుతాయనే దురభి ప్రాయాలు ఉన్నాయి. ఎంసెట్ 2019-20లో ఫార్మా డీ కోర్సును చేర్చకూడదని తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే విద్యా శాఖను ఆదేశించింది. ఇప్పటికే చేరిన బ్యాచ్‌ల వివరాల నివేదికను తయా రు చేయాలని అధికారులను తెలంగాణ ప్రభుత్వం కోరింది. తద్వారా కోర్సు పున్ణప్రారంభంపై నిర్ణయం తీసుకుంటారేమో చూడాలి. కొన్ని కళాశాలల యాజమాన్యాలు కొత్త కోర్సులు అమల్లోకి వస్తే బాగా లాభాలను దండుకోవచ్చన్న ఉద్దేశ్యంతో ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియాలో పలువురిని ఈ కోర్సును ప్రారంభించడంలో ప్రభావితం చేసారన్న ఆరోపణలున్నాయి. దీనికి అనుగుణంగా ఇంజనీరింగ్, ఫార్మసీ కళాశాలల్లోనే అంతర్భాగంగా ఈ కోర్సు నిర్వహణలోనికి వచ్చింది. ఈ కోర్సులు పూర్తిచేసిన వారికి విదేశాల్లో మంచి ఉన్నత అవకాశాలు ఉన్నాయని కళాశాలల యాజమాన్యాలు ఊ దరగొట్టాయి. ఎంసెట్ కౌన్సెలింగ్ ద్వారా సీట్లు, విశ్వ వి ద్యాలయాల అనుబంధ కళాశాలల్లో అభ్యసనం కోసం వి ద్యార్థులను తల్లిదండ్రులు లక్షలు పోసి చేర్పుతు న్నారు. ఆంధ్ర, ఇతర రాష్ట్రాలు కూడా తెలంగాణ ప్రభుత్వాన్ని అనుసరిస్తున్నాయి. పాకిస్థాన్, శ్రీలంక, బంగ్లాదేశ్‌లతో సహా అన్ని ఇతర దేశాలు తమ ఆసు పత్రులలో డ్రగ్ థెరాపెటిక్ కమిటీలను నియమించడం తప్పనిసరి చేశా యి, కానీ మన ప్రభుత్వం మాత్రం ఇలా ంటి పద్ధతిని అనుసరించడం లేదు. వాస్తవానికి కేంద్ర ప్రభుత్వ పరిధి లోని ఫార్మసి కౌన్సిల్ ఆఫ్ ఇండియా అనుమతినిచ్చిన మేరకు ఆరేండ్ల ఫార్మా డీ కోర్సును పూర్తి చేసిన వారికి ప్రభుత్వంలో ఉద్యోగాలు లేవు. నాలుగేండ్ల బీ ఫార్మసీ చే సిన వారికి ఉన్న గుర్తింపు ఫార్మా డీ చేసిన వారికి లేకపో వడం విచారించదగ్గ విషయం. రాష్ట్రంలో సుమారు 15,000ల పీహెచ్‌సీలు, ఆసుపత్రులు ఉన్నప్పటికీ, ఆ సుపత్రులలో ఔషధాలను అదుపు చేసే ఉద్యోగ నియా మకాలు జరగవు. ప్రతి ఆసుపత్రిలో డ్రగ్ థెరాపెటిక్ కమిటీలను స్థాపించడానికి ప్రభుత్వం ఒక చట్టాన్ని రూపొం దించాలి. అన్ని ఆసుపత్రులలో ఫార్మసిస్టులు ఉండేలా చూడాలి. ఫీజు రీయింబర్స్‌మెంట్ వలన పూర్తిగా లాభం పొందుతోంది కాలేజీలు మాత్రమే, విద్యార్థులు కాదు. విద్యార్థులకు మేలు జరగాలంటే ఉపాధి కల్పించే విద్యగా ఫార్మసీ విద్యను తయారు చేయాలి. దశాబ్దాలు గడిచిపోతున్నా ఫార్మసిస్టులను ఆర్ఎంపీల స్థాయికన్నా పైకి తీసుకురాలేకపోతున్నారు. విద్యా వ్యవస్థ, ఉపాధి కల్పనలలో మేలుకరమైన మార్పులు చేయకపోవడం విద్యార్థులను మోసగించటమే.

సెల్ : 9440336771

రచయితలకు సూచనలు

ఇక్కడ వ్యక్తమయ్యే అభిప్రాయాలు వ్యాసకర్తల వ్యక్తిగతం. 4000 క్యారెక్టర్ల లోపు ఉన్న వ్యాసాలకు ప్రాధాన్యత ఉంటుంది. ప్రజాసమస్యలపై రాసిన వ్యాసాలకు ప్రాధాన్యత ఉంటుంది. వ్యాస రచయితలు వారి ఫొటో, సెల్‌నెంబర్ ఇవ్వాలి. ప్రత్యేక సందర్భానికి సంబంధించిన వ్యాసమైతే దానిని గురించి కవరింగ్ లెటర్ రాయండి. వ్యాసం మొదటి పేజీ మీద పంపిస్తున్న తేదీ వేయండి.

వ్యాస రచయితలు తమ వ్యాసంతోపాటు పూర్తి పోస్టల్ చిరునామా కూడా పంపించాలని కోరుతున్నాం. ఇప్పటికే వ్యాసాలు పంపినవారు కూడా తమ అడ్రెస్‌లు పోస్టల్ ద్వారా గానీ, మెయిల్ ద్వారా గానీ పంపించాలని మనవి.


- ఎడిటర్

మీ రచనలు పంపవలసిన చిరునామా :

email: vedika@ navatelangana.com Postal Addres: M.H.Bhavan,plot No,21/1, Azamabad, Near RTC Kalayana mandapam,Hyderabad500020.
Ph:27665420,27673787,9490099077/78.
Fax:040-27652228














సినీ విశ్లేషకుల జోస్యాన్ని దాదాపు నిజం చేస్తూ 91వ అకాడమీ అవార్డుల (ఆస్కార్) నామినేషన్ల తుది జాబితా వెలువడటంతో రోజు రోజుకి ఆస్కార్ హీట్ మరింత పెరిగిపోతోంది. ఆస్కార్ బరిలో నిలిచే విజేతలెవరనే ఉత్సుకత అందరిలోనూ ఉంది. ఈనెల 24న అంగరంగ వైభవంగా జరగబోయే ఆస్కార్ పురస్కార ప్రదానోత్సవం కోసం హాలీవుడ్‌లోని డాల్బీ థియేటర్ ముస్తాబవుతోంది.









ఉత్తమ చిత్రాల విభాగంలో పోటీ పడుతున్న చిత్రాలు

బ్లాక్ పాంథర్

కెప్టెన్ అమెరికా సివిల్ వార్ తర్వాత కింగ్ టి చల్లా తన వాకండా రాజ్యానికి తిరిగి వస్తాడు. తన దేశ ప్రజలను లీడ్ చేస్తూ భవిష్యత్‌ని సరికొత్తగా అభివృద్ధి చేసేందుకు ప్రయత్నిస్తుంటారు. కానీ తన తండ్రి చేసిన కొన్ని తప్పిదాల వల్ల అతని శత్రువుల పిల్లలు టి.చల్లాని, అతని దేశాన్ని నాశనం చేయాలని ప్రయత్నిస్తుంటారు. కొత్తగా పుట్టుకొచ్చిన శత్రువులను లీడర్ టి.చల్లా, అత్యంత శక్తింతమైన అతని టీమ్ ఎలా ఎదుర్కొందనే కథాంశంతో తెరకెక్కిన చిత్రమిది. మార్వెల్ సంస్థ నుంచి వచ్చిన 18వ అమెరికన్ సూపర్ హీరో చిత్రమిది. ర్యాన్ కూగ్లర్ దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమాలో టి.చల్లా పాత్రలో చాడ్విక్ బోస్మాన్ నటించగా, ప్రధాన పాత్రల్లో మైఖేల్ బి. జోర్డాన్, టుపిటా న్యెంగ్వో, డానై గురిరా, మార్టిన్ ఫ్రీమాన్, డానియల్ కలుయా తదితరులు ఇతర కీలక పాత్రల్లో నటించారు. ఇది ఉత్తమ చిత్రంతోపాటు మరో ఆరు విభాగాల్లో ఆస్కార్ బరిలో ఉంది.

బ్లాక్‌క్లాన్స్‌మ్యాన్

ఆఫ్రికన్-అమెరికన్ పోలీస్ అధికారి రాన్ స్టాల్‌వార్త్ జీవితం ఆధారంగా రూపొందించిన చిత్రమిది. కోలోరాడో స్ప్రింగ్స్ పట్టణంలోకి అక్రమంగా చొరబడుతున్న 'కు క్లక్స్ క్లాన్' (కేకేకే) టెర్రరిస్టులను అంతం చేసేందుకు రాన్ స్టాల్‌వార్త్ ఓ మిషన్ చేపడతారు. అత్యంత ప్రమాదకరమైన ఈ మిషన్‌ని తను ఎలా ఛేదించాడనే ఇతివృత్తంతో బయోగ్రాఫికల్ కామెడీగా రూపొందిన చిత్రమిది. స్పైక్ లీ దర్శకత్వం వహించారు. పోలీస్ అధికారి రాన్ స్టాల్‌వార్త్ రియల్ లైఫ్‌లో రాసిన పుస్తకం ఆధారంగా ఈ సినిమాను తెరకెక్కించారు. రాన్ స్టాల్‌వార్త్ పాత్రలో జాన్ డేవిడ్ వాషింగ్టన్ నటించారు. ఇది ఉత్తమ చిత్రంతోపాటు మరో ఐదు విభాగాల్లో ఆస్కార్ బరిలో ఉంది.

ది ఫేవరేట్

ఇది ఇద్దరి ఫ్రెండ్స్ మధ్య అధికారం కోసం జరిగే సంఘర్షణ నేపథ్యంలో సాగే హిస్టారికల్ పీరియడ్ కామెడీ డ్రామా. క్వీన్ అన్నే నుంచి సింహాసనాన్ని తన స్నేహితురాలు సారా పక్కా ప్లానింగ్ చేసి చేజిక్కించుకుంటుంది. ఆ తర్వాత ఎంటర్ అయిన సారా కజిన్ అబిగైల్ హిల్‌కి, సారాకు మధ్య తలెత్తిన వివాదం ఎలాంటి పరిణామాలకు దారితీసిందనేది ఆసక్తికరం. 18వ శతాబ్దం బ్యాక్‌డ్రాప్‌లో సాగే ఈ చిత్రానికి యోర్గాస్ లాంథిమాస్ దర్శకత్వం వహించారు. ఈ జనవరి 1న యుకేలో, గతేడాది నవంబర్‌లో అమెరికాలో విడుదలైన ఈ సినిమా కలెక్షన్ల పరంగా పర్వాలేదనిపించుకున్నప్పటికీ క్రిటికల్‌గా మంచి ప్రశంసలందుకుంది. అబిగైల్ హిల్‌గా ఎమ్మా స్టోన్, క్వీన్ అన్నెగా ఒలివర్ కాల్మన్, సారా పాత్రలో రచెల్ వైజ్ నటించి మంత్రముగ్ధుల్ని చేశారు. ఈ చిత్రం ఇప్పటికే వెనిస్ వంటి పలు అంతర్జాతీయ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ప్రదర్శించబడింది. పలు విభాగాల్లో గోల్డెన్ గ్లోబ్ అవార్డులకు నామినేట్ అయి ఒలివర్ కాల్మన్ ఉత్తమ నటిగా అవార్డు గెలుచుకున్నారు. ప్రస్తుతం ఉత్తమ చిత్రంతోపాటు మరో ఎనిమిది విభాగంలో ఆస్కార్ కోసం పోటీపడుతుంది.

వైస్

ఆస్కార్ రేసులో ఉన్న చిత్రంలో ఇది ప్రముఖంగా ఉంది. జార్జ్ డబ్ల్యు బుష్ అమెరికా అధ్యక్షుడిగా ఉన్న సమయంలో వైస్ ప్రెసిడెంట్‌గా పనిచేసిన డిక్ చెనీ జీవితం ఆధారంగా రూపొందించిన చిత్రమిది. ఓ సాధారణ ఉద్యోగి, అమెరికాకు వైస్ ప్రెసిడెంట్‌గా ఎంపిక కావడంతోపాటు అత్యంత శక్తివంతమైన వ్యక్తిగా తన బాధ్యతలను నిర్వర్తించి అమెరికా పాలనా వ్యవస్థలో ఓ సరికొత్త మార్పులకు పునాది వేసిన వ్యక్తిగా డిక్ చెనీ పేరుగాంచారు. ఆయనపై ఈ బయోగ్రాఫికల్ కామెడీ చిత్రాన్ని దర్శకుడు ఆడమ్ మెక్ కే రూపొందించారు. చెనీ పాత్రలో క్రిస్టియన్ బాలె నటించారు. ఈ చిత్రాన్ని బ్రాడ్ పిట్, డెడె గార్డెనర్, జెరెమీ క్లీనర్, ఆడమ్ మెక్ కే సంయుక్తంగా నిర్మించడం విశేషం. ఇప్పుడు ఉత్తమ చిత్ర విభాగంతోపాటు మరో ఏడు విభాగాల్లో ఆస్కార్ కోసం పోటీ పడుతోంది.

గ్రీన్ బుక్

1960కి చెందిన ఆఫ్రికన్ అమెరికన్ క్లాసికన్, జాజ్ పియానిస్ట్ డాన్ షిర్లే, అతని బాడీగార్డ్, కార్ డ్రైవర్ టోనీ వల్లెలాంగా మధ్య అనుబంధం, వారు చేపట్టిన టూర్‌లో చోటు చేసుకున్న ఆసక్తికర పరిణామాల సమాహారమే ఈ చిత్రం. ఈ బయోగ్రాఫికల్ కామెడీ చిత్రానికి పీటర్ పార్రెల్లీ దర్శకత్వం వహించారు. గతేడాది నవంబర్‌లో విడుదలై ఘన విజయం సాధించింది. కథ, కథనాలు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. డాన్ షిర్లీగా మహెర్షాలా అలీ, బాడీగార్డ్‌గా విగ్గో మోర్టెన్సన్ నటన కట్టిపడేస్తుంది. ఈ ఏడాదికిగానూ ఉత్తమ చిత్రంతోపాటు మరో నాలుగు విభాగాల్లో ఆస్కార్ బరిలో నిలిచింది.

రోమా

1970-71 మధ్య మెక్సికోలోని హౌస్ కీపర్స్‌గా పనిచేసే ఓ మధ్య తరగతి ఫ్యామిలీ జీవనం ఎలా సాగింది?, వారి కుటుంబం ఎలాంటి గందరగోళానికి గురైంది?, అందుకు కారణమేంటి? వారి జీవితంలోని భావోద్వేగాలు, ఆశలు, ఆనందాలను తెలిపే కథాంశంతో ఆద్యంతం డ్రామాగా రూపొందిన చిత్రం 'రోమా'. 'చిల్డ్రన్ ఆఫ్ మెన్', 'గ్రావిటీ' వంటి సంచలనాత్మక చిత్రాలను రూపొందించిన దర్శకుడు ఆల్ఫోన్సో క్యారోన్ ఈ చిత్రాన్ని తెరకెక్కించారు.వెనిస్ ఫెస్టివల్‌లో ప్రదర్శించబడి ప్రశంసలందుకుంది. ఇటీవల గోల్డెన్ గ్లోబ్ అవార్డులకు నామినేట్ అయి ఉత్తమ దర్శకుడుతోపాటు ఫారెన్ లాంగ్వేజ్ విభాగంలో అవార్డుని అందుకుంది.ఈ ఏడాదికిగానూ ఉత్తమ చిత్రంతోపాటు మరో తొమ్మిది విభాగాల్లో అకాడమీ అవార్డులకై పోటీ పడుతుంది.

ఏ స్టార్ ఈజ్ బోర్న్

తాగుడుకి బానిసైన ఓ మ్యూజిషియన్ తనని తాను వెతుక్కునే క్రమంలో ఓ యువ గాయనితో ప్రేమలో పడతాడు. ఆ తర్వాత అతని జీవితం ఎలాంటి మలుపులు తిరిగిందనే కథాంశంతో రూపొందిన మ్యూజికల్ రొమాంటిక్ డ్రామా 'ఏ స్టార్ ఈజ్ బోర్న్'. నటుడు బ్రాడ్లీ కూపర్ ఈ చిత్రంతో దర్శకుడిగా మారడం విశేషం. ఇందులో మ్యూజీషియన్‌గా బ్రాడ్లీ కూపర్, అతని లవర్‌గా లేడీ గాగా నటించి మంత్రముగ్ధుల్ని చేశారు. ఈ సినిమా 1937లో అదే పేరుతో వచ్చిన చిత్రానికి రీమేక్. ఆ తర్వాత 1954లో, 1976లో రీమేక్ చేశారు. ఆ రెండు సినిమాలు విజయం సాధించాయి. ప్రస్తుతం ఉత్తమ చిత్రంతోపాటు మరో 7 విభాగాల్లో పోటీ పడుతోంది.

బోహెమియన్ రాప్సోడీ

బ్రిటీష్ రాక్ బ్యాండ్ 'క్వీన్' స్థాపకుడు, ప్రముఖ సింగర్, సాంగ్ రైటర్, రికార్డు ప్రొడ్యూసర్ ఫ్రెడ్డీ మెర్క్యూరీ జీవితం ఆధారంగా, ఆయన తన క్వీన్ రాక్‌బ్యాండ్‌తో 1985లో వెంబ్లే స్టేడియంలో నిర్వహించిన లైవ్ ఎయిడ్ పర్‌ఫెర్మార్సెన్స్ ప్రధానంగా రూపొందిన చిత్రం 'బోహెమియన్ రాప్సోడీ'. బయోగ్రాఫికల్ మ్యూజికల్ కామెడీగా రూపొందిన ఈ చిత్రానికి బ్రియాన్ సింగర్ దర్శకత్వం వహించారు. ఫ్రెడ్డీ పాత్రలో రమి మలెక్ అత్యద్భుత నటనతో మంత్రముగ్ధుల్ని చేశారు. గతేడాది అక్టోబర్‌లో యుకేలో, నవంబర్‌లో అమెరికాలో విడుదలైన ఈ సినిమా సంచలన విజయాన్ని సాధించింది. కేవలం 50 మిలియన్ డాలర్లతో తెరకెక్కి ఏకంగా 744 మిలియన్ డాలర్లను వసూలు చేసింది. ఇదిప్పుడు ఉత్తమ చిత్రంతోపాటు మరో నాలుగు విభాగాల్లో ఆస్కార్ బరిలో నిలిచింది.

ఉత్తమ నటుడు విభాగంలో పోటీ పడుతున్న నటులు



క్రిస్టియన్ బాలే (వైస్), బ్రాడ్లీ కూపర్ (ఏ స్టార్ ఈజ్ బోర్న్), రమి మాలెక్ (బోహెమియన్ రాప్సోడి), విగ్గో మోర్టెన్సెన్ (గ్రీన్ బుక్), విలియమ్ డాఫోయి (ఎట్ ఎటర్నిటీస్ గేట్)


ఉత్తమ నటి విభాగంలో పోటీ పడుతున్న నటీమణులు





యాలిటా అపరారియో(రోమా), గ్లెన్ క్లోజ్ (ది వైఫ్), ఒలివియా కోల్మన్ (ది ఫేవరేట్), లేడీ గాగా (ఏ స్టార్ ఈజ్ బోర్న్), మిలిస్సా మెక్‌కార్తీ (కెన్ యు ఎవర్ ఫర్‌గీవ్ మీ?)


ఆస్కార్ బరిలో విజేతలెవరు?

ఉత్తమ విదేశీ విభాగంలో పోటీ పడుతున్న సినిమాలు







ఉత్తమ నటుడు

క్రిస్టియన్ బాలే: అమెరికన్ మెథడ్ యాక్టర్. 'ఎంపైర్ ఆఫ్ ది సన్', 'అమెరికన్ సైకో', 'లిటిల్ ఉమెన్', 'ది మెకనిస్ట్', 'ది డార్క్ నైట్', 'ది డార్క్ నైట్ రైసెస్', 'ది ప్రెస్టేజ్', 'టెర్మినేటర్ సాల్వేషన్', 'ది ఫైటర్', 'ది బిగ్ షార్ట్', 'వైస్' వంటి సూపర్ హిట్ చిత్రాల్లో నటించారు. 'ది ఫైటర్' చిత్రానికి సహాయ నటుడిగా ఆస్కార్ అందుకున్నారు. ఇప్పుడు 'వైస్' చిత్రం కోసం మరోసారి ఆస్కార్ బరిలో ఉన్నారు.

బ్రాడ్లీ కూపర్: హయ్యస్ట్ పెయిడ్ యాక్టర్, దర్శకుడు. 'వెడ్డింగ్ క్రాషర్స్', 'ది హ్యాంగోవర్', 'లిమిట్‌లెస్', 'సిల్వర్ లైనింగ్స్ ప్లేబుక్', 'అమెరికన్ హాస్టిల్', 'అమెరికన్ స్నిప్పర్', 'గార్డియన్స్ ఆఫ్ ది గాలాక్సీ', 'అవెంజర్స్: ఇన్ఫినిటీ వార్' వంటి హిట్ చిత్రాల్లో నటించి స్టార్ హీరోగా ఎదిగారు. ప్రస్తుతం 'ఏ స్టార్ ఈజ్ బోర్న్' చిత్రానికిగానూ ఉత్తమ నటుడిగా, స్క్రీన్‌ప్లే రైటర్‌గా ఆస్కార్‌కి పోటీపడుతున్నారు. గతంలో 'సిల్వర్ లైనింగ్స్ ప్లేబుక్', 'అమెరికన్ హాస్టిల్', 'అమెరికన్ స్నిప్పర్' చిత్రాలకి ఆస్కార్‌కి నామినేట్ అయ్యారు.

విలియమ్ డాఫోయి: అమెరికన్ హై ప్రొఫైల్ యాక్టర్. 'ది లవ్‌లెస్', 'ప్లాటూన్', 'షాడో ఆఫ్ ది వాంపైర్', 'స్పైడర్ మ్యాన్', 'వన్స్ ఆపాన్ ఏ టైమ్ ఇన్ మెక్సికో', 'ట్రిబులెక్స్: స్టేట్ ఆఫ్ ది యూనియన్', 'ది గ్రేట్ వాల్' వంటి సక్సెస్‌ఫుల్ చిత్రాల్లో నటించి మెప్పించారు. గతంలో 'ప్లాటూన్', 'షాడో ఆఫ్ ది వాంపైర్', 'ది ఫ్లోరిడా ప్రాజెక్ట్' చిత్రాలకి ఆస్కార్‌కి నామినేటైన ఆయన ఈసారి కూడా 'ఎట్ ఎటర్నిటీ గేట్' చిత్రం కోసం ఆస్కార్ పోటీలో ఉన్నారు.

రమి మాలెక్: అమెరికన్ నటుడు. 'బ్యాటిల్‌షిప్', 'ది మాస్టర్', 'ది ట్విలైట్ సాగా: బ్రేకింగ్ డాన్ పార్ట్ 2', 'ఓల్డ్ బాయ్', 'నీడ్ ఫర్ స్పీడ్'తోపాటు 'బోహెమియన్ రాప్సోడీ' వంటి చిత్రాల్లో నటించి మెప్పించారు. తొలిసారిగా 'బోహెమియన్ రాప్సోడీ' చిత్రానికిగానూ ఉత్తమ నటుడిగా ఆస్కార్ బరిలో ఉన్నారు.

విగ్గో మార్టెన్సెన్: డానిస్-అమెరికన్ నటుడు, నిర్మాత, రచయిత, మ్యూజిషియన్, డైరెక్టర్, ఫొటోగ్రాఫర్. 'విట్‌నెస్', 'ది ఇండియన్ రన్నర్', 'క్రిమ్సన్ టైడ్', 'సైకో', 'ఏ పర్‌ఫెక్ట్ మర్డర్', 'ఏ వాక్ ఆన్ ది మూన్', 'ది లార్డ్ ఆఫ్ ది రింగ్స్', 'ఈ హిస్టరీ ఆఫ్ వాయిలెన్స్', 'ఎస్టర్న్ ప్రామిసెస్', 'ఏ డేంజరస్ మెథడ్', 'గ్రీన్‌బుక్' చిత్రాల్లో నటించి మెప్పించాడు. గతంలో 'ఎస్టర్న్ ప్రామిసెస్', 'కెప్టెన్ ఫంటాస్టిక్' చిత్రాలకి ఆస్కార్‌కి నామినేట్ అయ్యారు. ఇప్పుడు 'గ్రీన్ బుక్' చిత్రంతో మరోసారి ఆస్కార్ పోటీలో తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు.

ఉత్తమ కథానాయిక..

యాలిటా అపరారియో: హీరోయిన్‌గా మారి నటించిన తొలి చిత్రం 'రోమా'. మంచి విజయంతోపాటు విమర్శకుల ప్రశంసలందుకుని ఇప్పుడు ఉత్తమ నటిగా తొలి సినిమాతోనే ఈ మెక్సికన్ నటి ఆస్కార్ బరిలో నిలవడం విశేషం.

గ్లెన్ క్లోజ్: అమెరికన్ నటి, నిర్మాత. 'ది వరల్డ్ ఎకార్డింగ్ టు గార్ప్', 'ది బిగ్ చిల్', 'ది నేచురల్', 'ఫాటల్ అట్రాక్షన్', 'డేంజరస్ లియాసన్స్', 'ఆల్బర్ట్ నాబ్స్' చిత్రాలతో అగ్ర నటిగా ఎదిగారు. 'ది వైఫ్' చిత్రం కోసం ఆస్కార్ పోటీలో ఉన్నారు.

ఒలివియా కోల్మన్: బ్రిటీష్ నటి. 'హాట్ ఫుజ్', 'ది ఐరన్ లేడీ', 'హైడ్ పార్క్ ఆన్ హడ్సన్', 'లాకీ', 'ది థర్టీన్త్ టేల్', 'ది లాబ్‌స్టర్' చిత్రాలతో మంచి విజయాలను అందుకుని అగ్ర నటిగా ఎదిగిన ఆమె ఇప్పుడు తొలిసారి 'ది ఫేవరేట్' చిత్రానికి ఉత్తమ నటిగా ఆస్కార్ కోసం ఉత్తమ కథానాయిక విభాగంలో పోటీ పడుతోంది.

లేడీ గాగా: అమెరికన్ సంగీతం సంచలనం. అద్భుత నటి. పాప్ సింగర్‌గా పాపులర్ అయిన ఆమె పాటల విభాగంలో రెండుసార్లు ఆస్కార్‌కి నామినేట్ అయ్యారు. నటిగా తొలిసారి 'ఏ స్టార్ ఈజ్ బోర్న్' చిత్రానికి పోటీపడుతున్నారు.

మిలిస్సా మెక్‌కారీ: అమెరికన్ నటి, నిర్మాత, కమెడీయన్, ఫ్యాషన్ డిజైనర్. 'బ్రైడ్స్ మెయిడ్స్', 'ది హీట్', 'టమ్మీ', 'స్పై', 'ది హ్యాపీటైమ్ మర్డర్స్', 'కెన్ యు ఎవర్ ఫర్‌గీవ్ మీ?' చిత్రాలతో అగ్ర నటిగా ఎదిగారు. గతంలో 'బ్రైడ్స్ మెయిడ్స్' చిత్రానికి సహాయ నటిగా ఆస్కార్‌కి నామినేట్ అయ్యారు. ఇప్పుడు 'కెన్ యు ఎవర్ ఫర్‌గీవ్ మీ' చిత్రానికి మరోసారి పోటీ పడుతున్నారు.

ఉత్తమ సహాయ నటుడు

మహేర్షాల అలీ (గ్రీన్ బుక్), **సామ్ ఎలైట్** (ఏ స్టార్ ఈజ్ బోర్న్), **రిచర్డ్ ఈ. గ్రాంట్** (కెన్ యు ఎవర్ ఫర్‌గీవ్ మీ?), **ఆడమ్ డ్రైవర్** (బ్లాక్ క్లాన్స్‌మ్యాన్), **సామ్ రాక్‌వెల్** (వైస్)

ఉత్తమ సహాయ నటి

అమీ ఆడమ్స్ (వైస్), **మారినా డె టవిరా** (రోమా), **రెజినా కింగ్** (ఇఫ్ బీలే స్ట్రీట్ కుడ్ టాక్), **ఎమ్మా స్టోన్** (ది ఫేవరేట్), **రాచెల్ వీజ్** (ది ఫేవరేట్).

బెస్ట్ అడాప్టెడ్ స్క్రీన్‌ప్లే

బ్రాడ్లీ కూపర్, విల్ పెట్టర్స్, ఎరిక్ రోత్ (ఏ స్టార్ ఈజ్ బోర్న్), **నికోల్ హోల్ఫెంనర్, జెఫ్ విట్టీ** (కెన్ యు ఎవర్ ఫర్‌గీవ్ మీ?), **స్పైక్ లీ, చార్లీ వాచ్టెల్, డేవిడ్ రాబినోవిట్జ్, కెవిన్ విల్మోట్** (బ్లాక్‌క్లాన్స్‌మ్యాన్), **జియోల్ కోయిన్, ఎతాన్ కోయిన్** (ది బ్యాల్డ్ ఆఫ్ బస్టర్ స్క్రగ్స్), **బ్యారీ జెంకిన్స్** (ఇఫ్ బీలె స్ట్రీట్ కుడ్ టాక్).

బెస్ట్ ఒరిజినల్ స్క్రీన్‌ప్లే

ఆడమ్ మెక్ కే (వైస్), **ఆల్ఫోన్సో కారోన్** (రోమా), **డెబోరా డేవిస్, టోనీ మక్నామరా** (ది ఫేవరేట్), **పాల్ స్ర్టేడర్** (ఫస్ట్ రిఫామ్డ్), **నిక్ వాల్లెలాంగ, బ్రియాన్ హెయిస్ క్యూరీ, పీటర్ ఫారెల్లీ** (గ్రీన్ బుక్).

బెస్ట్ సినిమాటోగ్రఫీ

అల్ఫోన్సో కారోన్ (రోమా), రాబీ ర్యాన (ది ఫేవరేట్), లుకాజ్ జాల్ (కోల్డ్‌వార్), కాలెబ్ డిస్‌చానెల్ (నెవర్ లుక్ అవే), మాథ్యూ లిబటిక్యూ (ఏ స్టార్ ఈజ్ బోర్న్).

బెస్ట్ ఎడిటింగ్

యార్గాస్ మావ్‌రోప్సారిడిస్ (ది ఫేవరేట్), **బ్యారీ అలెగ్జాండర్ బ్రౌన్** (బ్లాక్ క్లాన్స్‌మ్యాన్), **జాన్ ఒట్టామ్యాన్** (బొహెమియన్ రాప్సోడీ), **ప్యాట్రిక్ జె డాన్ విటో**(గ్రీన్ బుక్), **హ్యాంక్ కోర్విన్** (వైస్).



ఉత్తమ దర్శకులు

స్పైక్ లీ: జాతి సంబంధాలు, నల్లజాతీయుల వర్గీకరణ, సమకాలీన జీవితంలో మీడియా పాత్ర, పేదరికం, రాజకీయ సమస్యలు ఇతివృత్తంగా 'డు ది రైట్ థింగ్', 'మాల్‌కోమ్ ఎక్స్', 'ది ఒరిజినల్ కింగ్స్ ఆఫ్ కామెడీ', 'ఇన్‌సైడ్ మ్యాన్', 'చి రాక్', 'బ్లాక్‌క్లాన్స్‌మ్యాన్' వంటి సినిమాలతో మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. గతంలో 'దు ది రైట్ థింగ్', '4 లిటిల్ గర్ల్స్' (డాక్యుమెంటరీ)కి స్క్రీన్‌ప్లే విభాగం నామినేట్ అయ్యారు. ప్రస్తుతం 'బ్లాక్‌క్లాన్స్‌మ్యాన్' కోసం ఉత్తమ చిత్రం, దర్శకుడు, స్క్రీన్‌ప్లే విభాగంలో మరోసారి పోటీపడుతున్నారు.

పావెల్ పావ్లికోవిస్కీ: పొలిష్ ఫిల్మ్ మేకర్. 'లాస్ రీసార్ట్', 'మై సమ్మర్ ఆఫ్ లవ్', 'ఇడా', 'కోల్డ్‌వార్' వంటి హిట్ చిత్రాలను తెరకెక్కించారు. 'ఇడా' చిత్రానికి విదేశీ విభాగంలో ఆస్కార్ అందుకున్నారు. ఇప్పుడు ఉత్తమ దర్శకుడు, ఉత్తమ విదేశీ చిత్రం విభాగంలో ఆస్కార్ కోసం పోటీ పడుతున్నారు.

యార్గాస్ లాంథిమస్: గ్రీక్ డైరెక్టర్, ప్రొడ్యూసర్. 'డాగ్‌టూత్', 'ఆల్ప్స్', 'ది లబ్‌స్టర్', 'ది కిల్లింగ్ ఆఫ్ ఏ సాక్రెడ్ డీర్', 'ది ఫేవరేట్' వంటి హిట్ చిత్రాలను రూపొందించారు. గతంలో 'డాగ్‌టూత్' చిత్రానికి విదేశీ విభాగంలో, 'ది లాబ్‌స్టర్'కి స్క్రీన్‌ప్లే విభాగంలో ఆస్కార్‌కి నామినేట్ అయ్యారు. ఇప్పుడు 'ది ఫేవరేట్'కిగానూ ఉత్తమ చిత్రం, దర్శకత్వం విభాగంలో బరిలో ఉన్నారు.

ఆల్ఫోన్సో క్యారోన్: మెక్సికన్ దర్శకుడు, నిర్మాత, ఎడిటర్. 'ఏ లిటిల్ ప్రిన్సెస్', 'చిల్డ్రన్ ఆఫ్ మెన్', 'హ్యారీ పొట్టర్ అండ్ ది ప్రిజనర్ ఆఫ్ అజ్కబన్', 'గ్రావిటీ', 'రోమా' వంటి హిట్ చిత్రాలను తెరకెక్కించారు. 'గ్రావిటీ' చిత్రానికి ఉత్తమ దర్శకుడు, ఎడిటింగ్ విభాగంలో రెండు ఆస్కార్‌లు అందుకున్నారు. ఇప్పుడు 'రోమా'కిగానూ ఉత్తమ చిత్రం, దర్శకుడు, స్క్రీన్‌ప్లే, సినిమాటోగ్రఫీ విభాగాల్లో ఆస్కార్ కోసం అమీతుమీ తెల్చుకునేందుకు రెడీగా ఉన్నారు.

ఆడమ్ మెక్ కే: అమెరికన్ దర్శకుడు, నిర్మాత, నటుడు. 'స్టెప్ బ్రదర్స్', 'ది అదర్ గాయ్స్', 'ఆంకోర్మన్2: ది లెజెండ్ కంటిన్యూస్', 'ది బిగ్ షార్ట్' వంటి సినిమాలతో విజయాలను అందుకున్నారు. 'ది బిగ్ షార్ట్'కిగానూ స్క్రీన్‌ప్లే విభాగంలో ఆస్కార్‌ని దక్కించుకున్నారు. 'వైస్' కోసం ప్రస్తుతం ఉత్తమ చిత్రం, దర్శకత్వం, స్క్రీన్‌ప్లే విభాగంలో బరిలో ఉన్నారు.

బెస్ట్ యానిమేటెడ్ ఫిల్మ్స్

'ఇంక్రిడిబుల్స్ 2', 'ఐల్ ఆఫ్ డాగ్స్', 'మిరాయి', 'రాల్ఫ్ బ్రేక్స్ ది ఇంటర్నెట్', 'స్పైడర్ మ్యాన్: ఇన్ టూ ది స్పైడర్ వర్స్'.

బెస్ట్ యానిమేటెడ్ షార్ట్ ఫిల్మ్

'యానిమల్ బిహేవియర్', 'బావో', 'లేట్ ఆఫ్టర్‌నూన్', 'వన్ స్మాల్ స్టెప్', 'వీకెండ్స్'. బెస్ట్ డాక్యుమెంటరీ ఫీచర్ ఫిల్మ్.. 'ఫ్రీ సోలో', 'మైండింగ్ ది గ్యాప్', 'ఆఫ్ ఫాదర్స్ అండ్ సన్స్', 'హలె కౌంటీ దిస్ మార్నింగ్, ది ఈవినింగ్', 'ఆర్‌బీజీ'.

బెస్ట్ ఫారెన్ లాంగ్వేజ్ ఫీచర్ ఫిల్మ్

'కపెర్నమ్' **(లెబనాన్)**, 'కోల్డ్ వార్' **(పోలాండ్)**, 'రోమా' **(మెక్సికో)**, 'నెవర్ లుక్ అవే' **(జర్మనీ)**, 'షాప్‌లిఫ్టర్' **(జపాన్)**.

బెస్ట్ ఒరిజినల్ స్కోర్

టెరెన్స్ బ్లాంచర్డ్ (బ్లాక్క్ క్లాస్మన్), **నికోలస్ బ్రిటెల్** (ఇఫ్ బీలే స్ట్రీట్ కుడ్ టాక్), **అలెగ్జాండర్ డెస్ప్లాట్** (ఐల్ ఆఫ్ డాగ్స్), **మార్క్ షిమాన్,** **స్కాట్ విట్‌మ్యాన్** (మేరీ పాప్పిన్స్ రిటర్న్స్), **లుడ్విగ్ గోరాన్సన్** (బ్లాక్ పాంథర్).

బెస్ట్ ఒరిజినల్ సాంగ్

'ఆల్ ది స్టార్స్' (కెంద్రిక్ ల్యామర్, ఆల్ షుక్స్, సౌన్‌వేవ్, ఆంథోని టిఫ్ఫిత్-బ్లాక్ పాంథర్), 'ఐ విల్ ఫైట్' (డియానె వర్రెన్- ఆర్‌బీజీ), 'ది ప్లేస్ వేర్ లాస్ట్ థింగ్స్ గో' (మార్క్ షైమ్యాన్, స్కాట్ విట్ట్‌మ్యాన్ - మేరీ పాపిన్స్ రిటర్న్స్), 'షాలో' (లేడీ గాగా, మార్క్ రాన్సన్, ఆంథోని రాస్సోమాండో, ఆండ్రూ వైట్- ఏ స్టార్ ఈజ్ బోర్న్), 'ది ప్లేస్ వేర్ లాస్ట్ థింగ్స్ గో' (మార్క్ షైమ్యాన్, స్కాట్ విట్ట్‌మ్యాన్- మేరీ పాపిన్స్ రిటర్న్స్).

బెస్ట్ సౌండ్ ఎడిటింగ్

ఐ లింగ్ లీ, మిల్‌డ్రెడ్ లాట్రౌ మోర్గన్ (ఫస్ట్ మ్యాన్), ఎథన్ వాన్ డర్ రైన్, ఎరిక్ ఆడల్హా (ఈ క్వైట్ ప్లేస్), బెంజమిన్ ఏ బుర్ట్, స్టీవ్ బోయిడ్డకర్ (బ్లాక్ పాంథర్), జాన్ వార్‌హర్స్ట్ (బోహెమియన్‌రాప్సోడీ), సెర్గియోడియాజ్, స్కిప్‌లీవ్సే (రోమా).

బెస్ట్ సౌండ్ మిక్సింగ్

'ఫస్ట్ మ్యాన్', 'ఏ స్టార్ ఈజ్ బోర్న్', 'బ్లాక్ పాంథర్', 'బోహెమియన్ రాప్సోడీ', 'రోమా'

బెస్ట్ విజువల్ ఎఫెక్ట్స్

'అవెంజర్స్: ఇన్ఫినిటీ వార్', 'క్రిస్టోఫర్ రాబిన్', 'ఫస్ట్ మ్యాన్', 'రెడీ ప్లేయర్ వన్', 'సోలో: ఏ స్టార్ వార్స్ స్టోరీ'

బెస్ట్ డాక్యుమెంటరీ షార్ట్ సబ్జెక్ట్

'బ్లాక్ షీప్', 'ఎండ్ గేమ్', 'లైఫ్‌బోట్', 'ఏ నైట్ ఎట్ ది గార్డెన్', 'పీరియడ్.ఎండ్ ఆఫ్ సెంటెన్స్'


బెస్ట్ లైవ్ యాక్షన్ షార్ట్ ఫిల్మ్

'డిటైన్‌మెంట్', 'ఫావె', 'మార్గ్గారిట్', 'మదర్', 'స్కిన్'.


ఉత్తమ దర్శకత్వం విభాగంలో పోటీ పడుతున్న దర్శకులు



ఆల్ఫోన్సో క్యారాన్ (రోమా)




యార్గాస్ లాంథిమాస్ (ది ఫేవరేట్)



స్పైక్‌లీ (బ్లాక్‌క్లాన్స్‌మ్యాన్)



పావెల్ పాల్లికోవిస్కీ (కోల్డ్‌వార్)



ఆడమ్ మెక్ వే (వైస్)

ఇల్లును చక్కబెట్టుకోలేనోడు.. దేశాన్నేం ఉద్ధరిస్తాడు



(మొదటిపేజీ తరువాయి)

నేతలు సైతం తోడవుతున్నారు. కానీ, రెబెల్ నేతలలాగా వీరు ప్రత్యక్షంగా ఎదురుదాడికి దిగకుండా పరోక్షంగా చురకలంటిస్తున్నారు. సొంతింటిని చక్కబెట్టుకోలేని వ్యక్తి.. ఇక దేశాన్ని ఏం ఉద్ధరిస్తారంటూ కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ చేసిన వ్యాఖ్యలు దుమారాన్ని రేపుతున్నాయి. ప్రధాని మోడీని లక్ష్యంగా చేసుకొనే ఆయన ఇలా పరోక్ష పంథాను ఎంచుకున్నట్టు గుసగుసలు వినిపిస్తున్నాయి. మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో శనివారం జరిగిన ఏబీవీపీ మాజీ కార్యకర్తల సమావేశంలో గడ్కరీ పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తాను చాలామంది ప్రజలను కలిసి మాట్లాడగా.. బీజేపీ కోసం, దేశం కోసం జీవితాలను అంకితం చేయడానికైనా సిద్ధమన్నారని తెలిపారు. కాగా.. వారిలో ఒక వ్యక్తిని 'మీరు, మీ కుటుంబీకులు ఏం చేస్తారు' అని ప్రశ్నించినట్టు చెప్పారు. దానికి ఆ వ్యక్తి సమాధానంగా.. తాను చిన్నపాటి షాపు నిర్వహించేవాడినని, నష్టం రావడంతో దాన్ని మూసివేసి ఖాళీగా ఉంటున్నట్టు తెలిపాడు. అంతేకాక.. తన భార్య, పిల్లలు ఇంట్లోనే ఉంటారని వివరించాడు. కాగా.. 'ముందు నీ కుటుంబం బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి పిల్లలను మంచిగా చూసుకో. ఆ తర్వాతే పార్టీయైనా, దేశమైనా' అని గడ్కరీ.. సదరు వ్యక్తికి సూచించారు. ఈ క్రమంలోనే ఆయన మాట్లాడుతూ.. సొంతింటిని చక్కబెట్టు కోలేని వారు దేశాన్ని బాగు చేయలేరంటూ వ్యాఖ్యానించడం గమనార్హం. హామీలు నెరవేర్చే ఏ నేతనైనా ప్రజలు అభినందిస్తారని, కానీ, అలా జరగని పక్షంలో వారు దాడికి సైతం వెనుకాడబోరంటూ గడ్కరీ కొద్ది రోజుల కిందట సంచలన వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే.

ఆ ఒప్పందమే చవక

- రాఫెల్‌లో సాంకేతిక బదలాయింపు, అదనపు హంగులకు వేలకోట్లు
- మరిన్ని యుద్ధవిమానాలు కావాలని మన రక్షణశాఖ అడిగితే..
- హెచ్ఏఎల్ ద్వారా తయారు చేసుకునేవాళ్లం కదా?
- 'ద హిందూ' పరిశోధనాత్మక అధ్యయనం వెల్లడి

రాఫెల్ కన్నా తక్కువ ధరలో మీకు యుద్ధ విమానాలు తయారుచేసి ఇస్తామని 'యూరోఫైటర్' మోడీ సర్కార్‌కు ఆఫర్ చేసింది. ఈ ఆఫరును మోడీ ప్రభుత్వం ఎందుకు కాదన్నదో తెలియదు. కనీసం ఈ ఆఫర్‌ను ఉపయోగించి ఫ్రాన్స్‌తో బేరసారాలు ఆడిఉంటే 'రాఫెల్' యుద్ధ విమాన ఒప్పందం విలువ తగ్గి ఉండేది కదా? భారత్ కోరిన అదనపు సామర్థ్యాలు, సాంకేతిక బదలాయింపుతో సహా ఏ విషయంలో చూసినా 'యూపీఏ' ఒప్పందమే సరైంది.

- 'ద హిందూ' పరిశోధన అధ్యయనం



న్యూఢిల్లీ : ఏ విధంగా చూసినా, ఎన్ని కోణాల్లో చూసినా మోడీ సర్కార్ కుదిర్చిన 'రాఫెల్ ఒప్పందం' అవకతవకగా కనిపిస్తోంది. అనేక ప్రశ్నలు, సందేహాలకు తావిస్తోందని 'ద హిందూ'పరిశోధనాత్మక వార్తా కథనం తేల్చింది. తాజా కథనం మరికొన్ని అంశాల్ని వెలుగులోకి తీసుకొచ్చింది. అవి ఈ విధంగా ఉన్నాయి, యూపీఏ కుదిర్చిన 126 రాఫెల్ యుద్ధ విమానాల కొనుగోలులో అత్యంత కీలకమైన పాయింట్ యుద్ధ విమానాల సాంకేతిక పరిజ్ఞానం బదలాయింపు. కేవలం దీనికోసమని మనం వేలకోట్లు ఫ్రాన్స్‌కు చెల్లిస్తున్నాం. సాంకేతిక బదలాయింపు విషయంలో, యూపీఏ చేసుకున్న ఒప్పందంతో పోల్చితే మోడీ సర్కార్ చేసుకున్న ఒప్పందం చాలా ఖరీదైనది. వేలకోట్లతో ముడిపడి ఉంది. యూపీఏ వెంటనే వినియోగించేందుకు వీలైన 18 రాఫెల్ జెట్లకు బేరమాడగా, ఎన్డీయే సర్కార్ 36 రాఫెల్ యుద్ధ విమానాలను కొంటోంది. అయితే, ఎన్‌డీఏ ఒప్పందంలో భారత్‌కు సాంకేతిక బదలాయింపు అన్నది లేదు. అదే యూపీఏ ఒప్పందంలో విమానాలతోపాటు సాంకేతిక బదలాయింపు ఉన్నది. అయినప్పటికీ యూపీఏ కన్నా ఎన్డీయే విమానం ఖరీదు 14శాతం ఎక్కువగా కనపబడుతోందనీ, యూపీఏ ఒప్పందంలో సాంకేతిక బదలాయింపు ఛార్జీలు తీసేస్తే ఆ విమానాల ధర ఇంకా తగ్గుతుందనీ 'ద హిందూ' పరిశోధనాత్మక అధ్యయనం తేల్చింది.

వేలకోట్లలో ఖరీదు కడతారు..
- సుధాంశుమెహంతీ, రక్షణశాఖ మాజీ బ్యూరోక్రాట్(2016లో రిటైర్ అయ్యారు)

యుద్ధ విమానం కొనుగోలు అంటే...వేలకోట్లతో కూడుకున్న వ్యవహారం. అందులో టెక్నాలజీ బదలాయింపునకు వేలకోట్లలో ఖరీదు కడతారు. రాఫెల్ కేసే తీసుకుంటే, భారత్‌కు సాంకేతిక బదలాయింపు కోసం కొన్ని సంవత్సరాలపాటు ఫ్రాన్స్ బృందాలు ఇక్కడ పనిచేయాల్సి ఉంటుంది. స్థానిక తయారీసంస్థకు దానిని అందజేయాలి. రాఫెల్ దేశీయ తయారీ అయినా ఫ్రాన్స్‌కు చెల్లింపులు చేయాల్సి ఉంటుంది.

బేరమాడలేదు..ఎందుకు?

యుద్ధ విమానాల ఒప్పందం బిడ్డింగ్‌లో యూరోఫైటర్, రాఫెల్ పోటీపడ్డాయి. యూపీఏ రాఫెల్ ఒప్పందాన్ని రద్దుచేసినప్పుడు యూరోఫైటర్ మోడీ సర్కార్‌ను సంప్రదించింది. రాఫెల్‌లో మనం కోరుతున్నవన్నీ 20శాతం తక్కువ ధరలో యూరోఫైటర్‌లు ఇస్తామని వారు చెప్పారు. దీనిని స్వీకరించకపోయినా, కనీసం దీనిని పరిగణలోకి తీసుకొని 'రాఫెల్' విషయమై ఫ్రాన్స్‌తో బేరసారాలు ఆడి ఉండాల్సిందని మాజీ బ్యూరోక్రాట్ మెహంతీ అన్నారు. ఒప్పందం విలువను ఫ్రాన్స్ కచ్చితంగా తగ్గించేదనీ, కానీ అలా జరగలేదనీ ఆయన చెప్పారు.

సమాధానం లేని ప్రశ్నలెన్నో..

భారత్ కోరిన 13 ప్రత్యేక అదనపు పోరాట సామర్థ్యాలు 36 విమానాలకు జోడించటంపై ఫ్రాన్స్‌కు 1.3 బిలియన్ యూరోలు(రూ.10,598కోట్లు) చెల్లించాల్సి వస్తోంది. అయితే, ఎన్డీయే ఒప్పందంలో 'ఫాలో-ఆన్' అనే క్లాజ్ లేదు. యూపీఏ ఒప్పందంలో అదనపు సాంకేతిక సామార్థ్యాల జోడింపునకు ఫాలో ఆన్ క్లాజ్ ఉన్నది. యూపీఏ డీల్‌లో 126 జెట్లకు , ఆ తర్వాత 50 జెట్లకు వర్తించేలా ఫాలో ఆన్ క్లాజ్ ఉన్నది. అంటే..యూపీఏ డీల్‌లో 126 జెట్లకు ఏ ధర అయితే చెల్లిస్తామో, ఆ తర్వాత మరో 50 జెట్లకు కూడా అదే ధర ఉంటుంది. ఎన్‌డీఏ డీల్‌లో 36 జెట్ల తర్వాత అదనపు జెట్లు కొనాలంటే మరింత అదనపు ధర చెల్లించాల్సి ఉంటుంది. ఏటేటా ధరలు పెరుగుతాయన్నది గమనార్హం. ఒప్పందంలో 'హెచ్ఏఎల్'గనుక ఉండి ఉంటే, సాంకేతిక బదలాయింపుతో 'హెచ్ఏఎల్' ద్వారా విమానాలు తయారీ జరిగి ఉంటే అప్పుడు హెచ్ఏఎల్ మనకు యుద్ధ విమానాల్ని ఎప్పుడంటే అప్పుడు తయారుచేసి ఇచ్చేది. దీనివల్ల కదా దేశ భద్రత మరింత సురక్షితంగా ఉండేది.

ఒక్క నెల @ 5361 కోట్లు వెనక్కి

న్యూఢిల్లీ: ఈ ఏడాది జనవరిలో(ఒక్క నెలలోనే) విదేశీ మదుపరు (ఎఫ్‌పీఐలు) రూ.5361 కోట్లను భారత పెట్టుబడుల మార్కెట్ నుంచి ఉపసంహరించుకున్నారు. డిపాజిటర్లు తెలిపిన డేటా ప్రకారం రూ.5264 కోట్లను ఈక్విటీ మార్కెట్ నుంచి, రూ.97 కోట్లను డెట్ మార్కెట్ నుంచి వెనక్కి తీసుకున్నారు. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్నవేళ ఈ పరిణామం జరగడం గమనార్హం.

గతేడాది అక్టోబర్‌లో రూ.38,900 కోట్లు, నవంబర్, డిసెంబర్ నెలల్లో రూ.17000 కోట్లను విదేశీ మదుపర్లు భారత మార్కెట్ల నుంచి ఉపసంహరించారు. ముడి చమురు ధరల్లో హెచ్చుతగ్గులు, డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ పడిపోవడం, అమెరికా-చైనా మధ్య కొనసాగుతున్న వాణిజ్య యుద్ధంలాంటి పరిణామాలతో పాటు మోడీ ఆర్థికవైఫల్యాలూ విదేశీ పెట్టుబడుల ఉపసంహరణకు కారణమై ఉంటాయని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు.

తండ్రి మందలించాడని బాలిక ఆత్మహత్య

నవతెలంగాణ-గోదావరిఖని

స్కూల్‌కు ఎందుకు వెళ్లడం లేదని తండ్రి మందలించడంతో మనస్తాపానికి గురైన ఓ బాలిక ఉరేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన పెద్దపల్లి జిల్లా గోదావరిఖని పట్టణంలోని 5ఇన్‌క్లైయిన్‌లో ఆదివారం జరిగింది. వన్‌టౌన్ ఎస్సై అప్పాని వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. 5ఇన్‌క్లైయిన్‌కు చెందిన పోరండ్ల వైష్ణవి(14) అశోక్‌నగర్‌లోని ప్రభుత్వ బాలికల పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతోంది. 15 రోజులుగా పాఠశాలకు వెళ్లకపోవడంతో తండ్రి ఆనంద్ మందలించాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన బాలిక ఆదివారం ఇంట్లో ఎవ్వరూ లేని సమయంలో ఇంటి పైకప్పుకు ఉరేసుకుంది. కుటుంబ సభ్యులు గమనించే సరికే మృతి చెంది కన్పించింది. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గొల్లకుర్మల బహిష్కరణపై విచారణ

'నవతెలంగాణ' కథనానికి స్పందన



నవతెలంగాణ-భీమ్‌గల్

నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ మండలం పల్లికొండ గ్రామంలోని గొల్లకుర్మల గ్రామ బహిష్కరణపై విచారణ ప్రారంభమైంది. వీడీసీ దుశ్చర్యపై శనివారం 'నవతెలంగాణ' ప్రధాన సంచికలో కథనం రావడం, బాధితులు భీంగల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన నేపథ్యంలో పోలీసులు, అధికారులు ఎట్టకేలకు స్పందించారు. ఆర్మూర్ ఏసీపీ రాములు, ఆర్డీవో శ్రీనివాస్, సీఐ సైదయ్య, ఎస్సై శ్రీధర్‌రెడ్డి, తహసీల్దార్ తారాసింగ్ పల్లికొండ గ్రామాన్ని ఆదివారం సందర్శించారు. ఇరువర్గాలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ రాములు మాట్లాడుతూ గ్రామాభివృద్ధి కమిటీ చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దనీ, చట్టాన్ని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవనీ హెచ్చరించారు. గ్రామాభివృద్ధికి పాటుపడుతూ అందరిలో కలిసిమెలిసి ఉండాలని సూచించారు. అనంతరం ఇరువురి మధ్య నెలకొన్న గొర్రెల ఎరువు విషయమై పరిష్కరించేందుకు యత్నించగా ఇరువర్గాలు ససేమీరా అనడంతో సంయమనం పాటించాలని కోరారు. మరోమారు పోలీస్‌స్టేషన్‌కు రావాలని వారికి ఏసీపీ సూచించారు.

జీపీ కార్మికుల సమస్యలపై
దశలవారీగా పోరాటం

- ఈనెల 11,12 తేదీల్లో సర్పంచ్‌లకు మెమోరండాలు
- 18న మండలకేంద్రాల్లో ధర్నాలు 25న చలోహైదరాబాద్ : తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ ప్రకటన



మాట్లాడుతున్న పాలడుగు భాస్కర్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

గ్రామపంచాయతీ వర్కర్లు, ఉద్యోగుల సమస్యలపై ఈ నెలలో దశలవారీగా పోరాటాలు చేస్తామని, 11,12 సర్పంచ్‌లకు మెమోరాండాలు అందజేసి 18వ తేదీన మండల కేంద్రాల్లో ధర్నాలు నిర్వహిస్తామని తెలంగాణ గ్రామపంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ ప్రకటించింది. జీపీ కార్మికుల సమస్యలపై ఈ నెల 25న చలో హైదరాబాద్ కార్యక్రమం తలపెట్టినట్టు తెలిపింది. తెలంగాణ గ్రామ పంచాయతీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కమిటీ సమావేశం ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు పి.గణపతిరెడ్డి అధ్యక్షతన ఆదివారం జరిగింది.

గ్రామ పంచాయతీ కార్మికులకు, ఉద్యోగులకు రూ.8,500లకు తగ్గకుండా జీతం ఇస్తామన్న వేతన పెంపు జీవోను వెంటనే జారీచేయాలని, సమ్మె కాలపు వేతనం ఇవ్వాలని, పెండింగ్ వేతనాలను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని రాష్ట్ర కమిటీ డిమాండ్ చేసింది. అర్హులైన ఉద్యోగులను గ్రామ కార్యదర్శులుగా నియమించాలని, ప్రస్తుతం పనిచేస్తున్న కాంట్రాక్టు ఉద్యో గులను, కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరింది. కొత్త పంచాయతీల్లో అదనపు సిబ్బందిని నియమించాలని, పీఎఫ్, ఈఎస్ఐలను అమలు చేయాలని డిమాండ్ చేసింది. గ్రామపంచాయతీ హక్కుల కోసం ఫిబ్రవరి నెలలో తలపెట్టిన ఆందోళ నా కార్యక్రమాల్లో జీపీ ఉద్యోగులు, కార్మికులు పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చింది. ఈకార్యక్రమంలో ఆయూనియన్ గౌరవాధ్యక్షులు పాలడుగు భాస్కర్, కార్యదర్శి ఐ.శ్రీపతిరావు, కార్యనిర్వాహక కార్యదర్శి చాగంటి వెంకటయ్య, కోశాధికారి గడ్డం ఈశ్వర్, రాష్ట్ర నాయకులు నరేందర్, జయరాం, రత్నం, రాజలింగం, గణేష్, గోపాలస్వామి, కొప్పుల ఈశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

కోర్టు స్టే ఉండగా పనులెలా చేస్తారు ?

- మూడో రోజూ మల్లన్నసాగర్ పనులు అడ్డగింత
- ఎర్రవల్లిలో వంటావార్పు

నవతెలంగాణ-తొగుట/కొండపాక

పనులు నిలిపివేయాలని హైకోర్టు స్టే ఇచ్చినా పనులెలా కొనసాగిస్తారని మల్లన్నసాగర్ భూ నిర్వాసితులు కాంట్రాక్టర్లను ప్రశ్నించారు. సిద్దిపేట జిల్లా తొగుట మండలం పోచమ్మగుట్ట వద్ద కాంట్రాక్టర్లు కాలువ పనులు చేసేందుకు ఆదివారం సిద్ధమౌతుండగా మూడో రోజూ నిర్వాసితులు అడ్డుకున్నారు. న్యాయమైన పరిహారం ఇచ్చేంత వరకూ పనులు చేయనిచ్చేది లేదని అధికారులకు, కాంట్రాక్టర్లకు తేల్చిచెప్పారు. తమకు పరిహారం తక్కువగా వచ్చిందనీ, పనులు నిలిపివేయాలని కోరుతూ హైకోర్టు నుంచి స్టే



తెచ్చుకున్నామనీ తెలిపారు. ఆ స్టే పత్రాలను అధికారులకు చూపించారు. కొండపాక మండలం ఎర్రవల్లిలోనూ ప్రాజెక్టు కాలువ పనులను గ్రామస్తులు అడ్డుకున్నారు. మల్లన్నసాగర్ కింద భూములు కోల్పోతున్న వారికి ఎకరానికి రూ.11.4లక్షల పరిహారం చెల్లించే దాకా పనులు చేయనివ్వబోమని స్పష్టం చేశారు. ఇదే ప్రాజెక్టులో భూములు కోల్పోతున్న తొగుట మండల వేములఘాట్ రైతులకు ఎకరాకు రూ.11.4లక్షల చొప్పున ప్రభుత్వం చెల్లిస్తోందన్నారు. ఒకే ప్రాజెక్టు పరిధిలో భూములు కోల్పోతున్న వారికి వేర్వేరుగా పరిహారం ఇవ్వడమేంటని ప్రశ్నించారు. తమకు న్యాయమైన నష్టపరిహారం ఇచ్చేంత వరకూ పనులు అడ్డుకుంటామని తెలిపారు. దీనికి నిరసనగా ఎర్రవల్లి గ్రామంలో నిర్వాసితులు టెంటు వేసుకొని వంటావార్పు నిర్వహించారు.

కోల్‌కతాలో హైడ్రామా



కోల్‌కతా: పశ్చిమబెంగాల్ రాజధాని కోల్‌కతాలో ఆదివారం హైడ్రామా చోటు చేసుకున్నది. రోజ్‌వ్యాలీ, శారదా చిట్‌ఫండ్ కుంభకోణాలపై విచారణ జరుపుతున్న సీబీఐ బృందం ఆదివారం కోల్‌కతా పోలీసు కమిషనర్ రాజీవ్‌కుమార్ నివాసం వద్దకు చేరుకోవడం దుమారం రేపింది. ఈ కేసుల్లో రాజీవ్ కుమార్‌ను సీబీఐ అధికారులు ప్రశ్నించాలని భావిస్తుండటంతో పాటు అరెస్టు కూడా కావొచ్చన్న ఊహాగానాలు వినిపించాయి. ఈ మొత్తంలో పెద్ద ఎత్తున పోలీసు బలగాలు రాజీవ్‌కుమార్ నివాసం వద్దకు చేరుకున్నాయి. సీబీఐ అధికారులు లోపలికి వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. రాజీవ్‌కుమార్‌ను విచారించడానికి సంబంధిత పత్రాలున్నాయా? అంటూ అధికారులను నిలదీశారు. అంతేకాక సీబీఐ అధికారులను పోలీసులు అరెస్టు చేసి స్థానికంగా ఉన్న షేక్స్పియర్ సరానీ పోలీసు స్టేషన్‌కు తరలించడం గమనార్హం. కొద్దిసేపటి తర్వాత పోలీసులు వారిని విడిచిపెట్టారు. ఐదుగురు సభ్యుల సీబీఐ బృందం రాజీవ్‌కుమార్ నివాసం వద్దకు వెళ్లినట్టు సమాచారం. రోజ్‌వ్యాలీ, శారదా చిట్‌ఫండ్ స్కాంలలో కీలక పత్రాలు మాయం కావడంపై సీబీఐ అధికారులు విచారణ చేయదల్చుకున్నట్టు తెలుస్తున్నది. ఇందుకు సంబంధించి పోలీసుల విచారణకు నేతృత్వం వహిస్తున్న రాజీవ్‌కుమార్‌కు సమన్లు జారీ చేసినా స్పందించలేదని సీబీఐ అధికారులు చెబుతున్నారు. మరోవైపు.. రాజీవ్‌కుమార్ విధులకు హాజరు కావడం లేదన్న వార్తలను ఆ రాష్ట్ర పోలీసులు కొట్టిపారేశారు. రాజీవ్‌కుమార్ ఒక్క రోజు మాత్రమే సెలవులో ఉన్నారని తెలిపారు. అసత్య ప్రచారాలు చేయడం తగదని ఈ సందర్భంగా అన్నారు. కాగా.. పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కూడా రాజీవ్‌కుమార్ నివాసం వద్దకు రావడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. అటు కోల్‌కతా నగర మేయర్ ఫిర్హాద్ హకీం కూడా రాజీవ్‌కుమార్ నివాసానికి వెళ్లారు. మరోవైపు కోల్‌కతాలోని సీబీఐ కార్యాలయం వద్ద సీఆర్‌పీఎఫ్ బలగాలు పహారా కాస్తున్నాయి. సీబీఐ కార్యాలయం ఉన్న సీజీఓ కాంప్లెక్స్‌ను సీఆర్‌పీఎఫ్ తన ఆధీనంలోకి తీసుకొని పర్యవేక్షణ చేస్తోంది.

అయితే.. అధికారుల అరెస్టు నేపథ్యంలో సీబీఐ.. సోమవారం(నేడు) భారత సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించనున్నట్టు విశ్వసనీయ సమాచారం. దీంతోపాటు రాష్ట్ర గవర్నర్ కేసరినాథ్ త్రిపాఠిని కూడా సీబీఐ కలవనున్నట్టు తెలుస్తున్నది.

ఎలాంటి పత్రాలూ లేకుండానే : జాయింట్ కమిషనర్ ప్రవీణ్ త్రిపాఠి

రాజీవ్ నివాసం వద్దకు చేరుకున్న సీబీఐ అధికారుల దగ్గర అనుమతులకు సంబంధించి ఎలాంటి పత్రాలూ లేవని కోల్‌కతా పోలీసు జాయింట్ కమిషనర్(క్రైమ్) ప్రవీణ్ త్రిపాఠి అన్నారు. సీక్రెట్ ఆపరేషన్ అని చెబుతున్న సీనియర్ అధికారులు.. తమ ప్రశ్నలకు సరైన సమాధానం ఇవ్వలేకపోయారని ఆయన తెలిపారు.

రాజకీయ కక్షతోనే : మమత

కోల్‌కతా పోలీస్ చీఫ్ రాజీవ్ కుమార్‌కు సీబీఐ సమన్లు జారీ చేయడంపై బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ధర్నాకు దిగారు. పార్టీ నాయకులతో సహా ఎస్ప్లానాడేలోని మెట్రో చానెల్ వద్ద రాత్రి 8.45 గంటల ప్రాంతంలో 'సేవ్ ది కాన్‌స్టిట్యూషన్' పేరుతో ఆమె నిరసనకు దిగారు.

బెంగాల్‌లో ప్రధాని మోడీ, బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షాలు కుట్రకు పన్నాగం పన్నుతున్నారని ఆరోపించారు. సీబీఐ దాడులు ఆపకపోతే మెట్రో ముందు ధర్నాకు దిగు తానని అంతక ముందే ఆమె ప్రకటించారు. నేడు అసెంబ్లీలో బడ్జెట్ పెట్టే కార్యక్రమం ఉండడంతో ధర్నా ప్రదేశం వద్దనే తాత్కాలికంగా ఒక గదిని ఏర్పాటు చేసి అక్కడే క్యాబినెట్ సమావేశం ఏర్పాటు చేసి బడ్జెట్‌ను అక్కడే ఆమోదిస్తామని ఆమె తెలిపా రు. రాజీవ్ కుమార్‌కు మద్దతు తెలిపిన మమత.. రాజకీయ కక్షతోనే బీజేపీ ఇదంతా చేస్తున్నదని ఆరోపించారు. కేవలం రాజకీయ పార్టీలనే లక్ష్యంగా కాకుండా.. పోలీసులను నియంత్రించడానికి బీజేపీ అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ కీలక వ్యవస్థలను ధ్వంసం చేస్తున్నదని విమర్శించారు. కోల్‌కతా పోలీస్ కమిషనర్ ప్రపంచంలోనే గొప్ప వ్యక్తి అని, ఆయన ధైర్యాన్ని, నిజాయితీని శంకించాల్సిన ప్రశ్న ఉత్పన్నం కాదన్నారు.

కోల్‌కతాకు కేజ్రీవాల్..?

కోల్‌కతాలో ధర్నాకు దిగిన మమతా బెనర్జీకి సంఘీభావం తెలపడానికి ఢిల్లీ సీఎం, ఆప్ అధినేత నేడు కోల్‌తాకు వచ్చే అవకాశం ఉన్నట్టు విశ్వసనీయంగా తెలుస్తున్నది. అయితే కేజ్రీవాల్ పర్యటనపై ఇంకా తుది నిర్ణయాన్ని తీసుకోలేదని సీఎంఓ వర్గాలు తెలిపాయి. ఇదిలా ఉండగా ఆ రాష్ట్ర గవర్నర్‌ను డీజీపీ, సీఎస్ కలిసి రాష్ట్రంలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితిని వివరించారు.

సర్కారు బడులకు గ్రాంట్లు విడుదల చేయాలి

- టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గం డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వ పాఠశాలలకు ఏటా ఇచ్చే స్కూల్ గ్రాంట్, మెయింటెనెన్స్ గ్రాంట్లు వెంటనే విడుదల చేయాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్) రాష్ట్ర కార్యవర్గం డిమాండ్ చేసింది. ఆదివారం హైదరాబాద్‌లో టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గం సమావేశం ఆ సంఘం అధ్యక్షులు సిహెచ్ రాములు అధ్యక్షతన జరిగింది. అనంతరం టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ రాములు, ప్రధాన కార్యదర్శి చావ రవి ఓ ప్రకటన విడుదల చేశారు. 2018-19 విద్యా సంవత్సరం ముగుస్తున్న ఇప్పటి వరకు పాఠశాలల గ్రాంట్లు విడుదల చేయకపోవడం విద్యారంగం పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణికి నిదర్శనమని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యా సంవత్సరం ప్రారంభంలో జూన్‌లో విడుదల చేయాల్సిన ఈ నిధులను ఇంకా విడుదల చేయకపోవడంతో పాఠశాల నిర్వహణ కష్టతరంగా మారిందని తెలిపారు. కనీసం మరుగుదొడ్లు శుభ్రం చేయాలన్నా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోందని పేర్కొన్నారు. స్వచ్ఛ కార్మికుల వేతనాలు కూడా చెల్లించలేని పరిస్థితి నెలకొందని అధికారులు ఈ విషయంలో తగు శ్రద్ధ వహించి నిధులను సత్వర విడుదలకు కృషి చేయాలని కోరారు.

2018, జులై నుండి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులకు అమలు కావాల్సిన 11వ పీఆర్సీ (తెలంగాణ మొదటి పీఆర్సీ) అమలు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని తెలి పారు. ముఖ్యమంత్రి స్వయంగా ప్రకటించిన జూన్ 2 నుండి ఐఆర్, ఆగష్టు 15న పీఆర్సీ ప్రకటన హామీలు ఇప్పటికీ ఆచరణలోకి రాలేదని విమర్శించారు. ఇప్పటికైన రాష్ట్ర ప్రభుత్వం స్పదించి ఉద్యోగుల ఆకాంక్షలకు అనుగుణంగా తక్షణమే 35 శాతం ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. పీఆర్సీ నివేదిక వెంటనే తెప్పించి అమలు పరచాలని కోరారు. పదోన్నతులకు సంబంధించిన ఉత్తర్వులను కోర్టు వివాదాలకు తావివ్వకుండా తగు న్యాయ సలహాలతో వెంటనే విడుదలచేయాలని సూచించారు. సక్రమంగా అమలు అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రూ.398 వేతనంతో పనిచేసిన టీచర్లకు నోషనల్ ఇంక్రిమెంట్ల విషయంలో జాప్యాన్ని నివారించాలని కోరారు. భాషా పండితులు, వ్యాయామ ఉపాధ్యాయ పోస్టులన్నింటినీ స్కూల్ అసిస్టెంట్లుగా అప్‌గ్రేడ్ చేయాలని డిమాండ్ చేశారు.

కేజీబీవీ టీచర్లకు 12 నెలల వేతనమివ్వాలి : నర్సిరెడ్డి

కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలు (కేజీబీవీ)లలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు 12 నెలల వేతనం ఇవ్వాలని యూటీఎఫ్ రాష్ట్ర మాజీ అధ్యక్షులు నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల ఎమ్మెల్సీ అభ్యర్థి అలుగుబెల్లి నర్సిరెడ్డి డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం చట్టాన్ని, కనీస వేతనాల చట్టంను అమలు పరచాలని కోరారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులకు సర్వీస్ రూల్స్ ప్రకటించాలని, గురుకుల ఉపాధ్యాయుల జాబ్ చార్ట్‌ను మార్చాలని చెప్పారు.

19న చలో ఢిల్లీ

విద్యా పరిరక్షణ ఐక్య ఉద్యమం ఆధ్వర్యంలో ఢిల్లీలో ఈనెల 19న నిర్వహించే ర్యాలీని జయప్రదం చేయాలని టీఎస్ యూటీఎఫ్ అధ్యక్ష, కార్యర్శులు సిహెచ్ రాములు, చావ రవి తెలిపారు. రెండు ఉపాధ్యాయ నియోజకవర్గాల ఎన్నికల్లో యూఎస్‌పీసీ బలపర్చిన అభ్యర్థులు ఎ నర్సిరెడ్డి, బి కొండల్‌రెడ్డిల గెలుపునకు కృషి చేయాలని కోరారు.

ఈ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు దుర్గాభవాని, సోమశేఖర్, కోశాధికారి కిష్టయ్య, పత్రికా ప్రధాన సంపాదకులు పి మాణిక్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు బి నర సింహారావు, టి లక్ష్మారెడ్డి, ఎ వెంకట్, ఎం రాజశేఖర్‌రెడ్డి, కె జంగయ్య, డి సత్యానంద్, ఆర్ శారద, ఎస్‌వై కొండల్‌రావు, ఇ గాలయ్య, నాగమణి, బి రాజు, ఆర్ రంజిత్ కుమార్, ఆడిట్ కమిటీ కన్వీనర్ ఆవారి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కూసుమంచి హెచ్ఎంను తొలగించాలి

- టీపీఏ అధ్యక్షులు నారాయణ డిమాండ్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్


ఖమ్మం జిల్లా కూసుమంచిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి శంకర్‌రెడ్డిని విధుల నుంచి తొలగించాలని తెలంగాణ తల్లిదండ్రుల సంఘం (టీపీఏ) డిమాండ్ చేసింది. ఈ మేరకు టీపీఏ అధ్యక్షులు నాగటి నారాయణ ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. పాఠశాల విద్యాశాఖ సంచాలకులు, ఉన్నతాధికారులకు మెయిల్ ద్వారా ఫిర్యాదు చేశామని తెలిపారు.

పాఠశాలలోని విద్యార్థినిల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తున్న శంకర్‌రెడ్డిపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు శనివారం ఆందోళన చేశారని పేర్కొన్నారు. గతంలో పనిచేసిన పాఠశాలలోనూ తప్పుడు ప్రవర్తన కారణంగా అందుకు శిక్ష అనుభవించారని తెలిపారు. పదో తరగతి పరీక్షలకు ముందు పాఠశాలలో అలజడి వాతావరణం ఏర్పడడం వల్ల నష్టం జరుగుతోందని పేర్కొన్నారు. ప్రధానోపాధ్యాయుడు శంకర్‌రెడ్డిని విధుల నుంచి తొలగించి ఆ పాఠశాలలో ప్రశాంత వాతావరణం కల్పించాలని కోరారు.

ఏటా టెట్ ఏదీ?

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టీఎస్‌టెట్) కోసం లక్షలాది మంది ఉపాధ్యాయ అభ్యర్థులు ఎదురుచూస్తున్నారు. సమయానుకూలంగా ఈ పరీక్షను నిర్వహించకపోవడంతో ఒకవైపు ఉద్యోగాలు పొందడంలో ఆలస్యం జరుగుతుండగా, మరోవైపు ఇతర ప్రవేశ పరీక్షలు రాయడంలో ఆటంకాలు ఎదురవుతున్నాయి. ఏండ్ల తరబడి టెట్ కోసం అభ్యర్థులు ఎదురుతెన్నులు పడాల్సి వస్తున్నది. ఇంత జరుగుతున్నా ఇటు రాష్ట్ర ప్రభుత్వం, అటు పాఠశాల విద్యాశాఖ నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తుండడం గమనార్హం. రాష్ట్రంలో చివరిసారిగా 2017, జూన్ 10న టెట్ నోటిఫికేషన్ జారీ అయ్యింది. జులై 23న టెట్ రాతపరీక్ష జరిగింది. అదే ఏడాది ఆగస్టు 5న ఫలితాలు విడుదలయ్యాయి. పేపర్-1కు 1,11,647 మంది దరఖాస్తు చేయగా, 98,905 మంది రాతపరీక్షకు హాజరయ్యారు. వారిలో 49,543 మందికి మాత్రమే అర్హత లభించింది. ఇక పేపర్-2కు 2,56,265 మంది దరఖాస్తు చేస్తే, 2,30,881 మంది పరీక్ష రాశారు. వారిలో 45,055 మంది మాత్రమే ఉత్తీర్ణులయ్యారు. 1,85,826 మంది ఉత్తీర్ణులు కాలేకపోయారు. ఆ తర్వాత 21 నెలలైనా టీఎస్‌టెట్ నోటిఫికేషన్ విడుదల కాలేదు. దీంతో గత టెట్‌లో ఉత్తీర్ణత పొందని వారే పేపర్-1లో 49,452 మంది, పేపర్-2లో 1,85,826 మంది చొప్పున మొత్తం 2,35,278 మంది ఉన్నారు. బీఎడ్, డీఎడ్ పూర్తి చేసిన అభ్యర్థులు మరో 70 వేల మంది వరకు ఉంటారు. దీంతో రాష్ట్రంలో సుమారు 3 లక్షల మంది ఉపాధ్యాయ అభ్యర్థులు టెట్ కోసం ఎదురుచూస్తున్నారు. అయినా రాష్ట్ర ప్రభుత్వం టెట్ నిర్వహణపై అలసత్వం ప్రదర్శిస్తున్నది. ఉచిత నిర్బంధ విద్యాహక్కు చట్టం (ఆర్టీఈ), జాతీయ ఉపాధ్యాయ విద్యా మండలి (ఎన్‌సీటీఈ) నిబంధనల ప్రకారం ఒకటి నుంచి 8వ తరగతి వరకు బోధించే వారు తప్పనిసరిగా టెట్ అర్హత సాధించాలి. ఉపాధ్యాయ పోస్టులకు దరఖాస్తు చేయాలంటే టెట్ పాసవ్వాల్సిందే. టెట్‌కు ఉన్న ప్రాధాన్యతను రాష్ట్ర ప్రభుత్వం గుర్తించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఇంకోవైపు ఆర్టీఈ, ఎన్‌సీటీఈ నిబంధనల ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం ఆరు నెలలకోసారి టెట్ నిర్వహించాల్సి ఉంది. కానీ తెలంగాణలో పాఠశాల విద్యాశాఖ నిబంధనలను బేఖాతరు చేస్తున్నది. 21 నెలలైనా టెట్ నోటిఫికేషన్ విడుదల కాలేదంటే విద్యాశాఖ నిద్రావస్థలో ఉన్నదని అర్థమవుతున్నది. దీంతో ఏటా టెట్ నిర్వహణ ఏదని



అభ్యర్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఉపాధ్యాయ అభ్యర్థుల ఆందోళనను అర్థం చేసుకొని తక్షణమే టెట్ నోటిఫికేషన్‌ను జారీ చేయాలని యువజన సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

గురుకుల నోటిఫికేషన్, మరో టీఆర్టీ వస్తే నష్టం

ఇటీవలే 119 బీసీ గురుకుల విద్యాలయాల్లో 3,689 పోస్టులను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో సుమారు 12 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని అధికారిక సమాచారం. అంటే బీసీ గురుకులాల్లోని 3,689 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ అయితే టెట్ అర్హత లేని ఉపాధ్యాయ అభ్యర్థులు నష్టపోయే ప్రమాదముంది. గురుకులాల్లో ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్ (టీజీటీ) పోస్టులకు టెట్ అర్హత ఉన్నోళ్లే అర్హులు. మరోవైపు ప్రభుత్వ పాఠశాలల్లోని ఉపాధ్యాయ ఖాళీల భర్తీకి మరో ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టీఆర్టీ) నోటిఫికేషన్ విడుదలయితే టెట్ అర్హత లేని వారు దరఖాస్తు చేసేందుకు కూడా నోచుకోరు. ఇంకోవైపు 8,792 ఉపాధ్యాయ పోస్టుల భర్తీకి 2017, అక్టోబర్ 10న ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టీఆర్టీ) నోటిఫికేషన్ జారీ అయ్యింది. టీఆర్టీ రాతపరీక్షలు 2018, ఫిబ్రవరి 24 నుంచి 28వ తేదీ వరకు జరిగాయి. కానీ ఇప్పటి వరకు కొన్ని సబ్జెక్టులకు సంబంధించిన 1000లోపు పోస్టులే భర్తీ అయ్యాయి. మిగిలిన పోస్టుల భర్తీ ప్రక్రియ కొనసాగుతున్నది. టీఆర్టీ నియామ కాల ప్రక్రియను త్వరగా పూర్తి చేయాలని అభ్యర్థులు కోరుతున్నారు.

తక్షణమే టెట్ నిర్వహించాలి : రామ్మోహన్‌రెడ్డి, డీఎడ్ అభ్యర్థుల సంఘం

రాష్ట్రంలో తక్షణమే టెట్‌ను నిర్వహించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలి. గురుకులాల్లో ఖాళీ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ అయ్యే అవకాశముంది. టీజీటీ పోస్టులకు దరఖాస్తు చేయాలంటే తప్పనిసరిగా టెట్‌ఉత్తీర్ణత పొందాలి. ఇక టీఆర్టీకి దరఖాస్తు చేయాలన్నా టెట్ అర్హత ఉండాలి. అందుకే టెట్ నోటిఫికేషన్ విడుదల చేసి ఉపాధ్యాయ అభ్యర్థులకు న్యాయం చేయాలి. ఇంకోవైపు ఒకేసారిటెట్, గురుకుల నోటిఫికేషన్ విడుదల చేస్తే ఉపాధ్యాయ అభ్యర్థులు నష్టపోతారు. ఒత్తిడికి గురవుతారు. అందుకే ఇప్పుడు టెట్ నిర్వహిస్తే ఉపాధ్యాయ అభ్యర్థులకు మేలు కలుగుతుంది.

సెన్సెక్స్ ▲212 36,469

నిఫ్టీ ▲62 10,893

శుక్రవారం మార్కెట్లు ముగిసే సమయానికి


డాలరుకు రూపాయి విలువ 71.25



బంగారం(10.గ్రా) రూ. 33,410



వెండి (కేజీ) రూ. 40,580



కోడిగుడ్లు (వందకి)			
హైదరాబాద్	418	విజయవాడ	423
ఒక్కగుడ్డుకు	4.70	చెన్నై	455
వరంగల్	420	ముంబయి	473



సేల్‌ఫర్ @35



ప్రభుత్వరంగ సంస్థల అమ్మకానికి కేంద్రం ప్రణాళిక

క్యాబినెట్ ముందుకు 'దీపం' నివేదిక

- 2019-20లో రూ.90 వేలకోట్ల ఉపసంహరణ లక్ష్యం

న్యూఢిల్లీ: పెట్టుబడుల ఉపసంహరణలో భాగంగా 35 కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలను(సీపీఎస్ఈ) అమ్మడానికి ఆర్థికశాఖ ప్రణాళికను సిద్ధం చేస్తోంది. నిటి ఆయోగ్ ఇటీవలే సీపీఎస్ఈల్లోని లాభాలతో ఉన్న, నష్టాలతో ఉన్న సంస్థల ఐదో జాబితాను పెట్టుబడులు, ప్రభుత్వ ఆస్తుల నిర్వహణ విభాగానికి(దీపంకు) సమర్పించింది. వ్యూహాత్మక పెట్టుబడుల ఉపసంహరణను దృష్టిలో ఉంచుకొని అమ్మకాల ప్రక్రియను సులభతరం చేయడం కూడా ఎంతో ముఖ్యమని తాము భావిస్తున్నట్టు దీపం కార్యదర్శి అతాన్ చక్రవర్తి తెలిపారు. 35 కంపెనీల అమ్మకాల విషయంలో క్యాబినెట్ ఆమోదం పొందాల్సి ఉన్నదని ఆయన తెలిపారు. ప్రస్తుతం 57 సీపీఎస్ఈలు స్టాక్ మార్కెట్‌లో నమోదై ఉన్నాయి. వీటి మొత్తం మార్కెట్ విలువ రూ.13 లక్షల కోట్లు.

వ్యూహాత్మక అమ్మకానికి తయారైన వడబోత జాబితాలో ఎయిర్ ఇండియా, డ్రెడ్జింగ్ కార్పొరేషన్, బీఈఎంఎల్, స్కూటర్స్ ఇండియా, భారత్ పంప్స్ కాంప్రెసర్స్, సెయిల్‌కు చెందిన సాలెం, దుర్గాపూర్ యూనిట్లు, హిందుస్తాన్ ఫ్లోరోకార్బన్, హిందుస్తాన్ న్యూస్‌ప్రింట్, సెంట్రల్ ఎలక్ట్రానిక్స్, సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా, ఐటీడీసీ ఉన్నాయి. పవన్‌హన్స్ అమ్మకం విషయం పురోగతిలో ఉన్నట్టు అతాన్ చక్రవర్తి తెలిపారు. పవన్‌హన్స్‌లో ప్రస్తుతం కేంద్రంతోపాటు ఓఎన్‌జీసీకి 51 శాతం, 49 శాతం చొప్పున వాటాలున్నాయి. ఈ సంస్థ కింద 46 చాపర్లు(హెలికాప్టర్లు)న్నాయి.



తాత్కాలిక ఆర్థికమంత్రి పీయూష్ గోయల్ ఇటీవల లోక్‌సభకు సమర్పించిన బడ్జెట్‌లో ప్రభుత్వరంగ సంస్థల్లో పెట్టుబడుల ఉపసంహరణపై వివరాలు వెల్లడించారు. 2019-20లో రూ.90,000 కోట్ల విలువైన సీపీఎస్ఈల వాటాలు విక్రయించాలనేది లక్ష్యంగా తెలిపారు. 2018-19లో రూ.80,000 కోట్ల లక్ష్యాన్ని నిర్దేశించుకోగా, రూ.35,100 కోట్లు ఇప్పటికే సమీకరించినట్టు తెలిపారు. మిగతా రూ.44,000 కోట్లను కూడా వచ్చే రెండు నెలల్లో సమీకరించనున్నట్టు ప్రభుత్వం చెబుతోంది. 2017-18లో సీపీఎస్ఈల్లోని వాటాలు విక్రయిండం ద్వారా కేంద్రం రూ.లక్ష కోట్లు సమీకరించింది.

స్టార్టప్‌లకు తగ్గిన ప్రాధాన్యత

- ఈ ఏడాది బడ్జెట్‌లో తగ్గిన కేటాయింపులు



న్యూఢిల్లీ: దేశంలోని యువతలో ఉన్న నైపుణ్యాన్ని, సృజనాత్మకతను బయటకు తీయడమే గాక నిరుద్యోగులకు ప్రయివేటు రంగంలో ఉద్యోగాలు కల్పించడానికి ఏర్పాటు చేసిన 'స్టార్టప్ ఇండియా' కార్యక్రమానికి ఈ ఏడాది బడ్జెట్‌లో నిధులు తగ్గాయి. మోడీ సర్కారు ఎంతో ఆర్భాటంగా చేపట్టిన ఈ పథకం ముందు నుంచి అంతంతమాత్రంగానే సాగుతోంది. రెండు రోజుల క్రితం బీజేపీ సర్కారు ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లోనూ ఈ పథకా నికి కేవలం రూ. 25 కోట్లు మాత్రమే కేటాయించారు. ఇది గతేడాది సవరించిన బడ్జెట్ (రూ. 28 కోట్లు) కంటే తక్కువ కావడం గమనార్హం. మేకిన్ ఇండియాలో భాగంగా 2016 జనవరి 16న స్టార్టప్ ఇండియాకు ప్రధాని మోడీ శ్రీకారం చుట్టారు. కాగా, ఈ పథకం ప్రారంభ దశ నుంచి అవస్థలు పడుతూనే ఉంది. అంకుర సంస్థలు ఏర్పాటు చేయడానికి ఔత్సాహికులు ముందుకు వచ్చినా వారికి సరైన సౌకర్యాలు కల్పించడంలో కేంద్రం విఫలమవుతోందనే వాదన ఉంది. అయితే, విదేశాలలో మాదిరిగా స్టార్టప్‌లు ఏర్పాటు చేసేవారికి ప్రభుత్వమే వీలైన సౌకర్యాలు కల్పిస్తే తప్ప ఈ పథకం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోలేదని ముంబయికి చెందిన ఓ అంకుర సంస్థ అధినేత అభిప్రాయపడ్డారు.

ద్రవ్యలోటు లక్ష్యాన్ని చేరుకోవడం కష్టం

- మూడీస్ విశ్లేషణ



న్యూఢిల్లీ: వచ్చే ఆర్థిక సంవత్సరం 2019-20కి గానూ మోడీ సర్కారు నిర్దేశించిన ఆర్థిక ద్రవ్యలోటు 3.4 శాతం చేరుకోవడం సాధ్యమయ్యే పని కాదని ప్రముఖ రేటింగ్ సంస్థ మూడీస్ తెలిపింది. ఓవైపు అభివృద్ధి కార్యక్రమాలకని కేంద్రం తీసుకుంటున్న రుణాలు పెరిగిపోతుండగా మరోవైపు త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని కేంద్రం ప్రకటించిన భారీ తాయిలాల కారణంగా వ్యయాలు పెరిగే అవకాశం ఉన్నదని ఆ సంస్థ విశ్లేషించింది. దీనిపై మూడీస్ ప్రతినిధి జెన్ ఫంగ్ స్పందిస్తూ... ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తే తప్ప ద్రవ్యలోటు లక్ష్యాన్ని చేరుకోవడం కష్టమని అన్నారు. తాయిలాల కారణంగా ప్రభుత్వానికి వచ్చే ఆదాయం కంటే వ్యయాలు పెరుగుతాయని తెలిపారు. మోడీ సర్కారు నిర్దేశించినట్టుగా 2020 మార్చి నాటికి ద్రవ్యలోటును 3.4 శాతానికి చేరుకోవడమనేది అంచనాకు మించిన పని అని అన్నారు. ఓట్ల బడ్జెట్‌గా ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లోనూ రైతులకు ఒనగూరేదేమీ లేదని ఆర్థిక విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

ఉద్యోగ సృష్టికర్తలుగా మారండి :ఉప రాష్ట్రపతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ఉన్నత విద్యా సంస్థల్లో నైపుణ్య ఆధారిత శిక్షణను అందించడం ద్వారా విద్యార్థులను ఉద్యోగార్థులుగా గాక, ఉద్యోగ సృష్టికర్తలుగా తయారు చేయవచ్చని ఉపరాష్ట్రపతి ఎమ్. వెంకయ్యానాయుడు అన్నారు. రామానాయుడు విజ్ఞాన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ విద్యార్థులు మరియు విజ్ఞాన్ జ్యోతి సొసైటి సభ్యులను ఉద్దేశించి ఆయన ఆదివారం నిర్వహించిన ఓ కార్యక్రమంలో ప్రసంగించారు. భవిష్యత్‌లో సవాళ్లను అధిగమించే విధంగా విద్యార్థులను సంపూర్ణమైన వ్యక్తులుగా తీర్చిదిద్దడంపై దృష్టి సారించాలని విద్యా సంస్థల అధిపతులకు సూచించారు. ఇందులో భాగంగా విద్యార్థులకు దిశా నిర్దేశం చేసేందుకు ప్రత్యేకంగా కౌన్సిలర్లను నియమించాలని అన్నారు. అంతర్జాతీయ స్థాయికి అనుగుణంగా విద్యా ప్రమాణాలను మెరుగు పరిచేందుకు భారతీయ విశ్వవిద్యాలయాలు చర్యలు చేపట్టాలని తెలిపారు. విద్యార్థులు సైతం వినూత్నంగా ఆలోచించి, సవాళ్లను అధిగమించే దిశగా పరిష్కారాలతో ముందుకు రావాలని సూచించారు.

యూఐడీఏఐకి తగ్గిన కేటాయింపులు

గతేడాదితో పోలిస్తే 8.7 శాతం కోత

- ఆధార్‌పై మొట్టికాయలతో మోడీ సర్కారు ఈ నిర్ణయమా..?

న్యూఢిల్లీ: ఆధార్‌ను ప్రతిదానితోనూ అనుసంధానం చేయాలనే బీజేపీ ప్రభుత్వ యత్నాన్ని సుప్రీం కోర్టు అడ్డుకోవటంతో..మోడీ సర్కార్ వెనక్కి తగ్గిందా..అందుకే యూఐడీఏఐకి నిధులకు కోతపెట్టిందా..ఎన్నికల ముందు ప్రవేశపెట్టిన ఓటాన్ అకౌంట్‌లో ప్రాధికారసంస్థకు ఎంత ప్రాధాన్యత నిచ్చింది..? ఓసారి పరిశీలిద్దాం..

మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్‌లో భారత విశిష్ట సంఖ్య ప్రాధికార సంస్థ(యూఐడీఏఐ)కు కేటాయింపులను తగ్గించింది. గతేడాదితో పోలిస్తే, 8.7శాతం కోతపెట్టారు. మొత్తం రూ.1,227కోట్లు కేటాయించారు. 2018-19 సంవత్సరంలో ఈ మొత్తం రూ.1,345కోట్లు. మార్చి 2019తో ముగిసే ఆర్థిక సంవత్సరానికి గానూ గత బడ్జెట్‌లో యూఐడీఏఐకి



రూ.1,375కోట్లు కేటాయిస్తున్నట్లు ప్రకటించగా, సవరించిన అంచనాలతో రూ.1,345కోట్లు అందించారు. యూఐడీఏఐ సీఈవో అజయ్ భూషణ్ మాట్లాడుతూ.. సంస్థ అవసరాల మేరకు నిధులకేటాయింపులుంటాయని. దానికనుగుణంగా ఖర్చులుంటాయని అన్నారు. ఇన్ఫర్మేషన్ టెక్నాల జీకి సంబంధించి పాత హార్డ్ వేర్ స్థానంలో కొత్తదాన్ని తీసుకు రావడం, సరికొత్త ఆలోచనలు మొదలైన వాటికి నిధులు వెచ్చించాల్సి ఉంటుందన్నారు. అదే సమయంలో యూఐ డీఏఐని ఎప్పటికప్పుడు అప్‌గ్రేడ్ చేసుకోవాల్సి ఉంటుందని తెలిపారు. యూఐడీఏఐకి అవసరాలకు అనుగుణంగా ఆర్థికశాఖ నుంచి పూర్తి సహ కారం ఉన్నదని అజయ్ భూషణ్ వివరించారు. వాస్తవానికి మోడీ సర్కార్ యూఐడీఏఐకి నిధుల కోత పెట్టిందని ఆర్థికరంగ నిపుణులు అంటున్నారు.

దేవాస్‌కు రు.1,585 కోట్లు జరిమానా

- ఫెమా ఉల్లంఘించినందుకు..



న్యూఢిల్లీ: ఆంట్రిక్స్ దేవాస్ కేసులో మల్టీ మీడియా సంస్థ దేవాస్ ఫెమా చట్ట నిబంధనలను ఉల్లంఘించినట్టు నిర్ధారించిన ఫెమా చట్ట వ్యవస్థ ఆ సంస్థకు రు.1,585 కోట్లు జరిమానా విధిస్తూ ఆదేశాలు జారీ చేసింది. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)కు చెందిన కొందరు మాజీ ఉద్యోగులతో దేవాస్ మల్టీమీడియా సంస్థ 2004లో ఏర్పడిన విషయం తెలిసిందే. ఇస్రో వాణిజ్య విభాగం ఆంట్రిక్స్‌తో కలిసిచేపట్టిన ప్రాజెక్టుల్లో వెల్లువెత్తిన రు.579 కోట్ల అక్రమ విదేశీ పెట్టుబడులకు దేవాస్ సంస్థ డైరెక్టర్లు, ఆ సంస్థ విదేశీ మదుపుదారులు బాధ్యత వహించాల్సి వుంటుందని ఫెమా బోర్డ్ స్పష్టం చేసింది. ఫెమా చట్ట నిబంధనలను ఉల్లంఘించినట్టు ఎన్‌ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ విచారణలో నిర్ధారణ అయినందున ఆ సంస్థపై రు.1,585.08 కోట్ల జరిమానాను విధిస్తున్నట్టు బోర్డు ఒక ప్రకటనలో వివరించింది. ఈ కేసులో కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) 2016లో చార్జ్‌షీట్ నమోదు చేసిన విషయం తెలిసిందే. ఇదిలా వుండగా ఆంట్రిక్స్ కార్పొరేషన్ మాజీ ఎండితోపాటు దేవాస్ మల్టీమీడియాకు చెందిన కొందరు అధికారులు మనీలాండరింగ్‌కు పాల్పడినట్టు ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను విచారణకు స్వీకరిస్తున్నటుట బెంగళూరులోని ఒక ప్రత్యేక న్యాయస్థానం ప్రకటించటం గమనార్హం. ఈ మేరకు ఆంట్రిక్స్ మాజీ ఎండి సిద్ధార్థ మూర్తి, దేవాస్ సీఈఓ రామచంద్రన్ విశ్వనాధన్, ఇస్రో మాజీ ఉద్యోగి, దేవాస్ డైరెక్టర్ ఎంజి చంద్రశేఖర్ తదితరులకు కోర్టు సమన్లు జారీ చేసినట్టు తెలుస్తోంది.

అంతర్జాతీయం

త్వరలో పార్లమెంట్ ఎన్నికలు : మదురో

కారకాస్: దేశంలో ప్రస్తుతం శాంతి సుస్థిరతలను భగ్నం చేసేందుకు అమెరికా మద్దతుతో కొనసాగుతున్న కుట్రను భగం చేయటానికి త్వరలోనే పార్లమెంటరీ ఎన్నికలు నిర్వహిస్తామని వెనిజులా అధ్యక్షుడు నికొలస్ మదురో ప్రకటించారు. బలివేరియన్ విప్లవ 20వ వార్షికోత్సవ సందర్భంగా మదురో మద్దతుదారులు తీసిన భారీ ర్యాలీ, బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ ఈ ప్రకటన చేశారు. గత ఆగస్టులో తనపై విఫల హత్యయత్నం జరిగిన తర్వాత మదురో బహిరంగంగా ప్రసంగించటం ఇదే తొలిసారి.

దేశంలో ప్రజాస్వామ్యాన్ని, మదురో ప్రభుత్వాన్ని కాపాడుకుంటామంటూ వేలాది మంది ఈ ర్యాలీలో నినాదాలు చేశారు. 'మీరు కోరితే, మేమూ అదే కోరుకుంటున్నాం' అంటూ పార్లమెంట్ ఎన్నికలకు ప్రతిపక్షం చేస్తున్న డిమాండ్‌ను ఆయన ప్రస్తావించారు. పార్లమెంట్ అధికారాలకు చట్టబద్ధత కల్పించేందుకు తమ ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని ఆయన చెప్పారు. 2016 నుండి ప్రతిపక్షాల ఆధిపత్యంలో వున్న పార్లమెంట్‌లో సాధారణ కార్యకలాపాలు గాడి తప్పిన విషయం తెలిసిందే.



సోమాలియాలో అమెరికా దాడులు

- 13 మంది మిలిటెంట్లు హతం



మొగధీషు :అమెరికా వైమానిక దాడులు సోమాలియా రాజధాని మొగధీషులో వైమానిక దాడులకు పాల్పడ్డాయి. ఈ దాడుల్లో 13 మంది మిలిటెంట్లు హతమైనట్టు యూఎస్ ఆర్మీ ధ్రువీకరించింది. మృతిచెందిన వారంతా అల్‌షాబాబ్ ఉగ్రసంస్థకు చెందిన సభ్యులని తెలిపింది. మొగధీషు నుంచి 48 కిలోమీటర్ల దూరంలో ఉన్న గాందర్షే ప్రాంతంలో ఈ దాడులు జరిపినట్టు అధికారులు తెలిపారు. ఈ ప్రాంతంలో కొంతకాలంగా అల్‌షాబాబ్ మిలిటెంట్ల కదలికలున్నట్టు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు దాడులు నిర్వహించామని అన్నారు. ఈ ఏడాది 10 దాడులు నిర్వహించినట్టు యూఎస్ ఆర్మీ తెలిపింది. కాగా, సోమాలియా సరిహద్దులో భద్రత కట్టుదిట్టం చేసినట్టు ఆర్మీ ప్రకటించింది. శనివారం మొగధీషు చెక్‌పాయింట్ లక్ష్యంగా మిలిటెంట్లు ఆత్మాహుతికి పాల్పడ్డారని తెలిపింది.

మొదటి ప్రపంచ యుద్ధం నాటి గ్రెనేడ్..!



హాంకాంగ్‌లోని క్రిస్ప్ కర్మాగారంలో మొదటి ప్రపంచ యుద్ధంనాటి గ్రెనేడ్ లభ్యమైంది. మొదటి ప్రపంచ యుద్ధం (1914-18) సంభవించిన సమయంలో ఫ్రాన్స్ సైనికులు దీన్ని హాంకాంగ్‌లోని క్రిస్ప్ కర్మాగా రానికి ఓ ఆలుగడ్డ సంచిలో తరలించినట్టు సాయి కుంగ్ జిల్లాలోని కల్బీ క్రిస్ప్ కర్మాగారాం నిర్వాహకులు గుర్తించారు. ఈ జర్మనీ గ్రెనేడ్ 3 ఇంచుల పరిమాణంలో ఉందని చెప్పారు.

ఆస్ట్రేలియా నుంచి అమెరికాకు శరణార్థుల తరలింపు



సిడ్నీ: ఆస్ట్రేలియా నుంచి అమెరికాకు శరణార్థులను తరలించినట్టు ఆస్ట్రేలియా ప్రకటిం చింది. నౌరు దీవుల్లో నిర్బంధంలో ఉన్న నలుగురు చిన్నారులను అమెరికాకు పంపినట్టు ప్రధాని స్కాట్ మారిసన్ వెల్లడించారు. ఇరుదేశాల మధ్య శరణార్థుల బదలాయింపునకు సంబంధించి వ్యూహాత్మక ఒప్పందం కుదిరిందన్నారు. ఈ ఒప్పందంలో భాగంగా ఆస్ట్రేలియాలోని శరణార్థులను అమెరికాకు తరలించారు. నౌరా దీవి లోని చిన్నారులు అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆస్ట్రేలియా ఇమ్మిగ్రేషన్ మంత్రి డేవిడ్ కోల్‌మన్ తెలిపారు. వీరిని అమెరికాకు తరలిస్తామని చెప్పారు. నౌరూ, పపువా న్యూగినియాలోని శరణార్థుల్లో 1250 మందికి ఆశ్రయం కల్పించేందుకు 2016లో అమెరికా అంగీకరించిందన్నారు. కాగా, ఆస్ట్రేలియాలోకి ప్రవేశించిన అక్రమ వలసదారులను ఆదేశ ప్రభుత్వం నౌరూ దీవిలో నిర్బంధి స్తున్నది. ఈ దీవిలో చిన్నారులను, మహిళలను నిర్బంధిస్తున్నారు. ఈ దీవి నుంచి కొద్ది దూరంలో ఉన్న మానస్ దీవిలో పురుషులను నిర్బంధిస్తున్నారు.

ఈ జైలులో మేముండలేం...

- న్యూయార్క్ జైలులో ఖైదీల వినూత్న నిరసనలు



వాషింగ్టన్ : న్యూయార్క్ నగరంలోని బ్రూక్లిన్ జైలు ఖైదీలు ఆదివారం నిరసనబాట పట్టారు. తామంతా కారాగారం అనుభవిస్తున్న జైలులో సరైన మౌళికవసతులు లేవంటూ ఆందోళన చేపట్టారు. అంతేగాకుండా, విద్యుత్ సరఫరా లేదని, జైలులో విపరీతమైన వేడి ఉందంటూ నిరసన తెలిపారు. అధిక ఉష్ణోగ్రత కారణంగా తామంతా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని నినదించారు. జైళ్ల శాఖ అధికారులు ఉన్నతాధికారులు తక్షణమే స్పందించాలని వారు అభ్యర్థించారు. ఖైదీలు చేపట్టిన ఆందోళన కార్యక్రమాలకు వారి కుటుంబ సభ్యులు కూడా జైలు బయట మద్దతు తెలపడం గమనార్హం. కాగా, యూఎస్ హౌస్ మెంబర్ జోరోల్డ్ నాడ్లెర్ ఖైదీలు చేపట్టిన ఆందోళన కార్యక్రమానికి మద్దతు తెలిపారు. ప్రభుత్వం తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు.

పోప్ చరిత్రాత్మక పర్యటన

దుబాయ్‌లో తొలిసారి క్రైస్తవ మతగురువు



దుబాయ్: క్రైస్తవ మత గురువు పోప్ ఫ్రాన్సిస్ చరిత్రాత్మక పర్యటనకు బయల్దేరారు. యూఏఈలో ఆయన మూడు రోజుల పాటు పర్యటించనున్నారు. దుబాయ్‌లో జరగనున్న ఇంటర్‌ఫెయిత్ కాన్ఫరెన్స్‌కు ఆయన హాజరు కానున్నారు. ఈ సదస్సుకు హాజరుకావాలని అబుదాబీ యువరాజు షేక్ మహమ్మద్ బిన్ జయేద్ అల్ నెహ్యాన్ ఆయనను ఆహ్వానించారు. పోప్ ఇప్పటికే వాటికన్ సిటీ నుంచి ప్రత్యేక విమానంలో బయల్దేరారు. మంగళవారం అబుదాబీలోని జాయెద్ స్పోర్ట్స్ సిటీ స్టేడియంలో పోప్ ప్రసంగించనున్నారు. ఈ సదస్సుకు దాదాపు లక్షా 35 వేల మంది హాజరయ్యే అవకాశముంది. 'సోదరభావం, సహనశీలతలకు నిదర్శనంగా ఉండేందుకు ప్రయత్నిస్తోంది. వివిధ సంస్కృతులు కలిసే ప్రదేశం' అని పోప్ దుబాయ్‌కు కితాబిచ్చారు. తన పర్యటనలో భాగంగా కైరోకు చెందిన ఇస్లాం మతగురువు అల్-అజహర్ ఇమామ్‌తో కూడా భేటీ కానున్నారు. యెమన్‌లో జరుగుతున్న యుద్ధాన్ని పోప్ పలుమార్లు ఖండించారు.

ఈ యుద్ధంలో భాగంగా సౌదీతోపాటు యూఏఈ కూడా యెమన్‌పై దాడులు నిర్వహిస్తోంది. గత ఏడాది పోప్ మాట్లాడుతూ యెమన్‌లో మానవీయత దిగజారకుండా కాపాడుకోవాలని అంతర్జాతీయ సమాజాన్ని ఆయన కోరారు. ఈ నేపథ్యంలో పోప్ ఇక్కడికి రానుండటం విశేషం. యుఏఈలో దాదాపు 10 లక్షల మంది రోమన్ కేథలిక్‌లు ఉన్నారు. వీరిలో అత్యధిక మంది భారత్, ఫిలిప్పిన్స్ నుంచి వచ్చి స్థిరనివాసాలు ఏర్పరుచు కున్నవారే. ఇదిలా ఉండగా, క్రైస్తవ మతగురువు పోప్ ఫ్రాన్సిస్ తొలిసారిగా దుబాయ్‌లో పర్యటించనున్నారు. 2001లో పోప్ జీన్ పాల్-2 తొలిసారిగా ఓ మసీదులో ప్రవేశించారు. 1964లో పోప్ పాల్-6 దుబాయ్‌లో పర్యటించారు. పోప్ పర్యటనతో ఇస్లాం, క్రైస్తవ మతస్థుల మధ్య స్నేహభావం, సౌభ్రాతృత్వాన్ని పెంపొందిస్తుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. గల్ఫ్ దేశాల్లో 40లక్షల మంది క్రైస్తవులు నివసిస్తున్నారు. దుబాయ్‌లో క్రైస్తవుల జనాభా 10లక్షల మంది. ఖతార్, ఒమన్, బహ్రెయిన్ నగరాల్లో క్రైస్తవ ప్రార్థనాలయాలు ఉన్నాయి.

సిరియాలో కూలిన భవనం

- 11 మంది మృతి, మృతుల్లో నలుగురు చిన్నారులు

డమాస్కస్ :సిరియాలోని అలెప్పో నగరంలో ఓ పురాతన భవనం కుప్పకూలింది. ఈ ఘటనలో 11 మంది మృతి చెందారు. మృతుల్లో నలుగురు చిన్నారులు ఉన్నారు. ఈ ఘటనలో ఒకే ఒక్క చిన్నారి ప్రాణాలతో బయటపడింది. తిరుగుబాటుదారుల కార్యకలాపాలు అధికంగా సలాహెద్దీన్ నగరంలో ఈ ఘటన జరిగింది. ఈ ప్రాంతంపై గతంలో సిరియా, రష్యా బలగాలు వైమానిక దాడులు నిర్వహించినట్టు అధికారులు తెలిపారు. దీంతో, పలు భవనాలు పాక్షికంగా ధ్వంసమయ్యాయి. అలెప్పో నగరంలోని భవనాలు కూలే ప్రమాదముందని 2017లోనే ఐరాస హెచ్చరించింది. అయితే, కొన్ని కుటుంబాల సభ్యులు మాత్రమే మరమ్మతులపై దృష్టిపెట్టారు. మిగతావారు ఐరాస హెచ్చరికలను బేఖాతర్ చేశారు. గతంలో చోటుచేసుకున్న వైమానిక దాడుల కారణంగా పురాతన భవనాలు కూలే ప్రమాదముందని అధికారులు హెచ్చరిస్తున్నారు. వైమానిక దాడుల కారణంగా దెబ్బతిన్న భవనాల పునర్ నిర్మాణానికి 400 బిలియన్ డాలర్లు ఖర్చయ్యే అవకాశముందని గతంలో అధికారులు తెలిపారు.

ఈజిప్టులో ప్రాచీన సమాధులు

- 50 మమ్మీలను గుర్తించిన పురాతత్వ శాస్త్రవేత్తలు

కైరో: ఈజిప్టులో పురాతత్వ శాస్త్రవేత్తలు తాజాగా మరిన్ని పురాతన మమ్మీలను కనుగొన్నారు. ఇటీవల టాలిమిక్ శకానికి చెందిన ఒక పురాతన శ్మశానాన్ని గుర్తించారు. దీనిలో దాదాపు 50 మమ్మీలను వెలికితీశారు. వీటిలో 12 చిన్నపిల్లల శరీరాలను భద్రపర్చినవిగా పేర్కొన్నారు. ఈజిప్టులోని తూర్పు మల్లావిలో టునా ఎల్ గెబల్ అనే ఒక ప్రదేశంలో తొమ్మిది మీటర్ల లోతైన గదులను కనుగొన్నారు. వీటిల్లో ఈ మమ్మీలను గుర్తించారు. ఇవి రోమన్ లేదా బైజాన్టియన్ కాలం నాటివిగా భావిస్తారు. 50 మమ్మీల్లో 40 పూర్తిగా వెలికితీశారు. ఈ విషయాన్ని ఈజిప్టు పురావస్తు విభాగం సుప్రీం కౌన్సిల్ సెక్రెటరీ జనరల్ ముస్తఫా వజీరీ పేర్కొన్నారు. కొన్ని మమ్మీలపై నాటి భాషలో రాసిన విశేషాలు ఉన్నాయి. ఈజిప్షియన్ కాలంలో దీనిని సాధా రణ ప్రజలు వినియోగిం చేవారని పేర్కొన్నారు. ఈ మమ్మీలను చాలా వరకు కుండల్లో భద్రపర్చారు. మిన్యా విశ్వవిద్యాలయం నేతృత్వంలో చేపట్టి న ఈ సంయుక్త కార్యక్రమంలో తొలి సారి ఈ మమ్మీలను కనుగొన్నారు.



'బౌటెఫ్లికాకే మా మద్దతు'

అల్జీర్స్ : అల్జీరియా అధ్యక్ష ఎన్నికల్లో ప్రస్తుత అధ్యక్షుడు బౌటెఫ్లికా (81) మరోసారి పోటీ చేయాలని అధికారపార్టీ కూటమిలోని నాలుగు పార్టీలు అభ్యర్థించాయి. తమ ప్రెసిడెంట్ అభ్యర్థి బౌటెఫ్లికానే అంటూ ఆదివారం ఉమ్మడి ప్రకటన జారీ చేశాయి. అల్జీరియాలో ఏప్రిల్‌లో అధ్యక్ష ఎన్నికలు జరుగనున్నాయి. ఈ ఎన్నికల్లో పోటీ చేసే అంశంపై మాత్రం బౌటెఫ్లికా ఇంకనూ స్పందించలేదు. ప్రధాని అహ్మద్ ఔయహియా నేతృత్వంలో జరిగిన సమావేశంలో దిగువ సభ స్పీకర్, నేషనల్ లిబరేషన్ ఫ్రంట్ కో-ఆర్డినేటర్ మౌద్ బౌచారెబ్, ర్యాలీ ఫర్ హోప్ ఇన్ అల్జీరియా పార్టీ అమర్ గౌల్ తదితరులు పాల్గొని ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారు. కాగా, ఏప్రిల్ 18న జరగనున్న అధ్యక్ష ఎన్నికల్లో బౌటెఫ్లికానే పోటీ చేసి గెలుపొందాలని అధికార పార్టీ భావిస్తోంది. అయితే, గత కొంతకాలంగా బౌటెఫ్లికా అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. ఆయన పోటీ చేయకపోవచ్చుననే ఊహాగానాలు కూడా వినిపిస్తున్నాయి. మరో రెండు వారాల్లో ఆయన పోటీచేసే అంశంపై స్పష్టత వచ్చే అవకాశముంది.





శబరిమలలో సమానత్వం లేకుండా స్వేచ్ఛ లేదు

నూతన సంవత్సర ప్రారంభం రోజునే ఐదు మిలియన్ల మహిళలు తమకు కూడా పురుషులవలెనే అయ్యప్ప సన్నిధిలో ప్రార్థనలు చేసుకునే హక్కు కావాలని కోరుతూ 620 కి.మీ. పొడవునా బలమైన "మహిళా కుడ్యం" నిర్మించారు. 2019లో నిర్మించిన ఈ గోడ 1927 నాటి మహాద్ పాదయాత్రను గుర్తుచేయటం లేదూ? అవును సరిగ్గా అలాగే ఉంది. "మార్చి 20, 1927న అంబేద్కర్ నాయకత్వంలో వేలాదిమంది మహార్లు చేసిన ప్రదర్శన భారతదేశ చరిత్రలో ఒక కొత్త మలుపు" అని మహాద్ సత్యాగ్రహ నిర్వాహకులలో ఒకరైన ఆర్.బి.మోరే రాసారు. 30 ఏండ్ల అనంతరం అక్టోబర్1956లో నాగపూర్‌లో ఐదు లక్షల మంది బౌద్ధమతంలోకి మారడానికి అంబేద్కర్‌ను అనుసరించారు. అతడు వారందరికీ హిందూమతాన్ని, అది ఇచ్చిన కులవ్యవస్థ, వివక్షను కూడా వదిలేయమని కోరాడు. కానీ కేరళ్లోనైనా ఇంకెక్కడైన మహిళలు కేవలం మహిళలైనందున వారిని అణచివేస్తున్న, వివక్ష చూపుతున్న పితృస్వామ్య భావజాలం నుండి, మతపరమైన నేపథ్యం నుండి బయటపడి సామూహిక మతమార్పిడికి పాల్పడలేరు. జెండర్, కులం రెండూ హిందూ సమాజంలో పునాదులు. ఏ మతంలోనైన ఇదే వర్తిస్తుంది. అయితే ఈ రెండు రకాల వివక్షలకు గురవుతున్న వారి ప్రతిస్పందన అన్ని సమయాలలో ఒక్కటిగా ఉండదు. హిందూమతంలో కులాన్ని అంగీకరించనివారు అంబేద్కర్‌లాగా బౌద్ధాన్నో మరో మతన్నో స్వీకరించగలరు కానీ జెండర్ వివక్షకు గురవుతున్న మహిళలు ఏమి చేస్తారు? ఇండియాలోని మహిళా ఉద్యమాలు, కేరళలో సుదీర్ఘకాలంగా వెళ్లూనుకున్న కమ్యూనిజం, సుప్రీంకోర్టు తీర్పు, వివిధ రకాల వేదికలు - శబరిమలలో న్యాయం జరగాలని కోరుకుంటున్న మహిళలకు చేయుతనిస్తున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో అంబేద్కర్ అనుసరించిన మతమార్పిడి మనకు ఎటువంటి మార్గం చూపించదు.

జనవరి 2న బిందు అమ్మిని, కనకదుర్గ అనే మహిళలు శబరిమల అయ్యప్ప గుడిలోకి ప్రవేశించారనే కారణంతో గుడి పూజారులు "శుద్ధి" కార్యక్రమం నిర్వహించారు. ఈ విషయం వింటే 1927లో మహారాష్ట్రలో చోటుచేసుకున్న సంఘటన గుర్తుకొస్తోంది. 1927లో డా.బిఆర్.అంబేద్కర్ అంటరానితనానికి నిరసనగా ఊరేగింపుగా వెళ్లి మహాద్‌లోని చెరువులోకి దిగి నీరు తాగారు. దానితో చెరువు అపవిత్రమైపోయిందని ఆగ్రహించిన బ్రాహ్మణులు108 బిందెల ఆవు పంచాదికాలు అంటే ఆవు పాలతోపాటు పేడ, మూత్రం మొదలైన వాటిని కుమ్మరించారు.

మహాద్ జ్ఞాపకాలు

మార్చి 19-20, 1927 మరియు డిసెంబర్ 25, 1927 - రెండు దఫాలుగా అంబేద్కర్ మహాద్‌లో సత్యాగ్రహం చేశారు. అంబేద్కర్‌తో సహ మహార్లందరు సామూహికంగా చెరువు నీరు తాగటం ఆచారాలు ఉల్లంఘనకు చిహ్నంగా భావించారు. రెండు దశల్లోనూ నిరసన కార్యక్రమాన్ని శాంతియుతంగా, క్రమశిక్షణతో నిర్వహించాలని వారు ప్రయత్నించినా సంప్రదాయవాదులు హింసాత్మక సంఘటనలతో దానిని భగ్నం చేశారు. మహార్ సత్యాగ్రహులను చెదరగొట్టే పేరుతో ముకదాడులు జరిపేవారితో పోలీసులు కుమ్మక్కయ్యారు. సామాజిక పెత్తనం, రాజకీయ పలుకుబడి కలిగిన హిందూ మతస్తుల మనోభావాలను గాయపరిస్తే నష్టమని తలచిన బ్రిటిష్ పాలకులు కూడా వారి వైపే వత్తాసు పలికారు.

"హిందూ ఛాందసవాదులు మానవత్వానికి పెద్ద గుదిబండ వంటివారు" అంబేద్కర్ జీవితచరిత్ర రాసిన ధనుంజయ కౌర్ మహాద్‌లో జరిగిన సంఘటనలు వివరిస్తూ అన్న మాటలివి. ఊరిలో ఇతర ప్రజలందరికీ చెరువులోని నీరు ఎంత అవసరమో అస్పృశులుగా పిలవబడే వారికి కూడా అంతే అవసరం. అది మనుషులుగా వారి హక్కు. అందువల్లనే దీన్ని సాధించటం కోసం ఆ సమయంలో అంబేద్కర్ దృష్టి, కృషి మొత్తం మంచినీటి చెరువు పైనే కేంద్రీకరించారు. అప్పుడు పక్కనే ఉన్న వీరేశ్వర్ గుడిలోకి ప్రవేశించటంపైన ఆయనకు ఆసక్తి లేదు. అయితే దాని తరువాత కాలంలో జరిగిన ఆలయ ప్రవేశ సత్యాగ్రహంలో అంబేద్కర్ తన పాత్ర పోషించారు. 1929లో పుణేలోని పార్వతీ ఆలయంలోకి, 1930 నుండి1934 వరకు నాసిక్‌లో జరిగిన కాలరాం ఆలయ ప్రవేశ దీక్షలోను ఆయన భాగస్వామి అయ్యారు. చివరికి ఈ ప్రచారాలు, ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. బ్రహ్మణవాదంలోని అధికారం, బహిష్కారం, వ్యక్తిగత ఆస్తి మొదలైన అధిక్షేపణలన్నీ ఉపయోగించి అగ్రకులస్థులు దళితులను అడ్డుకున్నారు. ప్రత్యక్షంగా భౌతిక దాడులకు దిగటమే కాదు వలస పాలకుల లా అండ్ ఆర్డర్ యంత్రాంగాన్ని తమకు అనుకూలంగా వాడుకున్నారు. తమకు జరిగిన అవమానానికి ప్రతీకారంగా మొదట శుద్ధి కార్యక్రమం చేశారు. తరువాత ప్రభుత్వ అధికారుల నుండి స్టే ఆర్డర్ తెచ్చుకున్నారు. ఆపైన చట్టపరంగా కేసులు బనాయించారు. పైగా బెదిరింపు ఎత్తుగడలకు పాల్పడటానికి కూడా వారు తటపటాయించలేదు.

గాంధీగారి మాటలతో స్ఫూర్తి పొందిన అంబేద్కర్ మహాద్‌లో సత్యాగ్రహాన్ని ఎంచుకున్నారు. తరువాత 1924లో ట్రావెన్కోర్ సంస్థానంలో జరిగిన ఒక పోరాటం అంబేద్కర్‌లో చైతన్యాన్ని రగిల్చింది. తమకు వైకోమ్‌లోని శివాలయంలో ప్రవేశం కల్పించాలని కోరుతూ అత్యంత వివక్షకు గురవుతున్న



ఎఝూవ, పులయా కులస్తులు సంస్కరణవాద నాయకులు టికె.మాధవన్, కె.పి.కేశవ మీనన్ నాయకత్వంలో పెద్ద ఉద్యమం చేపట్టారు. ప్రముఖ చరిత్రకారుడు రామచంద్ర గుహ అభిప్రాయంలో ఈ ఉద్యమం ఆధునిక భారతదేశ చరిత్రలోనే అపూర్వమైనది. అభ్యుదయ కాముకులు, వ్యతిరేక గొంతుకలు, విభిన్న రాజకీయ సమూహాలు, వివిధ ప్రాంత ప్రజలు అందరూ ఒకే వేదికపైకి వచ్చారు. కేరళకు చెందిన శ్రీనారాయణ గురు, తమిళ నాయకుడు ఈ.వి.రామస్వామి పెరియార్, మహాత్మాగాంధీ వీరందరూ ఒకే లక్ష్యంగా ఏకమయ్యారు. "వారి గుడిలో దేవుని పూజించటానికి ప్రవేశించకుండా ఈ భక్తులను ఎందుకు నిరాకరిస్తున్నారో తెలపాలని గాంధీ, నంబూద్రి బ్రాహ్మణులను సూటిగా ప్రశ్నించారు.

కానీ ఒక దశాబ్దం తరువాత గాంధీ కులవివక్షను పరోక్షంగా సమర్థిస్తున్నట్టు గ్రహించిన అంబేద్కర్ గాంధీపైన అయిష్టతతో అతని నుండి వేరుపడ్డారు. అలాగే సత్యాగ్రహానికి అంత రాజకీయ సామర్థ్యం లేదనే విషయం అర్థం కావటంతో ఆ భ్రమలనుండి బయటకొచ్చారు. అలాగే 1935 అక్టోబర్‌లో నాసిక్ నగర శివారులోని ఐయోలాలో "తాను హిందువుగా జన్మించినప్పటికీ హిందువుగా మాత్రం చనిపోనని" ప్రకటించాడు. చెరువులు, దేవాలయాల్లో ప్రవేశానికి గతంలో తాను నిర్వహించిన పోరాటాల్లో కూడా హేతుబద్ధత లేదని భావించాడు. కరుడుగట్టిన మత పెత్తందారీ విధానాలు వివక్షాపూరిత పద్ధతులు ఎప్పటికి అందరికీ సమానత్వం, గౌరవం, మర్యాద కలగకుండా అడ్డుపడుతూనే ఉంటాయని భావించిన ఆయన తరువాత ఎటువంటి మతపరమైన విధానాలను కోరుకోలేదు.

విభిన్న రకాల వివక్షలు

శబరిమలలో జరిగిన శుద్ధీకరణ కార్యక్రమాన్ని పరిశీలిస్తే 1927నాటి మహాద్ సంఘటనతో పోలినట్టు, పోలనట్టు కూడా అనిపిస్తుంది. ఈ రెండు కేసుల్లోనూ ఒక ప్రత్యేక గ్రూప్‌ను వెలివెయ్యాలని (దూరంగా ఉంచాలని) ప్రయత్నించారు. ఇప్పుడు బహిష్టు కారణం చూపి 10-50 ఏండ్ల బాలికలు, మహిళలను శబరిమలలో అడ్డుకుంటున్నారు. శతాబ్దం క్రితం చావదర్ చెరువు వద్ద దళితులను అడ్డుకున్నారు. అయితే ఉన్న తేడల్లా నేటి స్వతంత్ర భారతదేశంలో రాజ్యాంగంలోని ఆర్టికల్14 అందరికి సమానత్వాన్ని కల్పించింది. దీనికి మరింత బలాన్ని చేకూరుస్తూ ఏ వయసు మహిళలైన 41 రోజులు దీక్ష తీసుకుని శబరిమల గర్భగుడిలో ప్రవేశించడానికి హక్కు ఉన్నదని సెప్టెంబర్ 2018లో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. దేశంలోనూ, మన జీవితాల్లోనూ అంబేద్కర్ ప్రవేశంతో మనకు సరైన రాజ్యాంగం, బలమైన న్యాయవ్యవస్థ ఏర్పడ్డాయి. అతడు కులానికి వ్యతిరేకంగా అలుపెరుగని పోరాటం చేస్తున్న సమయంలో మద్దతుగా నిలబడటానికి ఆ రోజున ఈ వ్యవస్థలు లేవు. ఈ అనుభవంతోనే అంబేద్కర్ గణతంత్ర భారతదేశానికి గొప్ప రాజ్యాంగాన్ని అందించాడు. దానిద్వారా అంటరానితనం చట్టవిరుద్ధం చేశారు. కుల లైంగిక వివక్ష లేకుండా అందరికీ సమాన పౌరసత్వం, ప్రాథమిక హక్కులు మొదలైనవి కల్పించారు. వలసవాద కాలంనుండి వైకోమ్ సంఘటనతో సహా దశాబ్దాల నుండి అనేక అభ్యుదయ పోరాటాలకు, రాజకీయాలకు పేరుగాంచిన కేరళలో మత ఛాందస, కులతత్వ, పితృస్వామ్య ఆనవాళ్లు తిరిగి మొలకెత్తటం జీర్ణించుకోలేని విషయం.

నూతన సంవత్సర ప్రారంభం రోజునే ఐదు మిలియన్ల మహిళలు తమకు కూడా పురుషులవలెనే అయ్యప్ప సన్నిధిలో ప్రార్థనలు చేసుకునే హక్కు కావాలని కోరుతూ 620 కి.మీ. పొడవునా బలమైన "మహిళా కుడ్యం" నిర్మించారు. 2019లో నిర్మించిన ఈ గోడ 1927 నాటి మహాద్ పాదయాత్రను గుర్తుచేయటం లేదూ? అవును సరిగ్గా అలాగే ఉంది. "మార్చి 20, 1927న అంబేద్కర్ నాయకత్వంలో వేలాదిమంది మహార్లు చేసిన ప్రదర్శన భారతదేశ చరిత్రలో ఒక కొత్త మలుపు" అని మహాద్ సత్యాగ్రహ నిర్వాహకులలో ఒకరైన ఆర్.బి.మోరే రాసారు. 30 ఏండ్ల అనంతరం అక్టోబర్1956లో నాగపూర్‌లో ఐదు లక్షల మంది బౌద్ధమతంలోకి మారడానికి అంబేద్కర్‌ను అనుసరించారు. అతడు వారందరికీ హిందూమతాన్ని, అది ఇచ్చిన కులవ్యవస్థ, వివక్షను కూడా వదిలేయమని కోరాడు. కానీ కేరళ్లోనైనా ఇంకెక్కడైన మహిళలు కేవలం మహిళలైనందున వారిని అణచివేస్తున్న, వివక్ష చూపుతున్న పితృస్వామ్య భావజాలం నుండి, మతపరమైన నేపథ్యం నుండి బయటపడి సామూహిక మతమార్పిడికి పాల్పడలేరు. జెండర్, కులం రెండూ హిందూ సమాజంలో పునాదులు. ఏ మతంలోనైన ఇదే వర్తిస్తుంది. అయితే ఈ రెండు రకాల వివక్షలకు గురవుతున్న వారి ప్రతిస్పందన అన్ని సమయాలలో ఒక్కటిగా ఉండదు. హిందూమతంలో కులాన్ని అంగీకరించనివారు అంబేద్కర్‌లాగా బౌద్ధాన్నో మరో మతన్నో స్వీకరించగలరు కానీ జెండర్ వివక్షకు గురవుతున్న మహిళలు ఏమి చేస్తారు? ఇండియాలోని మహిళా ఉద్యమాలు, కేరళలో సుదీర్ఘకాలంగా వెళ్లూనుకున్న కమ్యూనిజం, సుప్రీంకోర్టు తీర్పు, వివిధ రకాల వేదికలు - శబరిమలలో న్యాయం జరగాలని కోరుకుంటున్న మహిళలకు చేయుతనిస్తున్నాయి. ఇటువంటి పరిస్థితుల్లో అంబేద్కర్ అనుసరించిన మతమార్పిడి మనకు ఎటువంటి మార్గం చూపించదు.

సంస్కరణ- పునరుద్ధరణ

శబరిమలలో భారతీయ జనతా పార్టీ, సంఘ్ పరివార్ శక్తులు మహిళల కోరికకు వ్యతిరేకంగా మతఛాందసవాద మంటను రాజేస్తున్నాయి. అత్యంత తిరోగమి శక్తులైన మితవాద హిందూ జాతీయ వాద రాజకీయ సంస్థల నుండి అంతకన్నా ఏమి ఆశించలేం. కాంగ్రెస్ కూడా ఈ విషయంలో అవకాశవాద నిర్ణయం తీసుకోవటం చాలా నిరాశ కలిగించే అంశం. కేరళలో ప్రముఖ కాంగ్రెస్ నాయకులు తాము రెండు బలమైన రాజ్యాంగ సూత్రాలు - ఆర్టికల్14 సమానత్వం, ఆర్టికల్ 25 మతస్వేచ్ఛ మధ్య అడకత్తెరలో పోకచెక్కలాగా నలుగుతున్నామని చెబుతుండటం హాస్యాస్పదం. ఈ వాదనను ముందుకు తెస్తున్నవారికి అటు రాజ్యాంగంపైన, ఇటు హిందూ మతం మీద కనీస అవగాహన లేదన్న సంగతి స్పష్టం అవుతోంది.

మతస్వేచ్ఛ అంటే అర్థం తమ స్వంత, ఇష్టమైన మతాన్ని అనుసరించటం. అంతేకానీ ఇతరుల ప్రాథమిక హక్కులను అణచివేసే స్వేచ్ఛ కాదు. లేకపోతే శబరిమలకి పూజలు జరుపుకునేందుకు సుప్రీంకోర్టు మహిళల పక్షాన ఇచ్చిన తీర్పును, హక్కును వారించటం కాదు. నిజానికి హిందూమతం ఉన్నతమైన ఆత్మవిమర్శ, స్వీయదిద్దుబాటు, స్వీయాభివృద్ధి మొదలైన విలువలు, భిన్నత్వాన్నీ, నిరంతరం పురోగమించే తత్వాన్ని కలిగివుంది. ప్రత్యేకించి దక్షిణ భారతదేశంలో ఈ అంశాన్ని నిర్ధారించి అనేక ఉదాహరణలు ఉన్నాయి. ఇక్క ఆండాళ్ మరియు నందనార్, బసవన్నా మరియు అక్కమహాదేవి, అయ్యాంకలి మరియు నారాయణ గురు వంటి అత్యంత స్ఫూర్తిమంతులైన మహానుభావులు ఛాందసత్వాన్ని ఎదిరించారు. కుల, లింగ సంకెళ్లు తెంచేశారు. శతాబ్దం కిందటే చరిత్రాత్మక సంస్కరణ ఉద్యమాలను ఎక్కుపెట్టారు.

మనందరం గాంధీ, అంబేద్కర్ ఆశయాలు సిద్ధాంతాల గురించి వింటూ పెరిగిన ఆధునిక పౌరులం. ఏ మతాన్ని ఆచరించేవారిమైన మనం వారి వారసులుగా గతకాలపు రెచ్చగొట్టే ఆచారాలకు భిన్నంగా ప్రగతిశీలంగా ఆలోచించాలి. ప్రజాస్వామ్య భారతీయులుగా "ఎవరైతే అయ్యప్ప ఆలయంలోకి ప్రవేశించి అక్కడ పూజలు నిర్వహించుకోవాలని కోరుకుంటున్నారో వారందరికీ తలుపులు తెరవబడాలని" మనస్ఫూర్తిగా కోరుకుందాము.

అనన్య వాజపేయి, సీఎస్‌డీఎస్, న్యూ ఢిల్లీ

అనువాదం: పద్మశ్రీ

అంబేద్కర్ విగ్రహం ధ్వంసం

బందెలా యాదగిరి

రాష్ట్ర రాజధానికి కూతవేటు దూరంలో రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్. అంబేద్కర్ విగ్రహం ధ్వంసమైంది. దీంతో హైదరాబాద్ నగర శివారులో అలజడి పుట్టింది. అంబేద్కర్ విగ్రహం ధ్వంసమైందన్న విషయం తెలుసుకున్న దళిత సంఘాలు ఒక్కటై ఘటనా స్థలానికి చేరుకున్నాయి. ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆందోళనకు దిగాయి. దళిత సంఘాల ఐక్యమత్యానికి అధికార యంత్రాంగం స్పందించింది. సమస్య పరిష్కారానికి స్పష్టమైన హామీ ఇచ్చింది. నిందితుడిని గంటల వ్యవధిలో అదుపులోకి తీసుకొంది.

రాజ్యాంగ స్ఫూర్తి ప్రదాత డాక్టర్.బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి అవమానం జరిగింది. 70 సంవత్సరాల గణతంత్ర వేడుకలు జరిగిన మరుసటి రోజే ఇలాంటి దురదృష్టకరమైన సంఘటన చోటు చేసుకోవడం మేడ్చల్ జిల్లాలో ఒక్కసారిగా కలకలం సృష్టించింది. మేడ్చల్ జిల్లా, కీసర మండలం, రాంపల్లి గ్రామంలోని ప్రధాన చౌరస్తాలో ఉన్న అంబేద్కర్ తలను నరికేశారు. అక్కడే కొద్ది దూరంలో ఉన్న ఆజాద్ చంద్రశేఖర్ విగ్రహాన్నీ పాక్షికంగా ధ్వంసం చేశారు. అంబేద్కర్ విగ్రహం ధ్వంసమైందన్న విషయం తెలియడంతో గ్రామంలోని దళిత సంఘాలు మెయిన్ రోడ్డుపై బైఠాయించాయి. అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని అరెస్టు చేయాలని డిమాండ్ చేశాయి. అప్పటి వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని స్పష్టం చేశాయి. దళిత సంఘాలన్నీ ఒక్కటై ఆందోళనకు దిగిన విషయం తెలుసుకున్న కీసర సీఐ ప్రకాష్ పోలీస్ సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకున్నారు. అంబేద్కర్ విగ్రహాన్ని పరిశీలించారు. ఆందోళన చేస్తున్న గ్రామస్తులతో మాట్లాడి వారిని శాంతింపజేశారు. ఇందుకు పాల్పడింది గ్రామానికి చెందిన రిటైర్డ్ ఉద్యోగి చాందీయాగా గుర్తించి, అతన్ని అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. అంబేద్కర్ నూతన విగ్రహాన్ని ఇక్కడే





ఏర్పాటు చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చారు. మరోవైపు రాంపల్లిలో గ్రామస్తులు చేస్తున్న ఆందోళనతో కుషాయిగూడ ఏసీపీ శివకుమార్ హుటాహుటిన అక్కడికి చేరుకున్నారు. జరిగిన ఘటనపై గ్రామస్తులతో మాట్లాడారు. పడగొట్టిన చోటే అంబేద్కర్ విగ్రహాన్ని తిరిగి ప్రతిష్ఠిస్తామని హామీ ఇచ్చారు. పోలీసు అధికారులు స్పష్టమైన హామీ ఇవ్వడం, ఘటనకు కారణమైన నిందితుడిని అరెస్టు చేసినట్టు ప్రకటించడంతో ఎట్టకేలకు గ్రామస్తులు శాంతించారు. అయితే తక్షణమే అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేయడంతో పోలీసులు, అధికారులు సానుకూలంగా స్పందించారు. మరో వైపు అంబేద్కర్ విగ్రహం ధ్వంసం చేసిన విషయం తెలుసుకున్న మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. అంబేద్కర్ విగ్రహాన్ని అవమానించి ధ్వంసం చేసిన వ్యక్తిపై కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులను ఆదేశించారు. తక్షణమే డాక్టర్ బిఆర్.అంబేద్కర్, ఆజాద్ చంద్రశేఖర్ల విగ్రహాలను అదేచోట ప్రతిష్ఠించేందుకు తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో దళిత సంఘాలు శాంతించాయి. కానీ ఇలా ప్రతి రోజు ఏదోఒక చోట భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్.అంబేద్కర్ విగ్రహాలపై అధిపత్య కులాలు తమ అక్కసు వెల్లగక్కడాన్ని దళిత సంఘాలు తీవ్రంగా ఖండించాయి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి. అంబేద్కర్ తలను చంద్రశేఖర్ ఆజాద్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులకు కఠిన శిక్ష విధించాలని కోరాయి.

సెల్ : 9949246671

మరో కులదురహంకార హత్య?

గొల్లపల్లి మురళి

నిజామాబాద్ జిల్లాలో మరో కులదురహంకార హత్య చోటుచేసుకుంది? అగ్రకుల అమ్మాయిని ప్రేమించాడని స్నేహితులే కడతేర్చారు?.. జిల్లాలోని భీంగల్ మండలం సికింద్రాపూర్ గ్రామంలో దళిత యువకుడి అనుమానాస్పద మృతిపై ఎన్నో అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. హత్య చేసి పొలంలో పడేసి ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేశారని మృతుని కుటుంబీకులు ఆరోపిస్తున్నారు. అయితే పోలీసులు ఎన్నికల విధుల్లో బిజీగా ఉండటంతో ఘటన ప్రదేశానికి వెళ్లిన ఏఎస్ఐ ఆత్మహత్యగా ప్రాథమికంగా నిర్ధారించడం గమనార్హం.



భీంగల్ మండలం సికింద్రాపూర్ గ్రామంలో మాల సామాజిక తరగతికి చెందిన సందీప్(28) అదే గ్రామానికి చెందిన ముటాడి కాపు అమ్మాయిని ప్రేమించాడు. ఇరువురు గత కొన్ని సంవత్సరాలుగా ప్రేమలో ఉన్నారు. ఈ క్రమంలో ఉపాధి నిమిత్తం సందీప్ గల్ఫ్ వెళ్లాడు. మొదట ఒకసారి వెళ్లి రాగా.. తాజాగా రెండు సంవత్సరాల క్రితం మరోసారి గల్ఫ్ వెళ్లి నాలుగు నెలల క్రితం సికింద్రాపూర్ గ్రామానికి వచ్చాడు. అయితే అమ్మాయితో నాటి నుంచి ప్రేమ వ్యవహారం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో గత జనవరి 23న బుధవారం ప్రభుత్వ పాఠశాల వద్ద జరుగుతున్న ఆటల పోటీలను తిలకిస్తున్న సందీప్‌ను తన స్నేహితులు చిన్నారెడ్డి, జగదీష్, శేఖర్, రవిలు 'మాట్లాడదాం రా' అంటూ బైక్‌పై ఎక్కించుకుని వెళ్లారు. ఆ సమయంలో మృతుని అక్క.. 'ఎక్కడికి తీసుకెళ్తున్నారు' అని ప్రశ్నించింది. 'ఇప్పుడే వస్తాం' అంటూ తీసుకెళ్లారు. కానీ అదేరోజు రాత్రి పొద్దుపోయిన తరువాత కూడా సందీప్ ఇంటికి రాలేదు. కుటుంబీకులు సందీప్‌కు ఫోన్ చేయగా.. 'స్విచ్చాఫ్ వచ్చింది. ఆయనను తీసుకెళ్లిన వ్యక్తులకు ఫోన్ చేస్తే 'వస్తాడు' అని చెప్పారు. అయినప్పటికీ ఎంతసేపటికి రాకపోవడంతో అనుమానించిన కుటుంబీకులు గ్రామ పరిసరాల్లో, పొలం గట్లల్లో వెతికారు. ఎన్నిసార్లు ఫోన్ చేసినా స్విచ్చాఫ్ వచ్చింది. తీరా 24వ తేదీ గురువారం



తెల్లవారుజామున సందీప్ మృతదేహం పొలాల గట్ల మధ్య పడి ఉంది. మృతదేహం పక్కనే క్రిమిసంహారక గుళికలుండటం గమనార్హం.

పోలీసుల నిర్లక్ష్యం

ఘటనపై పోలీసులకు సమాచారం చేరవేయగా.. ఎస్ఐ పంచాయతీ ఎన్నికల విధుల్లో ఉండటంతో ఏఎస్ఐ ఘటనా స్థలానికి వెళ్లాడు. మృతదేహం పక్కన పడి ఉన్న గుళికల ఆధారంగా ఆత్మహత్యగా నిర్ధారించాడు. కానీ కుటుంబీకులు సందీప్ మృతిపై అనుమానాలు వ్యక్తం చేశారు. స్నేహితులే తమ కండ్ల ముందే తీసుకెళ్లి హత్య



చేశారని చెబుతున్నా పోలీసులు వినిపించుకోలేదు. ఈ విషయం దళిత సంఘాలకు తెలియడంతో గ్రామంలో ఆందోళన చేపట్టారు. ఈ పరిస్థితుల్లోనే పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని జిల్లా ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతున్ని తీసుకెళ్లిన నలుగురు నిందితుల్లో.. రవికి సంబంధించిన బంధువుల అమ్మాయితో సందీప్ ప్రేమలో ఉన్నట్టు గ్రామస్తులు చెబుతున్నారు. కాగా సందీప్‌ది ముమ్మాటికీ హత్యేనని ప్రజా, దళిత సంఘాల నాయకులు స్పష్టం చేస్తున్నారు. లేకుంటే సందీప్ మృతిచెందిన తర్వాత ఆయన నలుగురు స్నేహితులు ఎందుకు పరారీలో ఉన్నారని ప్రశ్నిస్తున్నారు. ఇలాంటి ఎన్నో ప్రశ్నలకు పోలీసుల వద్ద సమాధానం లేకుండా పోయింది. కావాలనే పోలీసులు ఆత్మహత్యగా చిత్రీకరించే ప్రయత్నం చేస్తున్నారని దళిత సంఘాలు, మృతుడి బంధు వర్గం ఆగ్రహం, ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

సెల్ : 9963304326

హామిల్టన్ ఓటమి తర్వాత మమ్మల్ని పరీక్షించుకోవాలని భావించాం. జట్టుగా సమష్టి ప్రదర్శన చేయాలనేది వ్యూహం. 18/4 వద్ద, ఎవరో ఒకరు నిలవాల్సిన స్థితి. అంబటి రాయుడు నిలదొక్కుకున్నాడు. విజయ్, జాదవ్ మంచి సహకారం అందించారు. చివర్లో హార్దిక్ పాండ్య ఆట అద్భుతం. బ్యాట్‌తో, బంతితో ఎంతో పరిణతి చూపించాం. మంచు ప్రభావంతో చివర్లో పిచ్ ఫ్లాట్‌గా మారింది. ఒకవేళ ఇది సిరీస్ నిర్ణయాత్మక మ్యాచ్ అయి ఉంటే, కచ్చితంగా తొలుత బౌలింగ్ ఎంచుకునేవాళ్లం. న్యూజిలాండ్‌ను సొంతగడ్డపై ఓడించటం అంత తేలిక కాదు. 4-1 విజయం గొప్ప ఘనత'

- రోహిత్ శర్మ, భారత కెప్టెన్



స్వింగ్ పరీక్ష పాసయ్యారు

టాస్ నెగ్గిన రోహిత్ మరోసారి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్నాడు. బంతి తిరుగుతోంది. స్వింగ్‌కు వికెట్లూ కూలుతున్నాయి. చూస్తుండగానే రోహిత్ (2), ధావన్ (6), శుభ్‌మన్ (7), ధోని (1) పెవిలియన్‌కు చేరారు. 18/4తో మరో పతనాంచుల్లో టీమ్ ఇండియా. హామిల్టన్ ఫలితం వెల్లింగ్టన్‌లో పునరావృతం కావటం ఖాయమని అనిపించింది.

బంతి తిరుగుతోన్న వేళ బ్యాటింగ్ కష్టమైనా, తెలుగు తేజం అంబటి రాయుడు (90) నిలబడ్డాడు. గడ్డు పరిస్థితుల్లో క్రీజులో నిలదొక్కుకుని భారత్‌ను సురక్షిత గమ్యానికి చేర్చాడు. విజయ్ శంకర్, కేదార్ జాదవ్‌లకు తోడు హార్దిక్ పాండ్య మెరుపులతో పేసర్ల అనుకూల పిచ్‌పై మెరుగైన ప్రదర్శన చేశారు. బంతితో బౌలర్లూ మెరవటంతో 253 పరుగుల లక్ష్యాన్ని కాపాడుకున్న భారత్ 35 పరుగుల తేడాతో అద్భుత విజయం సాధించింది.

పిచ్ పేసర్లకు అనుకూలమని తెలుసు. తొలుత బ్యాటింగ్ చేయటం కష్టమనీ తెలుసు. అయినా, భారత్ బ్యాటింగే ఎంచుకున్నది. ఆరంభంలో టపటపా వికెట్లు కోల్పోయింది. కానీ మిడిల్ ఆర్డర్ రాణించటంతో రోహిత్‌సేన అనుకున్న లక్ష్యాన్ని సాధించింది. ప్రపంచకప్ ముంగిట ఆందోళన కలిగిస్తోన్న మిడిల్ ఆర్డర్, కఠిన పరిస్థితుల్లో సత్తా చాటింది. టాప్ ఆర్డర్ కుప్పకూలినా, మేమున్నామంటూ పోరాడింది. సిరీస్ విజయాన్ని పరిపూర్ణం చేసింది!. చివరి వన్డే విజయంతో 4-1తో సిరీస్ భారత్ వశపర్చుకున్నది. ఫిబ్రవరి 6న తొలి టీ20తో ధనాధన్ వేట ఆరంభం కానున్నది.

- కఠిన పరిస్థితుల్లో మెరిసిన రాయుడు
- రాణించిన పాండ్య, శంకర్, జాదవ్
- చివరి వన్డేలో కివీస్ చిత్తు

4-1తో సిరీస్ భారత్ కైవసం



వన్డే సిరీస్ ట్రోఫీతో టీమ్ ఇండియా ఆటగాళ్ల విజయోత్సవం



అంబటి రాయుడు (90)

వెల్లింగ్టన్

వన్డే సిరీస్‌ను కోరుకున్న విధంగా ముగించింది టీమ్ ఇండియా. ప్రపంచకప్‌కు ముందు మిడిల్ ఆర్డర్ సామర్థ్యంపై అనుమానాలు పటాపంచలు అయిపోయేలా వెల్లింగ్టన్‌లో టీమ్ ఇండియా అదరగొట్టింది. 18/4తో టాప్ ఆర్డర్ వరుసగా రెండో మ్యాచ్‌లో విఫలమవగా.. మిడిల్ ఆర్డర్ నిలిచింది. తెలుగు తేజం అంబటి రాయుడు (90, 113 బంతుల్లో 8 ఫోర్లు, 4 సిక్స్‌లు) భారీ అర్ధ సెంచరీతో ఇన్నింగ్స్‌ను పునర్ నిర్మించాడు. విజయ్ శంకర్ (45, 64 బంతుల్లో 4 ఫోర్లు), కేదార్ జాదవ్ (34, 45 బంతుల్లో 3 ఫోర్లు) రాణించగా... హార్దిక్ పాండ్య (45, 22 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్స్‌లు) తనదైన శైలిలో ముగింపునిచ్చాడు. వందలోపే కుప్పకూలేలా కనిపించినా, మిడిల్ ఆర్డర్ మెరవటంతో తొలుత భారత్ 252 పరుగులు చేసింది. ఛేదనలో క్రమం తప్పకుండా వికెట్లు కోల్పోయిన న్యూజిలాండ్ 217 పరుగులకే కుప్పకూలింది. మణికట్టు స్పిన్నర్ చాహల్ (3/41), పేసర్లు మహ్మద్ షమి (2/35), హార్దిక్ పాండ్య (2/50) రాణించారు. అర్ధ సెంచరీ హీరో అంబటి రాయుడు 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలువగా, సీమర్ మహ్మద్ షమి 'ప్లేయర్ ఆఫ్ ది సిరీస్' అవార్డు దక్కించుకున్నాడు.

చాహల్, షమి చుట్టేశారు : 253 పరుగుల ఛేదనలో న్యూజిలాండ్‌కు ఆశించిన ఆరంభం దక్కలేదు. హెన్రీ నికోల్స్ (8) త్వరగానే నిష్క్రమించగా, అతడి దారిలోనే కొలిన్ మన్రో (24), రాస్ టేలర్ (1) నడిచారు. మన్రో రెండు ఫోర్లు, ఓ సిక్సర్‌తో జోరు చూపించినా.. షమి బంతికి వికెట్ వదులుకున్నాడు. ఫామ్‌లో ఉన్న టేలర్‌ను పాండ్య పెవిలియన్‌కు పంపించాడు. నికోల్స్‌నూ అంతకముందే షమి సాగనంపాడు. 38/3తో న్యూజిలాండ్ ఒత్తిడిలో పడింది. ఈ దశలో కెప్టెన్ కేన్ విలియమ్సన్ (39, 73 బంతుల్లో 3 ఫోర్లు), టామ్ లాథమ్ (37, 49 బంతుల్లో 3 ఫోర్లు) వికెట్ల పతనాన్ని నిలువరించారు. మంచి భాగస్వామ్యంతో ఇన్నింగ్స్‌ను నిలబెట్టిన కేన్, టామ్ జోడీని కేదార్ జాదవ్ విడదీశాడు. దీంతో కివీస్ పతనం జోరందుకున్నది. గ్రాండ్‌హోమె (11), మిచెల్ శాంట్నర్ (22)తో కలిసి జేమ్స్ నీషమ్ (44) పోరాడినా ఫలితం లేకపోయింది. ఏ దశలోనూ గమ్యం దిశగా సాగని కివీస్ ఛేదనకు 44.1 ఓవర్లలో తెరపడింది. 35 పరుగుల తేడాతో భారత్ విజయం సాధించింది.



హార్దిక్ పాండ్య (45)

రాయుడు మెరిశాడు : ప్రపంచకప్ జట్టులో చోటును పదిలం చేసుకునే ఇన్నింగ్స్ ఆడాడు తెలుగు స్టార్. కివీస్‌పై ఆరంభ మ్యాచుల్లో అజేయంగా 40 ప్లస్ పరుగులు చేసిన రాయుడు, నిలకడ కొనసాగించాడు. కానీ హామిల్టన్ పతనంలో అతడూ భాగమవటంతో రాయుడి సత్తాపై సందేహాలు తలెత్తాయి. అలాంటి పరిస్థితులే సవాల్ విసిరిన తాజా మ్యాచ్‌లో రాయుడు తన విలువేంటో చాటాడు. విజయ్ శంకర్ (45), కేదార్ జాదవ్ (34)లతో కలిసి కీలక భాగస్వామ్యాలు నెలకొల్పిన రాయుడు తృటిలో సెంచరీ చేజార్చుకున్నాడు. ఎనిమిది ఫోర్లు, నాలుగు సిక్సర్లు బాదిన రాయుడు స్వింగ్ బంతిపై విశేషంగా ఆకట్టుకున్నాడు. యువ ఆటగాళ్లతో కలిసి రాయుడు నెలకొల్పిన భాగస్వామ్యాలతో భారత్ ఐదో వన్డేలో అదిరే విజయం సాధించింది. చివర్లో హార్దిక్ పాండ్య (45) ధనాధన్ ముగింపు భారత్‌కు కలిసొచ్చింది. అంతకముందు టాస్ నెగ్గి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ 18 పరుగులకే నాలుగు వికెట్లు కోల్పోయింది. కెప్టెన్ రోహిత్ శర్మ క్లీన్ బౌల్డ్ కాగా, శిఖర్ ధావన్ క్యాచౌట్ అయ్యాడు. యువ ఆటగాడు శుభ్‌మన్ (7), ధోని (1) సైతం నిలువలేకపోయారు. న్యూజిలాండ్ పేసర్లు స్వింగ్‌తో చెలరేగినా ఎదురొడ్డి నిలిచిన మిడిల్ ఆర్డర్ 252 పరుగుల మెరుగైన స్కోరు సాధించింది. న్యూజిలాండ్ పేసర్లు మాట్ హెన్రీ (4/35), ట్రెంట్ బౌల్ట్ (3/39) రాణించారు.

హార్దిక్ హ్యాట్రిక్ : హార్దిక్ పాండ్య (45, 22 బంతుల్లో 2 ఫోర్లు, 5 సిక్స్‌లు) వెల్లింగ్టన్‌లో హ్యాట్రిక్ సిక్సర్లు బాదాడు. రెండు ఫోర్లు, ఐదు సిక్సర్లతో 22 బంతుల్లోనే 45 పరుగులు పిండుకున్న పాండ్య, చివర్లో వేగంగా పరుగులు రాబట్టాడు. కివీస్ స్పిన్నర్ టాడ్ ఆష్లె వేసిన ఇన్నింగ్స్ 47వ ఓవర్లో హార్దిక్ విశ్వరూపం చూపించాడు. ఆష్లె విసిరిన షార్ట్ బంతిని తొలుత వైడ్ లాంగ్ ఆన్‌లో సిక్సర్‌గా మలిచాడు. రెండో బంతిపై టైమింగ్ కుదరకపోయినా బలంగా బాది బౌండరీ ఆవలకు పంపించాడు. మూడో బంతికి మోకాలుని వెనక్కి వంచి లాగి పెట్టి కొట్టిన పాండ్య మిడ్ వికెట్ మీదుగా భారీ సిక్సర్ బాదాడు. స్లాగ్ ఓవర్లో పాండ్య మెరుపులతోనే భారత్ 250 ప్లస్ స్కోరు చేయగల్గింది.

మహి మ్యాజిక్ : 'ధోని ది ప్యాకేజ్' అని మహి మరోసారి రుజువు చేశాడు. మైదానంలో మహి ఉంటే, ఏదో రూపంలో మ్యాచ్‌ను మలుపు తిప్పగలడు ధోని. దశాబ్ద కాలంగా ముగింపు మొనగాడిగా ఆ పని చేసిన మహి, ఇప్పుడు క్రికెట్ బుర్రతో మ్యాజిక్ కొనసాగిస్తున్నాడు. నమ్మశక్యం కానీ రీతిలో స్టంపౌట్లు చేయటంలో ధోని దిట్ట. కానీ వెల్లింగ్టన్ మ్యాచ్‌లో ధోని మ్యాజిక్ రనౌట్‌తో మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. ఛేదనలో న్యూజిలాండ్ ధాటిగా సాగిపోతున్న వేళ జేమ్స్ నీషమ్ (44)ను ధోని రనౌట్ చేశాడు. కేదార్ జాదవ్ వేసిన ఇన్నింగ్స్ 37వ ఓవర్లో నీషమ్‌పై ఎల్బీకి అప్పీల్ చేశారు. కానీ అంపైర్ నిరాకరించాడు. ఈ సమయంలో బంతి ధోని వెనకాల ఉండిపోగా, నీషమ్ క్రీజు బయట ఉన్నాడు. ఇది గమనించిన ధోని అంపైర్ నాటౌట్‌ను పట్టించుకోకుండా, చాకచక్యంగా వికెట్లను గిరాటేశాడు. నాలుగు ఫోర్లు, రెండు సిక్సర్లతో ప్రమాదకరంగా పరిణమించిన నీషమ్ ఊహించని రనౌట్‌తో వెనుదిరగ తప్పలేదు. నీషమ్ నిష్క్రమణతో మ్యాచ్ పూర్తిగా భారత్ చేతుల్లోకి వచ్చినట్టైంది.

భారత్ ఇన్నింగ్స్ : రోహిత్ శర్మ (బి) హెన్రీ 2, శిఖర్ ధావన్ (సి) హెన్రీ (బి) బౌల్ట్ 6, శుభ్‌మన్ గిల్ (సి) శాంట్నర్ (బి) హెన్రీ 7, అంబటి రాయుడు (సి) మన్రో (బి) హెన్రీ 90, ఎం.ఎస్ ధోని (బి) బౌల్ట్ 1, విజయ్ శంకర్ రనౌట్ (నీషమ్/మన్రో) 45, కేదార్ జాదవ్ (బి) హెన్రీ 34, హార్దిక్ పాండ్య (సి) బౌల్ట్ (బి) నీషమ్ 45, భువనేశ్వర్ కుమార్ (సి) టేలర్ (బి) బౌల్ట్ 6, మహ్మద్ షమి రనౌట్ (బౌల్ట్) 1, యుజ్వేంద్ర చాహల్ నాటౌట్ 0, ఎక్స్‌ట్రాలు : 15, **మొత్తం : (49.5 ఓవర్లలో ఆలౌట్) 252.**

వికెట్ల పతనం : 1-8, 2-12, 3-17, 4-18, 5-116, 6-190, 7-203, 8-248, 9-252, 10-252.

బౌలింగ్ : మాట్ హెన్రీ 10-1-35-4, ట్రెంట్ బౌల్ట్ 9.5-2-39-3, నీషమ్ 5-0-33-1, గ్రాండ్‌హోమె 7-0-33-0, కొలిన్ మన్రో 10-0-47-0, శాంట్నర్ 3-0-18-0, ఆష్లె 5-0-35-0.

న్యూజిలాండ్ ఇన్నింగ్స్ : కొలిన్ మన్రో (బి) షమి 24, నికోల్స్ (సి) జాదవ్ (బి) షమి 8, విలియమ్సన్ (సి) ధావన్ (బి) జాదవ్ 39, రాస్ టేలర్ (ఎల్బీ) హార్దిక్ పాండ్య 1, టామ్ లాథమ్ (ఎల్బీ) చాహల్ 37, జేమ్స్ నీషమ్ రనౌట్ (ధోని) 44, గ్రాండ్‌హోమె (ఎల్బీ) చాహల్ 11, మిచెల్ శాంట్నర్ (సి) షమి (బి) హార్దిక్ పాండ్య 22, టాడ్ ఆష్లె (ఎల్బీ) చాహల్ 10, మాట్ హెన్రీ నాటౌట్ 17, ట్రెంట్ బౌల్ట్ (సి) షమి (బి) భువనేశ్వర్ 1, ఎక్స్‌ట్రాలు : 03, **మొత్తం : (44.1 ఓవర్లలో ఆలౌట్) 217.**

వికెట్ల పతనం : 1-18, 2-37, 3-38, 4-105, 5-119, 6-135, 7-176, 8-194, 9-204, 10-217.

బౌలింగ్ : భువనేశ్వర్ కుమార్ 7.1-0-38-1, మహ్మద్ షమి 8-0-35-2, హార్దిక్ పాండ్య 8-1-50-2, విజయ్ శంకర్ 4-0-19-0, యుజ్వేంద్ర చాహల్ 10-0-41-3, కేదార్ జాదవ్ 7-0-34-1.

నేను చెబుతున్నాను రాసి పెట్టుకోండి, భారత్ అత్యంత సమతూకంతో ఉన్న జట్టు. ప్రపంచంలో ఎక్కడైనా, ఎటువంటి పరిస్థితుల్లోనైనా టీమ్ ఇండియా కఠిన పోటీదారు. 2019 ప్రపంచకప్‌లో మన అవకాశం విషయానికొస్తే, భారత్ హాట్ ఫేవరెట్ అని చెప్పేందుకు ఎటువంటి సందేహం లేదు. ఆరంభంలో లయ అందుకోవటం కీలకం. ప్రపంచకప్ వేటలో భారత్‌కు ఎదురొచ్చే పోటీదారు ఇంగ్లాండ్ అని చెప్పగలను. న్యూజిలాండ్ వన్డే సిరీస్‌లో ఇబ్బంది పడినా, కివీస్ మెరుగైన జట్టు'

- సచిన్ టెండూల్కర్, మాజీ క్రికెటర్




తొలి రోజు సౌరాష్ట్రదే



- విదర్భ 200/7
- రంజీ ట్రోఫీ ఫైనల్

జైపూర్ : రంజీ ట్రోఫీ ఫైనల్లో సౌరాష్ట్ర తొలి రోజు ఆధిపత్యం చెలాయించింది. కీలక టాస్ కోల్పోయినా, బౌలర్ల మెరుపులతో డిఫెండింగ్ చాంపియన్ విదర్భను ఆ జట్టు ఇరకాటంలో నెట్టింది. కెప్టెన్ జైదేవ్ ఉనద్కత్ (2/26) సహా చేతన్, ప్రేరక్‌లు రాణించటంతో విదర్భ తొలి ఇన్నింగ్స్‌లో 200/7తో కష్టాల్లో కూరుకుపోయింది. స్టార్ బ్యాట్స్‌మన్ వసీం జాఫర్ (23), కెప్టెన్ ఫయజ్ ఫజల్ (16)లను స్వల్ప స్కోర్లకే పరిమితం చేసిన సౌరాష్ట్ర పట్టు బిగించింది. సంజయ్ రామస్వామి (2) విఫలమయ్యాడు. మోహిత్ కాలె (35), గణేశ్ సతీశ్ (32) మెరుగైన ఆరంభాల్ని సద్వినియోగం చేసుకోలేదు. వికెట్ కీపర్ అక్షయ్ వాడ్కర్ (45) విదర్భ తరపు అత్యధిక పరుగులు సాధించాడు. తొలి రోజు ఆట ముగిసే సమయానికి అక్షయ్ కర్నేవార్ (31), అక్షయ్ వాకారె (0)లు అజేయంగా ఆడుతున్నారు.



అదరహో విండీస్

- రెండో టెస్టులో ఇంగ్లాండ్ చిత్తు
- 2-0తో సిరీస్ కరీబియన్ల సొంతం

ఆంటిగ్వా : తొలి టెస్టు విజయం గాలి వాటం కాదని కరీబియన్లు నిరూపించుకున్నారు. ఆంటిగ్వా టెస్టులోనూ ఇంగ్లాండ్‌ను చిత్తు చేసి 10 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించారు. మరో టెస్టు ఉండగానే 2-0తో సిరీస్ సొంతం చేసుకున్నారు. 1968 తర్వాత కరీబియన్ దీవుల్లో 2004లో మాత్రమే సిరీస్ సాధించగలిగిన ఇంగ్లీష్ జట్టు వైఫల్య యాత్రం 2019లోనూ కొనసాగుతోంది. సీమర్లు కీమర్ రోచ్ (4/52), జేసన్ హోల్డర్ (4/43), జోసెఫ్ (2/12) నిప్పులు చెరగటంతో రెండో ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్ 132 పరుగులకే కుప్పకూలింది. అంతకముందు తొలి ఇన్నింగ్స్‌లో బెయిర్‌స్టో (52), మోయిన్ అలీ (60) అర్ధ సెంచరీలు సాధించిన ఇంగ్లీష్ జట్టు 187 పరుగులే చేయగల్గింది. కీమర్ రోచ్ (4/30), గాబ్రియల్ (3/45), జోసెఫ్ (2/38) చెలరేగారు. ఓపెనర్ బ్రాత్‌వేట్ (47), హోప్ (44) సహా డారెన్ బ్రావో (50) రాణించటంతో తొలి ఇన్నింగ్స్‌లో వెస్టిండీస్ 306 పరుగులు చేసింది. రెండో ఇన్నింగ్స్ పతనాంతరం విండీస్‌కు ఇంగ్లాండ్‌కు 14 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. ఓపెనర్లు బ్రాత్‌వేట్ (5), కాంప్ బెల్ (11) వికెట్ నష్టపోకుండా లక్ష్యాన్ని ఛేదించారు. 2.1 ఓవర్లలోనే 17 పరుగు లు సాధించి విండీస్‌కు ఆధునిక క్రికెట్‌లో అపురూపు టెస్టు విజయాన్ని అందించారు. విండీస్ సీమర్ కీమర్ రోచ్ 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State Editor : S.Veeraiah.Tel Tel/2014/59462.